PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 142 | విజయవాడ, బుధవారం 24 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 24 December 2025 | Rs

శాస్త్రీయ ఆలోచనతో సమస్యలకు పరిష్కారం

- బహుమతుల ప్రదానం సభలో ఎంఎల్‌సి గోపిమూర్తి
- ముగిసిన రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలు

2



షెఫాలీ ధనా ధన్..

- శ్రీచరణి, వైష్ణవి మాయాజాలం
- రెండో టి20లో శ్రీలంకపై భారత మహిళల గెలుపు

3

సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఇక అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే

- ప్రైవేటు ఆపరేటర్లకు మెయింటెనెన్స్
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఇక నుంచి ఎలక్ట్రిక్ బస్సులనే కొనుగోలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఎపిఎస్‌ఆర్‌టిసిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా ప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ బస్సులు 'పల్లె వెలుగు'వైనా తప్పనిసరిగా ఎసి బస్సులే ఉండాలని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టదలచిన 1,450 బస్సులు కూడా ఎలక్ట్రికల్ వెహికల్స్ (ఇవి)నే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. వీటితోపాటు కేంద్రం నుంచి మరో 1,050 ఇవి బస్సులు రానున్నాయన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి జిల్లాల్లో ఇవి ఛార్జింగ్ స్టేషన్లను ముందుగానే ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించిన టెండర్లను పిలవాలన్నారు. వచ్చే ఐదేళ్లలో 8,819 డీజిల్ బస్సుల స్థానంలో ఇవి బస్సులను ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. ఎనిమిదేళ్ల కన్నా ఎక్కువ కాలపరిమితి ఉన్న బస్సులను ఇవిలుగా మార్పిడి చేయాలని నిర్దేశించారు. ప్రయాణికుల అవసరాలు తీర్చేలా, సౌకర్యాలు మెరుగయ్యేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. 2030 నాటికి దశలవారీ డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్, సిఎన్‌జి బస్సులను మాత్రమే నిర్వహించాలన్నారు. దీంతో కాలుష్యం తగ్గడమే కాకుండా సంస్థపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. అలాగే ఇ-బస్సుల మెయింటెనెన్స్‌ను ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించాలన్నారు. స్త్రీ శక్తి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో తలెత్తిన రద్దీకి తగినట్లుగా నూతన బస్సులు ప్రవేశపెట్టాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో పర్యావరణ హితంగా ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఇవి బస్సులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సిఎం తెలిపారు. స్వయం సమృద్ధి సాధించేలా రైల్వే శాఖ తరహాలో ఎపిఎస్‌ఆర్‌టిసి కార్గో రవాణాపై మరింత దృష్టి పెట్టాలన్నారు. అన్ని బస్టేషన్లకు వాణిజ్య పరంగా మరింత ఆదాయం వచ్చేలా ఆలోచన చేయాలన్నారు. థింక్ గ్యాస్ సంస్థ భాగస్వామ్యంతో చిత్తూరు-వేలూరు మార్గంలో నడిపే డీజిల్ బస్సులను సిఎన్‌జిగా మార్చే పైలట్ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతమైందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సమీక్షలో రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, సిఎస్ విజయానంద్, రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచేలా క్వాంటం కోర్సులు

- ఐఐటి మద్రాసు ప్రతినిధులతో సిఎం చంద్రబాబు

2

ఉన్నావో అత్యాచార దుండగుడికి బెయిల్

- ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు

న్యూఢిల్లీ : ఎనిమిదేళ్ళ క్రితం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన 'ఉన్నావో' అత్యాచార కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న బిజెపి బహిష్కృత నేత, మాజీ ఎంఎల్‌ఎ కుల్‌దీప్ సింగ్ సెన్‌గర్ జైలు శిక్షను సస్పెండ్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, జస్టిస్ హరీష్ వైద్యనాథన్ శంకర్‌తో కూడిన ధర్మాసనం బెయిల్‌పై కుల్‌దీప్ సింగ్‌ను విడుదల చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. రూ.15 లక్షల వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని, అంతే మొత్తానికి మూడు ష్యూరిటీలు కూడా అందచేయాలని ఆదేశించింది. బాధితురాలి ఇంటికి ఐదు కిలోమీటర్ల పరిధిలోకి రావద్దని, అలాగే ఆమెను గానీ ఆమె తల్లిని గానీ బెదిరించరాదని కూడా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం విధించిన షరతుల్లో ఏ ఒక్కటి ఉల్లంఘించినా అది, బెయిల్ రద్దుకు దారి తీస్తుందని కోర్టు స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టుకు పాస్‌పోర్టును అప్పగించాలని, ప్రతి సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో రిపోర్టు చేయాలని కూడా బెంచ్ షరతులు విధించింది.

అత్యాచార కేసులో తనను దోషిగా నిర్ధారించి, శిక్ష విధించడాన్ని సవాలు చేస్తూ కుల్‌దీప్ సింగ్ పెట్టుకున్న అప్పీల్‌ను పరిష్కరించేవరకు హైకోర్టు, సింగ్ శిక్షను నిలుపుచేసింది. ఈ అత్యాచార కేసులో 2019 డిసెంబరులో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును ఆయన సవాలు చేశాడు. కుల్‌దీప్ సెన్‌గర్ 2017లో మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి ఒడిగట్టాడు. 2019 ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ అత్యాచార కేసును, ఇతర సంబంధిత కేసులను ఉత్తరప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుండి ఢిల్లీకి బదిలీ చేశారు. కస్టడీలో వుంటుండగా జరిగిన బాధితురాలి తండ్రి హత్య కేసులో కూడా తనను దోషిగా నిర్ధారించడాన్ని సవాలు చేస్తూ కుల్‌దీప్ పెట్టుకున్న అప్పీల్ కూడా పెండింగ్‌లో వుంది. ఇప్పటికే జైల్లో చాలాకాలం గడిపినందున తన శిక్షను రద్దు చేయాలని ఆయన ఆ అప్పీల్‌లో కోరారు. కస్టడీ హత్య కేసులో ఆయనకు పదేళ్ల జైలు శిక్ష విధించారు.

కొత్త విధానంతో

తగ్గిన జిఎస్‌టి వసూళ్లు

- ప్రత్యామ్నాయం చూపని కేంద్రం
- 4.6 శాతం తగ్గిన ఆదాయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త జిఎస్‌టి విధానం రాష్ట్ర ఖజానాపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. సెప్టెంబర్‌లో ఈ విధానం అమలులోకి వచ్చినప్పటికీ, పూర్తి స్థాయి ప్రభావం నవంబర్‌లో కనిపించింది. అక్టోబర్ కన్నా నవంబర్‌లో నాలుగు శాతానికన్నా ఎక్కువగా ఆదాయం తగ్గినట్లు తేలింది. నూతన జిఎస్‌టి విధానాన్ని అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తగ్గుతున్న ఆదాయానికి ప్రత్యామ్నాయం చూపలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యంగా ఆర్థికశాఖ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 'ఆదాయం తగ్గుతున్న విషయం కేంద్ర ప్రభుత్వ దృష్టిలో ఉంది. కేంద్ర ఆర్థికశాఖకు దీనికి సంబంధించిన సమాచారం పంపాం.' అని ఒక ఉన్నతాధికారి చెప్పారు. నూతన విధానం అమలులోకి వచ్చిన మొదటి నెలలోనే ఆదాయం భారీ స్థాయిలో తగ్గడంతో కేంద్ర ఆర్థికశాఖ దృష్టికి ఆ విషయాన్ని తీసుకువెళ్లినట్లు సమాచారం. గత ఏడాది ఆ సమయానికి ఉన్న ఆదాయం, నూతన విధానంతో తగ్గిన ఆదాయం, ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్ర ఖజానా పరిస్థితి తదితర అంశాలను వివరిస్తూ కేంద్ర ఆర్థికశాఖకు పూర్తి సమాచారం పంపినట్లు తెలిసింది. అయితే, ఈ సమాచారం అంది నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన రాకపోవడం అధికారుల్లో చర్చనీయాంశమైంది. దీంతో రాష్ట్ర స్థాయిలోనే ప్రత్యామ్నాయం కోసం వెదుకుతున్నారు. అక్టోబర్ కన్నా నవంబర్‌లో ఆదాయం తగ్గడం కనిపించింది. గత ఏడాది అక్టోబర్‌లో 2,777 కోట్లు ఆదాయం రాగా, నవంబర్‌లో 2,827 కోట్లు వచ్చింది. ఈ ఏడాది అక్టోబర్‌లో 3,021 కోట్లు రాగా, నవంబర్‌లో కేవలం 2,697 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. ఇది 4.60 శాతం తక్కువగా ఉన్నట్లు తేల్చారు ఏడాదికి ఎనిమిది వేల కోట్ల రూపాయలు తగ్గే అవకాశం ఉందని అధికారులు గతంలో అంచనా వేశారు. అయితే, తాజా తగ్గుదలను పరిగణలోకి తీసుకుంటే అంతకన్నా ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు.

అసలే లీకేజిలు

పన్నుల వసూళ్లలో ఇప్పటికే నెలకొన్న లీకేజిల సమస్య ఖజానాకు భారంగా మారుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పన్నుల ఎగవేత కూడా మరో సమస్యగా ఉందని వారంటున్నారు. ఇప్పుడు జిఎస్‌టి స్లాబ్లుల మార్పు కూడా కొత్త సమస్యకు తెరలేపుతోందన్న భావన వారు వ్యక్తం చేస్తున్నారు. అందుకే జిఎస్‌టి నష్టాన్ని అధిగమించేందుకు కొత్త మార్గాలనుఎ అన్వేషించాలని యోచిస్తున్నారు. ప్రధానంగా లీకేజిల నివారణ, పాత బకాయిల వసూళ్లపైనే ఎక్కువగా దృష్టి సారించాలని భావిస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

జిఎస్‌టి వసూళ్ల వివరాలు (రూ. కోట్లలో)

నెల	2024	2025	వృద్ధి
సెప్టెంబర్	2596	2789	7.43
అక్టోబర్	2777	3021	8.77
నవంబర్	2827	2697	-4.60

నిరంకుశ దాడులపై ఐక్య పోరాటం

- ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె
- కేంద్ర కార్మిక సంఘాల పిలుపు
- ప్రజా,కార్మిక హక్కులను మోడీ సర్కార్ కాలరాస్తోందని ఆగ్రహం

7

పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలపై బ్రిటన్ ఉక్కుపాదం

- లండన్‌లో పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్ అరెస్టు

ఇనుమూరు గిరిజనులపై దౌర్జన్యకాండ

- రక్తం వచ్చేటట్లు లాఠీలతో చావబాదిన పోలీసులు
- మహిళలపైనా మగ పోలీసుల దాడి
- సాగు చేసుకుంటున్న మొక్కజొన్న పంట ధ్వంసం
- గిరిజనేతర భూస్వాములకు కొమ్ముకాసిన రెవెన్యూ, అధికార యంత్రాంగం

మొక్కజొన్న చేలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా అడ్డుకుంటున్న గిరిజనులు
(ఇన్‌సెట్‌లో) పోలీసుల దెబ్బలకు రక్తం కారుతున్న గిరిజన యువకుడు చంద్రశేఖర్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గ్రామ గిరిజనులపై మంగళవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు రెచ్చిపోయారు. ఏజెన్సీలో మారుమూల గ్రామం... అడిగేవారు ఉండరన్న ధైర్యంతో విధ్వంసకాండ సాగించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న మొక్కజొన్న పంటను తహశీల్దార్ పివి.చలపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ధ్వంసం చేశారు. ట్రాక్టర్‌తో దున్నించేశారు. అడ్డుకున్న వారిపై దౌర్జన్యకాండకు పాల్పడ్డారు. మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా రక్తం వచ్చేటట్లు లాఠీలతో పోలీసులు చావచితకబాదారు. గిరిజన మహిళలపై మగ పోలీసులు విచక్షణారహితంగా

మిగతా 2లో

గిరిజనులపై దాడిని ఆపండి

- పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి డిమాండ్

2

ఎఎస్‌జిగా 'కనకమేడల'

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



టిడిపి మాజీ ఎంపి, సీనియర్ న్యాయవాది కనకమేడల రవీంద్ర కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. సుప్రీం కోర్టులో కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించే అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి)గా నియామకమయ్యారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. కనకమేడల రవీంద్ర కుమార్ నియామకం న్యాయ రంగంలో ఆయనకున్న అనుభవానికి, సామర్థ్యానికి గుర్తింపుగా రాజకీయ, న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించిన న్యాయ అంశాలపై కనకమేడల కీలకపాత్ర పోషించనున్నారు. రాజ్యాంగపరమైన కీలక వివాదాల్లో ప్రభుత్వ వాదనను ఆయన బలంగా వినిపిస్తారని కేంద్రం భావిస్తోంది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఆయనతోపాటు సీనియర్ న్యాయవాదులు అనిల్ కౌశిక్, దేవిందర్ పాల్ సింగ్ కూడా అదనపు సొలిసిటర్ జనరల్స్‌గా నియామకమయ్యారు.

'ఏకీకృత' సర్వే ప్రారంభం

మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రతి కుటుంబ వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేసేందుకు ఏకీకృత కుటుంబ సర్వే (యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే - యుఎఫ్ఎస్)ను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ మేరకు మార్గదర్శకాలను (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్) జారీ చేసిన ప్రభుత్వం మంగళవారం నుండే సర్వే చేపడుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే సర్వే ప్రారంభమైనట్లు వార్తలు వస్తున్నాయి. సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించి యాప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల సిబ్బంది, పట్టణ ప్రాంతాల్లో వార్డు సచివాలయాల సిబ్బంది సర్వే నిర్వహించనున్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ సర్వే యాప్ డేటా బేస్ మొత్తం పర్యవేక్షణ చేయనున్నారు. ప్రణాళిక శాఖ రాబట్టాల్సిన సమాచారానికి సంబంధించిన ప్రశ్నావళిని రూపొందించిడం, సిబ్బందికి అవసారవైన శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్టిజిఎస్ ఇందుకు సంబంధించిన సాంకేతిక సహకారం, యాప్ రూపకల్పన, డ్యాష్ బోర్డు నిర్వహణ చేపట్టనుంది. ఆయా జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు సర్వేకు సంబంధించి మౌలిక వసతుల కల్పన, పర్యవేక్షణ, సమస్యల పరిష్కార బాధ్యతలు తీసుకోనున్నారు. ఆయా జిల్లాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్లు సర్వే ప్రగతిని పర్యవేక్షిస్తారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు మండల, మున్సిపల్ స్థాయిలో సర్వేను పర్యవేక్షిస్తారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు అడ్మిన్‌లు వారి పరిధిలో సర్వేను పర్యవేక్షిస్తారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సరి చూసి డేటాను నమోదు చేస్తారు. ప్రభుత్వ సేవలను పౌరులకు సజావుగా చేసుకోవడానికి, తక్షణం సేవలు అందించడానికి ఈ సర్వే ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా ఆర్టీజిఎస్ డేటా లేక్‌లో అందుబాటులో ఉన్న ప్రజల సమాచారం ఖచ్చితమైనదని నిర్ధారించుకోవడం, మరింత ఖచ్చితమైన సమాచారం నమోదు చేయడం కోసం, ప్రభుత్వ విభాగాలకు ధృవీకరించిన డేటాను అందించడానికి తాజా సమాచారం సేకరిస్తున్నట్లు పేర్కొంది.

ఎసిబి దాడులు

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ల ఇళ్లలో సోదాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

అవినీతి నిరోధక శాఖాధికారులు సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల దాడులు నిర్వహించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ, సబ్‌రిజిస్ట్రార్లు, కార్యాలయాల సిబ్బంది, అక్కడ అనధికారికంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ వ్యక్తుల ఇళ్లలోనూ ఏకకాలంలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా బంగారం, డబ్బు, కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ ఇంట్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి అవినీతిశాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. భవానీపురం టెలిఫోన్ కాలనీలోని ఆయన నివాసంలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ బదిలీపై వెళ్లిన నేపథ్యంలో ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని, కోట్లాది రూపాయలు అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఎసిబి అధికారులు ఇబ్రహీంపట్నం రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ, భవానీపురంలోని మహమ్మద్ ఇంట్లోనూ, అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దివ్య ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. మంగళవారం రాత్రి వరకు సోదాలు కొనసాగుతున్నాయి. అనంతపురం రాజహంస గోల్డెన్ హోమ్స్‌లో ఉన్న చిలమత్తూరు మాజీ సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్‌బాబు ఇంట్లో ఎసిబి డిఎస్‌పి ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో అక్కడి కార్యాలయంలో అనధికారికంగా వ్యవహరిస్తున్న సోమశేఖర్ ఇంట్లో కోర్టు ఉత్తర్వుల మేరకు ఎసిబి అధికారి జయమ్మ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఆయన ఇంట్లో పలు పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు జరిగాయి. భోగాపురంలో ఒక ప్రైవేట్ ఏజెంట్ ఇంట్లోనూ సోదా చేశారు. ఆయన వద్ద భారీ మొత్తంలో బంగారం, నగదు, కొన్ని ఆస్తిపత్రాలు లభించినట్లు సమాచారం. విశాఖలోని రామ్‌నగర్‌లో ఉంటున్న జగదాంబ సెంటర్ సబ్ రిజిస్ట్రార్ ఎస్.మోహనరావు ఇంట్లో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. గత నెల 5న జగదాంబ సెంటర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పై ఎసిబి అధికారులు ఆకస్మికంగా దాడులు జరపగా అనధికారికంగా రూ.10 వేలు కలిగి ఉన్నట్లు గుర్తించి సబ్ రిజిస్ట్రార్ మోహనరావుపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంట్లో ఇప్పుడు సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

నేడు నింగిలోకి 'బ్లూబర్డ్'

- ఇస్రో వందో ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

మనదేశం మరో కీలక అంతరిక్ష ప్రయోగానికి సిద్ధమైంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో తన వందో ప్రయోగాన్ని విజయవంతం చేయడానికి పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేసింది. భారత్- అమెరికా సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రయోగం ద్వారా అమెరికాకు చెందిన 'బ్లూ బర్డ్ 2' భారీ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ఇస్రో పంపనుంది. సుమారు 6.5 టన్నుల బరువు ఉన్న ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చనుంది. బుధవారం ఉదయం 8.54 గంటలకు జరగనున్న ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించి కౌంట్‌డౌన్ మంగళవారం ఉదయం 8.54 గంటలకు ప్రారంభమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌విఎం3 ఎం6 రాకెట్ ద్వారా ఈ వాణిజ్య ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. భూమికి సుమారు 520 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. ప్రపంచవ్యాప్తంగా నేరుగా మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ సేవల కోసం ఎంతగానో ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

పెద్ద పులి మృతి

వాహనం ఢీకొనడంతో మృతి చెందిన పెద్ద పులి

ప్రజాశక్తి- మాచర్ల (పల్నాడు జిల్లా)

రోడ్డు దాటుతున్న పెద్ద పులిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో, పెద్ద పులి అక్కడికక్కడే మృతి చెందింది. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... మాచర్ల-శ్రీశైలం రహదారిలో పులి చనిపోయినట్లు గమనించిన కొందరు ప్రయాణికులు సమీపంలోని చెక్‌పోస్టు సిబ్బందికి తెలియజేశారు. దీంతో, వారు వచ్చి పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు ఈ సమాచారం ఇచ్చారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మాచర్ల-హైవే రోడ్డు పనులు ఇటీవలే ఈ ప్రాంతంలో పూర్తయ్యాయి. మాచర్ల సమీపంలో ఇప్పటికీ పనులు జరుగుతున్నాయి. హైవే రోడ్డుకు ఇరుపక్కల అటవీ ప్రాంతం ఉండడంతో వన్య ప్రాణుల రక్షణ కోసం అవి వెళ్లే మార్గాల వద్ద అండర్‌పాస్‌లు ఏర్పాటు చేశారు. అయితే, ప్రస్తుతం మృతి చెందిన పెద్ద పులి మరో జంతువును వేటాడే క్రమంలో రోడ్డుపైకి వచ్చి ఉంటుందని, ఈ సందర్భంలో ప్రమాదం జరిగి ఉంటుందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, పోస్టుమార్టం అనంతరం ఇతర సమాచారం వెల్లడిస్తామని అటవీ శాఖాధికారులు తెలిపారు. కాగా, ప్రమాదం జరిగిన ప్రదేశంలో సిసి కెమెరాలు లేనట్లు తెలిసింది. మాచర్ల-శ్రీశైలం మధ్య అటవీ ప్రాంతాన్ని టైగర్ జోన్‌గా నిర్ధారించినా పులుల సంచారంపై అటవీ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు నిఘా విధించలేదన్న విమర్శలున్నాయి. పులి జనసంచారంలోకి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం వల్ల ముప్పు తప్పిందని, లేదంటే ప్రజలు, ఇతర జంతువులపై దాడి చేసి ఉండే అవకాశం లేకపోలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులకు టైగర్ ప్రాజెక్టుపై తగిన పర్యవేక్షణ చేయడం లేదని విమర్శిస్తున్నారు. పులుల కదలికలను గమనించడానికి సాంకేతిక పరిజ్ఞానం, సిబ్బంది అవసరం పలువురు అభిప్రాయపడుతున్నారు.

హోల్డ్‌లో ఫిట్‌నెస్ ఛార్జీలు

- ముఖ్యమంత్రికి ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రూ.1,300 ఉన్న ఫిట్‌నెస్ ఛార్జీలను ఒకేసారి రూ.33 వేలకు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టడంతో లారీ యజమానులకు భారీ ఊరట లభించిందని ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వైవి ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ ఛార్జీలు రాష్ట్రంలో అమలు చేయొద్దని తాము సిఎం చంద్రబాబు, మంత్రి, రవాణాశాఖ అధికారులను ఇటీవల కలిసి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

నైపుణ్యం పెంచేలా క్వాంటం కోర్సులు

- పాఠశాలల్లో దశలవారీ కంప్యూటర్ ల్యాబులు
- ఐఐటి మద్రాసు ప్రతినిధులతో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యువతకు నూతన నైపుణ్యాల కోసం త్వరలో క్వాంటం టెక్నాలజీ కోర్సులను అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. టెక్ విద్యార్థులు క్వాంటం, ఎఐ రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకునేలా వారికి శిక్షణ ఇప్పించడంతోపాటు పాఠశాల స్థాయి నుండే క్వాంటం టెక్నాలజీపై అవగాహన కల్పించాలని సిఎం సూచించారు. వెలగపూడి సచివాలయంలో ఐఐటి మద్రాసు ప్రతినిధులతో సిఎం మంగళవారం సమావేశమయ్యారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో డిజిటల్ పద్ధతుల ద్వారా విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించేలా రూపొందించిన ప్రతిపాదనను ముఖ్యమంత్రికి ఐఐటి ప్రతినిధులు వివరించారు. వచ్చే ఏడాది నుండి రెండేళ్ల పాటు నాలుగు విడతల్లో విద్యార్థులకు ఎఐపై అవగాహన కల్పించేందుకు యాక్షన్‌ప్లానుకు సంబంధించిన విషయాలనూ తెలియజేశారు. వాటిని పరిశీలించిన అనంతరం సిఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికీ క్వాంటం టెక్నాలజీపై అవగాహన ఉండాలని, రాష్ట్రాన్ని నాలెడ్జి హబ్‌గా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఇక్కడి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తయారు చేయాలని అన్నారు. ప్రైవేటు విద్యార్థులతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు క్వాంటం

టెక్నాలజీ పట్ల అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. దీనికోసం పాఠశాలల్లో దశలవారీ కంప్యూటర్ ల్యాబులు ఏర్పాటు చేసేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరపాలని తెలిపారు. 2026 జనవరి నెలాఖరులో స్టూడెంట్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహిస్తామని, ఆ సమ్మిట్లో విద్యార్థులు తమ ఇన్నోవేషన్స్ ప్రదర్శించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆలోచన కలిగించేందుకు ఇటువంటి సదస్సులు విద్యార్థులకు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. అలాగే క్వాంటంలో స్కిల్స్ అప్‌గ్రేడ్ చేసుకోవడం కోసం కేంద్రం చేపడుతున్న నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హ్యాన్స్‌డ్ లెర్నింగ్ వేదికను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. 50 వేలమందికి పైగా టెక్ విద్యార్థులకు క్వాంటం నైపుణ్యంపై శిక్షణ ఇవ్వాలన్నారు. 2026 నెలాఖరు నాటికి పాఠశాలలు ఆ దిశగా మారాలని సూచించారు. వివిధ ఐఐటిలు క్వాంటం విషయంలో చేస్తున్న అధ్యయనాలను కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో ట్రూ 5జి సేవల విస్తరణపై బిఎస్ఎన్ఎల్ అధికారులతో సిఎం సమీక్షించారు. ఈ సమావేశంలో విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారులతోపాటు ఐఐటి మద్రాసు, తిరుపతి, ఐబిఎం సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు ప్రయోజనం కలిగించేలా కేలండర్ : సిఎం

రైతులకు ప్రయోజనం కలిగించేలా రబీ-ఖరీఫ్-రబీ పంటలకు సంబంధించిన కేలండర్ రూపొందించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఇందుకు అనుగుణంగానే పంటల హార్వెస్టింగ్, మార్కెటింగ్ జరిగేలా చూడాలన్నారు. ధాన్యం సేకరణ, వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. రబీ-ఖరీఫ్-రబీ సీజన్లలో ఎలాంటి పంటలు వేయాలి, రైతులకు ఏది ప్రయోజనం అనే అంశాలను వారికి అవగాహన కల్పించాలన్నారు. కోల్డ్‌చైన్ సహా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను తరలించడంతో పాటు ప్రాసెసింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ మార్కెట్లకు పంట ఉత్పత్తులను తరలించేలా రైల్ కార్గో వంటి లాజిస్టిక్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. వివిధ జిల్లాల్లో నిర్దేశిత గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎదురవుతున్న బ్యాంకు గ్యారెంటీ సమస్యల్ని పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిఎం స్పష్టం చేశారు. ఈ సమీక్ష నుంచే రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కన్వీనర్‌తో ఆయన మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు.

మామిడి రైతులకు నష్టం కలిగిస్తే చర్యలు

మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.184 కోట్లు రాయితీగా చెల్లింపులు చేసిందని, ఏ రాష్ట్రంలోనూ లేనట్లుగా కేజీకి రూ.4 అదనపు ధర చెల్లిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతుల ఇబ్బందులను 10 రోజుల్లో పరిష్కరించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పండ్ల ఉత్పత్తి కేంద్రంగా ప్రకాశం, రాయలసీమ జిల్లాలు తయారుకావాలన్నారు.

గిరిజనులపై దాడిని ఆపండి

- పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏలూరు జిల్లా ఇనుమూరులో గిరిజనులు వేసిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి అడ్డొచ్చిన గిరిజనులపై, గిరిజన మహిళలపై దాడికి పాల్పడిన పోలీసు, రెవెన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తక్షణం ఈ విషయంలో పోలీసు జోక్యాన్ని ఆపాలని డిజిపికి ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసులు ఆ గ్రామాన్ని చుట్టిముట్టి భయోత్పాత వాతావరణాన్ని సృష్టిస్తున్నారని, వారిని ఉపసంహరించి పేద గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్.. రెవెన్యూ అధికారుల జోక్యాన్ని ఆపాలన్నారు.

గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా పోలీసులు, మండల రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా పంటను ధ్వంసం చేయడం దుర్మార్గమని తెలిపారు. గిరిజన మహిళలపై మగ పోలీసులే దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను గిరిజనులు తమ పూర్వీకుల నుంచి చదును చేసి సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అసైన్‌మెంట్ చేయాలని అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదని తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికే హైకోర్టులో కేసు నమోదై ఉన్నప్పటికీ పోలీసులు భూస్వాముల పక్షం వహించడం కోర్టు ధిక్కరణే అవుతుందని పేర్కొన్నారు. 1/70 చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీలో ఈ రకంగా పోలీసు, అధికార యంత్రాంగం వ్యవహరించడం, గిరిజనులపై చట్టవిరుద్ధంగా దాడికి దిగడాన్ని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

పశ్చిమ కాలువ సగం పూడ్చివేత

- రెండు వైపులా మట్టితోలిన కాంట్రాక్టు కంపెనీ ఎన్‌సిసి
- ఇరిగేషన్ అధికారుల గగ్గోలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతికి అనుసంధానంగా సీతానగరం వద్ద నిర్మిస్తున్న స్టీలు బ్రిడ్జికి సంబంధించిన పనుల కోసం కృష్ణా పశ్చిమ కెనాల్‌ను పూడ్చివేశారు. అనుమతి లేకుండా మట్టిని తోలారని జలవనరులశాఖ అధికారులు గగ్గోలు పెడుతున్నారు. తమ మెడకు చుట్టుకుంటుందనే ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కాంట్రాక్టు కంపెనీ మాత్రం తన పని తాను చేసుకుపోతోంది. అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డును జాతీయ రహదారి 16లో కలిపేందుకు వీలుగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన పనులూ మొదలయ్యాయి. మరోవైపు కొండవీటివాగు స్లూయిస్ వద్ద కరకట్ట రెండు లైన్లుగా విస్తరించాలని ప్రతిపాదనలు రూపొందించారు. ఈ నేపథ్యంలో సీతానగరం పాత జాతీయ రహదారి నుండి కనెక్టివిటీ కోసం స్టీలు బ్రిడ్జి నిర్మించాలని నిర్ణయించారు. కొండవీటి వాగు నుండి కృష్ణా పశ్చిమ కాలువలో ఏర్పాటుచేసిన గేట్ల పక్కన పిల్లర్లు వేశారు. జాతీయ రహదారి వైపు కెఎల్‌రావు కాలనీ వద్ద పిల్లర్లు వేస్తున్నారు. వీటికోసం కృష్ణా పశ్చిమ కాలువను రెండు వైపులా మట్టితో పూడ్చేశారు. దీనికి జలవనరులశాఖ నుండి అనుమతులు లేవు. ఇన్‌లాండ్ వాటర్‌వేస్ పరిధిలో ఉన్న కాలువ కావడంతో ఏదైనా ప్రధాన వంతెన నిర్మించాలంటే సిడిఒ నుండి అనుమతులు కావాలి. అయితే అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుండి పనులు చేపడుతున్న కాంట్రాక్టు కంపెనీ ఎన్‌సిసి ఎటువంటి అనుమతులూ తీసుకోలేదు. దీనిపై ఇరిగేషన్ అధికారులు వివరణ కోరగా తాత్కాలిక వంతెన పేరుతో ప్లాను సమర్పించారు. అయితే రెండు వైపులా కొంత మట్టిపోస్తామని కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు జలవనరులశాఖ అధికారులకు తెలిపారు. రెండు వైపులా కొంత మాత్రమే పూడుస్తామని చెప్పిన కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు ఆచరణలోకి వచ్చేప్పటికి కాలువను దాదాపు సగం పూడ్చివేశారు. మంగళవారం వీటిని పరిశీలించిన జలవనరులశాఖ అధికారులు ఈ వ్యవహారం తమ మెడకు చుట్టుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి పూడిక తీయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఉన్నతాధికారులందరూ బాగానే ఉంటారని, దిగువస్థాయి సిబ్బందిపైనే చర్యలు ఉంటాయని జలవనరులశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదుపు తప్పిన బైక్

- ముగ్గురు యువకులు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర (పశ్చిమగోదావరి జిల్లా)

గోడను బైక్ ఢీకొని ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని పొలమూరులో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొలమూరు గ్రామంలో చర్చి వద్ద సోమవారం రాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఏలేటి రాజు (22), ఏలేటి అంజిబాబు (అంజి) (25), కోళ్ల సత్యనారాయణ (20) పాల్గొన్నారు. తిరిగి ఒకే బైక్‌పై ముగ్గురు ఇళ్లకు బయల్దేరారు. పొలమూరు బస్టాండ్ ప్రాంతం దాటుతున్న క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న టిప్‌టాప్ దుకాణం గోడను బైక్ బలంగా ఢీకొంది. ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో బ్రాహ్మణచెర్వు సమీపంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే వారంతా మృతి చెందారని వైద్యులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెనుగొండ సిఐ రాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి ఎస్ఐ వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో అర్ధరాత్రి వేళ జన సంచారం తక్కువగా ఉంటుంది. పైగా సిమెంట్ రోడ్డు కావడంతో బైక్‌ను మితిమీరిన వేగంతో నడిపినట్లు తెలుస్తోంది.

ఆప్కో వస్త్రాలపై భారీ రాయితీ

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని ఆప్కో షోరూమ్‌లలో భారీ రాయితీలకు వస్త్రాల అమ్మకాలు చేయనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. 60, 50, 40 శాతం రాయితీలపై చేనేత వస్త్రాలను విక్రయించనున్నామని, ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో చేనేత, జౌళిశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంగళవారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా తిరుపతిలో చేనేత బజార్‌ను నిర్వహించనున్నామని వెల్లడించారు. మరో రెండు రోజుల్లో చేనేత సహకార సంఘాల నుంచి వస్త్రాలు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మెగా క్లస్టర్ల ఏర్పాటు, గడిచిన మూడు నెలల్లో ఆప్కో విక్రయాలపై మంత్రి ఆరా తీశారు. గుంటూరు చేనేత ఎడి కార్యాలయంలో, మంగళగిరి యర్రబాలెంలో ఏర్పాటుచేసే ప్రత్యేక కౌంటర్లలో 60 శాతం రాయితీపై విక్రయాలు జరపనున్నట్లు తెలిపారు. విజయవాడలోని ఆప్కో మెగా షోరూమ్‌లో 50 శాతం రాయితీపై, రాష్ట్రంలోని మిగిలిన అన్ని ఆప్కో షోరూమ్‌లలో 40 శాతం రాయితీపై సంక్రాంతి వరకూ అమ్మకాలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

'పశ్చిమ'కు చెందిన ఆర్మీ జవాన్ డార్జిలింగ్‌లో మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆర్మీ జవాన్ పశ్చిమబెంగాల్లోని డార్జిలింగ్‌లో మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులకు మంగళవారం సమాచారం అందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సనాయిల శేఖర్ (25) పశ్చిమబెంగాల్లోని డార్జిలింగ్ సమీపంలో శీతాకాలం శిక్షణలో ఉన్నారు. అక్కడి నదిలో గల్లంతైనట్లు ఆర్మీ అధికారులు మంగళవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడ సుదీర్ఘ రెస్క్యూ ఆపరేషన్ అనంతరం శేఖర్ మృతదేహాన్ని గుర్తించారు. జవాన్‌కు తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు. శేఖర్ మరణ వార్త తెలియడంతో ఆలమూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

కూతుళ్లను చంపేసిన తండ్రి

ప్రజాశక్తి- బొమ్మనహాల్ (అనంతపురం)

ఇద్దరు కూతుళ్లను నీటిలో తోసేసి ఊపిరి తీశాడు ఓ కర్నాటక తండ్రి. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామానికి చెందిన దంపతులు కురుబ కల్లప్ప, శిల్పికు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు సింధూ (6), అనుష్క (5) నేమకల్లు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. కర్ణాటకలోని ఓ దేవస్థానానికి వెళ్తున్నానని ఈ నెల 21న ఇంట్లో చెప్పి తన ఇద్దరు కుమార్తెలను తనతో పాటు తండ్రి తీసుకువెళ్లాడు. నీళ్ల తాగుదామంటూ కర్ణాటకలోని సిరిగిరి గ్రామం వద్ద ఉన్న ఎల్ఎల్‌సి కెనాల్ వద్దకు కుమార్తెలను తీసుకువెళ్లి తోసేశాడు. సింధూ మృతదేహం లభ్యమైంది.

శాస్త్రీయ ఆలోచనతో సమస్యలకు పరిష్కారం

- బహుమతుల ప్రదానం సభలో ఎంఎల్‌సి గోపిమూర్తి
- ముగిసిన రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

బహుమతులు అందజేస్తున్న ముఖ్య అతిథులు

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తేనే సమాజంలోని సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి అన్నారు. జెవివి ఆధ్వర్యంలో కాకినాడలోని జెఎన్‌టియుకెలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు మంగళవారంతో ముగిశాయి. జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపిమూర్తి హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరిశోధనల వైపు మొగ్గుచూపాలని సూచించారు. కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు హేతుబద్ధమైన ఆలోచన కలిగి ఉంటేనే భావితరాలకు మంచి సమాజాన్ని అందించ గలుగుతామన్నారు. కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్రీయ సమాజం ఏర్పాటే లక్ష్యంగా 38 ఏళ్లుగా జెవివి కృషి చేస్తోందని చెప్పారు. మూఢ విశ్వాసాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, అందరికీ విద్య, నాణ్యమైన వైద్యం కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో ఈ ఏడాది 4.60 లక్షల మంది ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వచ్చే నెలలో యురేకా యురేకా సైన్స్ ప్రయోగాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సత్యా స్కాన్ అధినేత కాదా వెంకటరమణ, చెకుముకి సంబరాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, కాకినాడ సిపోర్ట్ సిఇఒ ఎం.మురళీధర్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధి వంశీకృష్ణ, రాష్ట్ర చెకుముకి కన్వీనర్ కెఎంఎంఆర్.ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు ప్రభాకర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కర్నూలు జిల్లాకు చెందిన ఎపిజె అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, గుంటూరు జిల్లాకు చెందిన శ్రీ నరసింహ గవర్నమెంట్ హైస్కూల్ ద్వితీయ, శ్రీసత్యసాయి జిల్లా బుదిరెడ్డిపల్లిలోని జడ్‌పిజిహెచ్‌ఎస్ తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రయివేటు పాఠశాలల విభాగంలో కర్నూలు జిల్లాకు చెందిన ది ఎతేన్సా స్కూల్ ప్రథమ, వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన శ్రీ సాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ద్వితీయ, కాకినాడ ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ తృతీయ స్థానాలు సాధించాయి.

ప్రజాబలం మనవైపే

- మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదేనని, ప్రజాబలం మన వైపే ఉందని, టిడిపి కూటమి నాయకులు పెట్టే ప్రలోభాలకు తలవొంచొద్దని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం బెంగళూరు నుంచి పులివెందులకు వచ్చిన జగన్‌కు కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రామచమల్లు శివప్రసాద్‌రెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి స్వాగతం పలికారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న చేస్తున్న జగన్

అనంతరం స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జిల్లాలోని ముఖ్య నేతలు, ప్రజల నుంచి జగన్ వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ, కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలు కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ వాగ్దానాలను తుంగలో తొక్కిందని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో అభివద్ధి నిలిచిపోయిందని, అరాచకాలు, దందాలు ఎక్కువయ్యాయని అన్నారు. మూడు సంవత్సరాలు ఓపిక పట్టండి మన ప్రభుత్వం వస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఇటీవల కడప నూతన మేయర్‌గా ఎన్నికైన పాకాల సురేష్‌ను కండువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎన్నో ఆటుపోట్లును ఎదుర్కొని సమిష్టిగా పనిచేయడం వల్లే మేయర్ స్థానాన్ని నిలబెట్టుకున్నామన్నారు. ప్రతి ఎన్నికల్లో సమిష్టిగా పోరాడాలని వైసిపి శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బద్వేల్, రాజంపేట ఎమ్మెల్యేలు సుధా, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కమలాపురం, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కోరముట్ల శ్రీనివాసులు, బద్వేల్ ఇన్‌ఛార్జి డిసి.గోవిందరెడ్డి పాల్గొన్నారు.

నేడు ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జగన్

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పాల్గొనన్నారు. ఇడుపులపాయలోని ప్రార్థన మందిరంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ముఖ్య నేతలు పాల్గొని వచ్చే స్థానిక ఎన్నికల గురించి, జిల్లాలో జరుగుతున్న రాజకీయాలపై చర్చించనున్నారు.

మంత్రి నారాయణ తో మాట్లాడుతున్న కె ఉమామహేశ్వరరావు తదితరులు

సమ్మె కాలం జీతంపై సిఎం సుముఖత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులకు గత జులై సమ్మె కాలంలో జీతం చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులకు పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, ఇతర నాయకులు మంత్రి నారాయణను, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్‌ను రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా క్రిస్మస్, సంక్రాంతి పండగలు సమీపిస్తున్న నేపథ్యంలో సమ్మెకాలం జీతం విడుదల చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఈ విషయంపై సుముఖత వ్యక్తం చేశారని అధికారుల దృష్టికి తీసువెళ్లామని, త్వరలోనే సమ్మెకాలం జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. కార్మికుల ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచే విషయం మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

గర్భిణిపై దాడి కేసులో నిందితుడు అరెస్టు

- రోడ్డుపై నడిపించి స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుక సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లులో మండలం ముత్యాలచెరువు గ్రామంలో ఓ గర్భిణిపై దాడి జరిగిన ఘటనపై పోలీసులు స్పందించారు. గర్భిణిపై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి కదిరి పట్టణంలో రోడ్లపై నడిపించుకుంటూ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కదిరి డిఎస్‌పి శివనారాయణస్వామి వెల్లడించిన వివరాల మేరకు... తనకల్లు మండలం ముత్యాలచెరువుపల్లి గ్రామంలో దంపతులు పుప్పాల గిరీష్ బాబు, సంధ్యారాణి నివసిస్తున్నారు. ప్రస్తుతం సంధ్యారాణి ఏడు నెలల గర్భిణి. వీరి ఇంటి వద్దనే పుప్పాల అజయ్ దేవ, ఆయన తండ్రి పుప్పాల అంజినప్ప ఉంటున్నారు. ఈ నెల 21న అజయ్ దేవ, అంజినప్ప వారి కుటుంబసభ్యులు కలిసి జగన్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటి ముందు రహదారిపై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున టపాసులు పేల్చారు. తాను గర్భిణిని అని టపాసులు పేల్చవద్దని సంధ్యారాణి కోరారు. ఈ సమయంలో పుప్పాల అజయ్ దేవ, అంజినప్ప ఆమెతో గొడవకు దిగారు. తన ఇంట్లో ఉన్న కట్టెను తీసుకుని వచ్చి సంధ్యారాణిపై అజయ్‌దేవ దాడికి ప్రయత్నించగా ఆమె తప్పించుకున్నారు. వెంటనే సంధ్యారాణి గొంతు పట్టుకుని గోడకు నెట్టేశాడు. సంధ్యారాణి కడుపు మీద కాలితో బలంగా అజయ్ దేవ తన్నడంతో తీవ్ర గాయంతో సంధ్యారాణి కిందపడిపోయారు. అంజినప్పతో కలిసి అజయ్‌దేవ్ అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తనకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు అజయ్‌దేవ్‌ను తనకల్లు మండలం నేషనల్ హైవే కదిరి-మదనపల్లి బిటి రోడ్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కదిరి పట్టణంలో రోడ్లపై నడిపించుకుంటూ స్టేషన్‌కు తీసుకెళ్లారు. మిగతా నలుగురు నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని డిఎస్‌పి తెలిపారు.

ఇనుమూరు గిరిజనులపై దౌర్జన్యకాండ

(మొదటిపేజి తరువాయి)

దాడి చేశారు. గిరిజన యువకుడు చంద్రశేఖర్ రక్తం కారుతున్నా తమ పంటను నాశనం చేయవద్దంటూ వేడుకున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు కర్కశంగా వ్యవహరించారు. గిరిజనుల ఆర్తనాదాలు మారుమూల కొండల్లో మార్మోగాయి. బాధిత గిరిజనుల కథనం ప్రకారం... ఇనుమూరు గ్రామంలో 57 ఎస్‌టి కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం శివారు ఇనుమూరు గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 221లో 3.34 ఎకరాలు, 223లో 8.74 ఎకరాలు, 210లో 6.67 ఎకరాలు, 217లో 7.52 ఎకరాలు, 213లో 9.50 ఎకరాలు, 214లో ఏడు ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూములను గ్రామ గిరిజనుల పూర్వీకులు చదును చేసి సాగులోకి తెచ్చారు. తరతరాలుగా తాతదండ్రుల నుండి సాగు చేసుకుంటున్న ఈ భూముల్లో బొబ్బర, మినుము, మొక్కజొన్న సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఈ భూములను తమకు అసైన్‌మెంట్ చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండాపోయింది. పైగా గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా పోలీసులు, మండల రెవెన్యూ అధికారులు వ్యవహరించారు. గిరిజనులు పండిస్తున్న మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో బలవంతంగా దున్నించేశారు. దీనిని అడ్డుకున్న గిరిజనులపై పోలీసులు, రెవెన్యూ అధికారులు విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారు. గిరిజన మహిళలపై మగ పోలీసులు దాడికి పాల్పడ్డారు. ఈ భూముల సమస్యపై ఇప్పటికే హైకోర్టులో కేసు ఉంది. అయినప్పటికీ అధికారులు ప్రొటెక్షన్ ఆర్డర్ ఏ విధంగా ఇచ్చారో చెప్పాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : కలెక్టర్‌కు సిపిఎం వినతి

ఇనుమూరు గ్రామంలో గిరిజనుల మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి, గిరిజనులపైనా, గిరిజన మహిళలపైనా దాడి చేసిన పోలీసులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మెయిల్ ద్వారా కలెక్టర్‌కు పంపించిన వినతిపత్రంలో పలు వివరాలు పేర్కొన్నారు. గ్రామంలో గిరిజనులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములు అక్కడి వారికే చెందుతాయని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టిడిపి కూటమి పాలనలో అంతటా అవినీతి

- పవన్ కల్యాణ్ భాష అభ్యంతరకరం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

టిడిపి కూటమి పాలనలో అన్ని స్థాయిల్లో అవినీతి రాజ్యమేలుతోందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. యూరియా కొరతపై కుంటి సాకులు చెబుతున్నారని విమర్శించారు. ఉక్రెయిన్ యుద్ధమే కారణమైతే ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల్లో లేని కొరత ఎపిలోనే ఎందుకని ప్రశ్నించారు. విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బొత్స పలు అంశాలపై మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్య అందించాలన్నదే వైసిపి లక్ష్యమన్నారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంచాలన్నదే తమ పార్టీ విధానమని చెప్పారు. ప్రైవేటీకరణ పేరుతో స్కాములకు తాము విరుద్ధమన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణను రద్దు చేయడంతో పాటు స్కాములకు పాల్పడ్డ వారిపై చర్యలు ఖాయమని హెచ్చరించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ భాషపై బొత్స అభ్యంతరం వ్యక్తం చేశారు. గోదావరి జిల్లాల్లో యథేచ్ఛగా పేకాట క్లబ్బులు నిర్వహిస్తున్నా, సీ పోర్టుల ద్వారా లక్షల టన్నుల పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ చట్టంలో కేంద్రం మార్పులు చేస్తుంటే ఎందుకు నోరు మెదపడంలేదన్నారు. ప్రతిరోజూ పత్రికల్లో మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు, సంక్షేమ హాస్టళ్లలో కొరవడిన తాగునీరు, పౌష్టికాహార వార్తలే దర్శనమిస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ పాలనకు ఇవే నిదర్శనమని పేర్కొన్నారు. 18 నెలల్లో రూ.2.66 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసినా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులైనా చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె రాజు, శాసన మండలి సభ్యులు కుంబా రవిబాబు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పాల్గొన్నారు.

డబ్బులు ఎలా అందాయి ?

- బెట్టింగ్‌యాప్ కేసులో సిఐడి ప్రశ్నలు
- మంచు లక్ష్మి, రీతూచౌదరి, అస్సం భయ్యాల విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెట్టింగ్‌యాప్ కేసును విచారిస్తున్న తెలంగాణ రాష్ట్ర సిఐడి అధికారులు మంగళవారం ముగ్గురు సినీనటులను ప్రశ్నించారు. లక్డీకాపూల్‌లోని సిఐడి కార్యాలయానికి ఉదయమే చేరుకున్న నటీమణులు మంచు లక్ష్మి, రీతూ చౌదరి, నటుడు అస్సం భయ్యాలను సాయంత్రం వరకు దర్యాప్తు అధికారులు విచారించారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు గానూ వీరికి రూ.లక్షల్లోనే పారితోషకాలను యాప్ నిర్వాహకులు ముట్టజెప్పారనే ఆరోపణలున్నాయి. ఈ డబ్బులు వీరికి ఏ విధంగా, ఎవరి ద్వారా అందాయి, అనే కోణాల్లో అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ డబ్బులను వీరు ఏం చేశారనే కోణంలో కూడా వివరాలను రాబట్టడానికి ప్రయత్నించారని సమాచారం. బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధించాక కూడా ప్రమోషన్లు చేశారా? అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ ఐదేళ్లలో తమ బ్యాంకు అకౌంట్ల వివరాలను, ఎక్కడ పెట్టుబడులు పెట్టారనే సమాచారాన్ని నటులు అందజేశారని సమాచారం. బెట్టింగ్ యాప్ కేసులో ఇప్పటి వరకు సిఐడి అధికారులు.. ప్రముఖ నటులు ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, దగ్గుబాటి రానా మొదలుకొని టీవీ యాంకర్లతో కలిపి 25 మందిని ప్రశ్నించారు. మరోవైపు బెట్టింగ్ యాప్‌లో మనీలాండరింగ్ జరిగిందంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు సైతం వీరిపై కేసులు నమోదు చేసి ప్రశ్నించారు. త్వరలోనే సిఐడి అధికారులు ఈ కేసులో చార్జిషీట్‌ను దాఖలు చేయనున్నారు.

బేడ, బుడగ జంగాల సమస్య పరిష్కరించండి

- ఎంఆర్‌పిఎస్ నాయకులు మంద కృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బేడ, బుడగ జంగం తరగతుల విషయంలో తగిన న్యాయం చేయాలని ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్ జవహర్‌ను ఎంఆర్‌పిఎస్ నాయకులు మంద కృష్ణ కోరారు. విజయవాడలోని ఎస్‌సి కమిషన్ కార్యాలయంలో జవహర్‌ను మంగళవారం కలిసిన ఆయన దళితుల జాబితా నుంచి బేడ, బుడగ జంగం తరగతులను విడదీయడం వల్ల తలెత్తుతున్న సమస్యలను వివరించారు. తాడికొండ నియోజకవర్గంలో దళితుల భూములు ఆక్రమణకు గురైందని చెప్పారు. ఎస్‌సి కార్పొరేషన్ నుంచి లబ్ధిదారులకు కేటాయించిన 1.30 ఎకరాల భూమిని అగ్ని ప్రమాదాలు, వరదల సమయంలో ఖాళీ చేసిన తరుణంలో ఆక్రమణకు గురైందన్నారు. కమిషన్ తక్షణమే జోక్యం చేసుకుని బాధిత లబ్ధిదారులకు తిరిగి భూమిని ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జీవితపు సివిల్ ఇంజనీర్ మా తాతయ్య



మా తాతగారు చాలా ప్రేరణాత్మకంగా ఉండే వ్యక్తి. ఆయనే మాకు ఆదర్శం. ఆయన పుస్తకాల్లో, సినిమాల్లో మనం చదివే, చూసే హీరోల్లా కాదు. మా ఇంట్లో చాలా నిశ్శబ్దంగా తన జీవితాన్ని ఒక మార్గదర్శకంగా మార్చుకున్న వ్యక్తి. అవ్వడానికి మా తాత సివిల్ ఇంజనీర్. చిన్న ఇటుకలతో భవనం ఎలా నిర్మిస్తారో అలాగే మా తాతయ్య తన జీవితాన్ని కూడా కష్టం, పట్టుదల, నిజాయితీ అనే మూడు స్తంభాల మీద నిర్మించుకున్నారు. ఉద్యోగంలో ఎన్నో బాధ్యతలు, ఇంట్లో నలుగురు పిల్లల భవిష్యత్తు ఇవి రెండిటిని సమానంగా చూసి ఎవరికీ కొరత రాకుండా చూసుకున్న మనిషి మా తాతయ్య. పని ఎంత కష్టమైనా సాయంకాలం ఇంటికి వచ్చి పిల్లల నవ్వు చూస్తేనే తన అలసట పోతుందని చెప్పుకునే వ్యక్తి. తన చేతులతో వందలాది ఇల్లు కట్టిన ఆయన తన పిల్లలకు విలువలతో కూడిన ఒక అద్భుతమైన జీవితపు భవనాన్ని నిర్మించి ఇచ్చారు. తన పిల్లలకి నిజమైన మనుషులుగా నీతితో బ్రతకాలని నేర్పించారు. అందుకే ఈ రోజుకూ ఆయన పేరు చెప్పగానే మా ఇంట్లో ప్రతి ఒక్కరూ ఎంతో గర్వంతో సంతోషపడుతూ ఉంటారు.

- పి. హర్షన్, ఎనిమిదవ తరగతి, అరవింద హై స్కూల్, కుంచనపల్లి.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని ఆహారపదార్థాలు ఇచ్చాం. వాటి ఆంగ్ల పేర్లు కింద గళ్లల్లో ఉన్నాయి. ఖాళీ గడుల్లో సరైన అక్షరాలు రాస్తే వాటి పేర్లు వస్తాయి. పక్కనే ఇచ్చిన అక్షరాలతో ఆ ఖాళీలను పూరించండి.

నేను గీసిన బొమ్మ



ఆకాష్ రామ్, 9వ తరగతి, రామాపురం జెడ్‌పిస్కూలు, శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మోసపోకు నేస్తమా...!

నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

నిత్య జీవితంలో ఏ వస్తువు కొన్నా అప్రమత్తంగా ఉండాల్సిందే. గుండు సూది నుంచి విమాన ప్రయాణం వరకూ...తినే ఆహారం నుంచి ధరించే దుస్తులు...కాళ్లకు వేసుకునే చెప్పులు నుంచి ధరించే బంగారు..వెండి ఆభరణాలు..మార్కెట్లో కనిపించే ప్రతి వస్తువూ...తినే ఆహార పదార్థాలు..తాగే నీరుతో సహా సమస్త వస్తువుల కొనుగోళ్ల వ్యవహారంలో మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మార్కెట్లోని వస్తువుల్లో ఎక్కువగా కల్తీవీ, నకిలీవి ఉంటాయి. తినే ఆహార పదార్థాల విషయంలోనూ అలాంటి జాగ్రత్తలే తీసుకోవాలి. నాణ్యతలో లోపాలు, మోసపోయినట్లుగా గుర్తిస్తే వెంటనే వినియోగదారుల ఫోరంలను ఆశ్రయించొచ్చు. తద్వారా పరిహారం పొందే వీలుంది. 'వినియోగదారుడా' మేలుకో అంటూ తూనికలు కొలతలు (లీగల్ మెట్రాలజీ) శాఖలు, వినియోగదారుల సంఘాలు ఏటేటా రాష్ట్రవ్యాప్తంగా అనేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

పరిహారం పొందొచ్చు

మార్కెట్లో దొరికే వస్తువుల్లో కల్తీ..నకిలీలతో వినియోగదారుడు మోసపోతూ మానసిక కృంగుబాటుకు గురౌతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. జరిగిన నష్టంతో కృంగిపోకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులు-బాధ్యలు-విధులు గురించి తెసుకుని ఆచరిస్తే జరిగిన నష్టానికి సైతం పరిహారం అందుకునే వ్యవస్థ చట్టప్రకారం ఉంది. దీని గురించి అవగాహన కల్పించేందుకు ఏటేటా జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. సమాజంలో లోపభూయిష్టమైన వారంటీ, సేవలు, ప్రమాదకరమైన ఉత్పత్తులు, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, నిర్ణీత ప్రమాణాలు పాటించకపోవటం, కృత్రిమ డిమాండ్, కొరత సృష్టించటం, నకలీ వస్తువుల విక్రయం, కల్తీ వస్తువులు, నిర్ధిష్ట ధర కంటే ఎక్కువ వసూలు చేయటం వంటి పద్ధతుల్లో మోసాలు జరుగుతున్నాయి. మా బంకులో గత కొన్నేళ్లుగా వినియోగదారులకు హక్కులు-బాధ్యతలు గురించి తెలియజేయటానికి అవగాహనా సదస్సులు ఏర్పాటుచేస్తున్నాం.

-కె.వెంకటప్పయ్య, మేనేజర్, ఇండియన్ ఆయిల్ సర్వీస్ పైలెట్ సర్వీస్ స్టేషన్, విజయవాడ.

గ్యారంటీ...వారంటీని ధృవీకరించుకోవాలి

మార్కెట్లో వస్తువులు కొన్నప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. గ్యారెంటీ, వారెంటీ కార్డులను షాపు యజమాని సంతకం, ముద్రతో సహా తీసుకోవటం మంచిది. టూత్ పేస్టు నుంచి ఇంట్లో సామాన్లు,నూనెలు, పప్పులు, కూరగాయలు, బిస్కెట్లు, తినే పదార్థాలు , మందులు, పెట్రో ఉత్పత్తులు ఇలా ఏ వస్తువు కొన్నా దాని ముగింపు తేదీని చూసుకోవాలి. వస్తువు కల్తీ, నకిలీయా అనేది కూడా ధృవీకరించుకోవాలి. వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర ప్రమాణం వంటి వాటికి సంబంధించి సమాచారం ఉన్నాయో లేదా పరిశీలించాలి. తూకంలో మోసం జరిగినట్లుగా అనిపిస్తే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి న్యాయం పొందొచ్చు.

-బి.కుమారి, అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ

సైబర్ మోసాలపై అప్రమత్తం...

దేశంలో ఎక్కడ ఏ వస్తువు కొన్నా, సేవాలోపం ఉన్నా, నష్టపోయినా మనం నివశించే ప్రాంతం నుంచే ఫిర్యాదు చేయొచ్చు. ఫోన్ చేసి కంప్లయింట్ చేయొచ్చు. డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు, టెలి మార్కెటింగ్ వంటి సేవలు పొందే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాల పట్ల జాగురూకతతో వ్యవహరించాలి. ఏదైనా వస్తువు కొనేటప్పుడు బిల్లు, రశీదు, ఆన్‌లైన్‌పేమెంట్ చేసిన తర్వాత ఇన్వాయిస్, ఐడిలను భద్రపర్చుకోవాలి. ఎందుకంటే ఫిర్యాదు సమయంలో వాటిని సమర్పించాలి. అనునిత్యం వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి.

-పి.పుల్లయ్య, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్, ఆటోనగర్, విజయవాడ.

ఆహార కల్తీ జాగ్రత్త...

మార్కెట్లో దొరికే రెడీమేడ్ ఫుడ్‌లో కొన్ని రకాల రంగులతో కెమికల్స్ కలుస్తుంటాయి. రక్షిత మంచినీటిని వాడరు. వాడిన నూనెలనే మళ్లీ మళ్లీ వాడుతుంటారు. ఇవి ఆరోగ్యానికి చాలా పెనుప్రమాదానికి సంకేతం. వీధుల్లో లభించే ఆహార పదార్థాల్లో ఈగలు, దోమలు వంటివి వాలి ఉంటాయి. వీధుల్లో మురుగుకాల్వల్లో ఉండే బ్యాక్టీరియా వంటివి ఆహార పదార్థాలపై చేరి ఉంటాయి. అవి తినేస్తే అనారోగ్యం పాలవుతుంటాం. యువతకు ఎక్కువగా స్ట్రీట్‌ఫుడ్ తింటున్నారు. ఇది ఏమంత మంచిది కాదు. ఆరోగ్యానికి హానికరమైన నిషేధించిన రంగులు కలిపిన ఆహారాన్ని గుర్తించే పద్ధతులు ఉన్నాయి. అవి తెలుసుకోవాలి. శుభ్రమైన నీరు, ఆహారం మన ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుతుంది. దుకాణాలు, మాల్స్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేటప్పుడు ప్రతి ప్యాకేజీపైన తయారీదారుని పూర్తి చిరునామా, వస్తువు పేరు, నిఖర బరువు, కొలత లేదా నంబరు, తయారుచేయబడిన తేదీ (నెల, సంవత్సరం), గరిష్ట అమ్మకం ధర, కస్టమర్ కేర్ నంబరు, చిరుమనామా, టెలిఫోన్ నంబరు, ఇమెయిల్ అడ్రస్ వంటివి ముద్రించబడి ఉన్నాయా? లేదా అనేది గమనించాలి. గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పి) కన్నా ఎక్కువ ధరకు అమ్మితే చట్టరీత్యా నేరమవుతుంది.

-రమేష్‌కుమార్, ఫుడ్ అండ్ సేఫ్టీ విభాగం జిల్లా అధికారి.

తూకాలను సరిచూసుకోవాలి

ప్రతి తూనిక, కొలతల పరికరాలు, రాళ్లు, వేయింగ్ మెషీన్లకు డిపార్ట్‌మెంట్ వారిచే ముద్ర వేయించి సంబంధిత ధృవ ప్రతాన్ని అందరికీ కనబడేలా ఉంచాలి. పెట్రోలు బంకులు, గోల్డ్ షాపులు, రైతుబజార్లలో ఇలా అన్నిచోట్ల ఖచ్చితమైన కొలతలనే వాడాలి. బియ్యం, ధాన్యం, విత్తనాలు, ఎరువులు, సిమెంట్ వంటి వాటిని కొనుగోలుదారుని (వినియోగదారుని) ఎదుట తూకం వేసి ఇవ్వాలి. సూపర్ మార్కెట్లలో ప్యాకేజీల్లోని వస్తువుల నిఖరబరువు పైన ఏదైనా అనుమానం ఉండే కొనుగోలుదారుడు ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌పై సరిచూసుకోవాలి. ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, సినిమా థియేటర్లు, ఎగ్జిబిషన్లు, యాత్రా ప్రదేశాల్లో ప్యాకేజీలకు అదనంగా వసూలు చేసినా నేరమే. బంగారం తూచే ఎలక్ట్రానిక్ మిషన్ (కాటా)లపై లీగల్ మెట్రాలజీ శాఖ వారి సీల్ ఉందా? లేదా? గమనించాలి. వంటగ్యాస్ డెలివరీలో అదనంగా డెలివరీ ఛార్జీలు డిమాండ్ చేస్తే సదరు కంపెనీకి ఫిర్యాదుచేయొచ్చు. పెట్రోలు బంకుల్లో వాహనాల్లో పెట్రోలు, డీజిల్ నింపేటప్పుడు పంపు మీటరు రీడింగ్స్ అన్నీ సున్నా (0) ఉన్నాయో లేదో చూడాలి.

-బి.హరిప్రసాద్, డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ, ఎన్‌టిఆర్ జిల్లా.

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా

రంగవల్లి

ప్రజాశక్తి దినపత్రిక, ప్రజాశక్తి భవనం, అరవింద హై స్కూలు దగ్గర, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.

మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com, వాట్సాప్ : 83329 25496

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- **అన్వేష సైన్స్ ఫెస్ట్ - 2025 ప్రారంభోత్సవంలో ఐటిడిఎ పిఒ జగన్నాథ్**

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను వెలికి తీసేందుకే అన్వేష సైన్స్ ఫెస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలోని బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం అన్వేష సైన్స్‌ఫెస్ట్- 2025ను ఆయన ప్రారంభించారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలోని 53 పాఠశాలల నుంచి సుమారు 300పైగా వివిధ రకాల ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని, చదువుతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. నిత్యజీవితంలో జరిగే ప్రతి అంశాన్ని ప్రశ్నించడం అలవాటు చేసుకున్నప్పుడే విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని చెప్పారు. విద్యార్థులు ప్రాక్టికల్ పద్ధతిలో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు కనుగొనే దిశగా విద్యార్థులు ఆలోచించాలని, అందుకు తగ్గట్టుగానే గిరిజన ప్రాంతాల్లో నిత్యం ఎదుర్కొనే సమస్యలు - వాటికి పరిష్కారాలు అన్న అంశం ఎంచుకోవాలని సూచించారు. ఖరీదైన టెక్నాలజీని సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చేలా తక్కువ ఖర్చుతో కూడిన ఆవిష్కరణలు రావాలని ఆకాంక్షించారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని, అప్పుడే పరిజ్ఞానం పెరిగి సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని విద్యార్థులను ఉత్సాహపరిచారు. తమలోని సృజనాత్మకతను వెలికితీసి, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. అన్వేష సైన్స్ ఫెస్ట్‌లో ప్రదర్శించిన ప్రాజెక్ట్‌ల్లో ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ఇస్రో సంస్థకు పంపించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల గిరిజన విద్యార్థులు ఇక్కడితో ఆగిపోకుండా, రాష్ట్ర స్థాయిలోనూ తమ ప్రతిభను చాటాలని సూచించారు. ఇటువంటి సైన్స్ ఫెస్ట్‌లను సీతంపేట, ఐటిడిఎ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి, ఎంఇఒ ఆనందరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్సు ఫెస్ట్‌ను తిలకిస్తున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

పేకాట క్లబ్బులకు ప్రభుత్వ అండదండలు

- **మాజీ మంత్రి తానేటి వనిత**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి పాలనలో జూదాన్ని లీగల్ చేశారని, పేకాట క్లబ్బులకు ప్రభుత్వం అండదండలు అందిస్తోందని మాజీ మంత్రి తానేటి వనిత ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఆగిరిపల్లిలో రిక్రియేషన్ క్లబ్ పేరిట పేకాట డెన్ నడుస్తోందని, మంత్రి పార్థసారథి నియోజకవర్గంలోనే ఇది సాగుతోందని ఆరోపించారు. అక్కడ జూదరుల కోసం అంబులెన్స్ కూడా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యంతో రాష్ట్రంలో క్రైమ్‌రేటు పెరిగిందని, మహిళా హోంమంత్రి ఉన్నా మహిళలకు రక్షణ కరువైందని అన్నారు.

చంద్రబాబు టూల్ పవన్‌కల్యాణ్ : పోతిన మహేష్

చంద్రబాబు పొలిటికల్ టూల్‌గా పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని వైసిపి నాయకులు పోతిన మహేష్ విమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. దాన్ని డైవర్ట్ చేయడానికి బూతులు మాట్లాడిస్తున్నారని అన్నారు.

బెదిరిస్తే.. బెదిరిపోం : అంబటి

కేసుల పేరుతో వైసిపి నాయకులను బెదిరించాలని చూస్తే బెదిరిపోబోమని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తోచిన వారిపై తోచినట్లు కేసులు పెట్టుకుంటూ పోతున్నారని, ఇవేమీ నిలబడేవి కావని తెలిపారు. రెడ్‌బుక్‌లో మూడు పేజీలు అయ్యాయని బెదిరించడం వల్ల ప్రజలకు ఏమి చెప్పాలనుకుంటున్నారో చెప్పాలన్నారు. బెదిరింపు రాజకీయాలను ప్రజలు సహించరని అన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రులు తానేటి వనిత, అంబటి రాంబాబు, మాజీ ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలను ఆదుకోవాలన్న జీసస్ సూక్తిని జగన్ నిజం చేసి చూపించారని అన్నారు.

సముద్రంలో వల వేస్తుండగా... మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - కవిటి (శ్రీకాకుళం జిల్లా)

చేపల వేటే జీవనాధారంగా సముద్రంలోకి వెళ్లిన ఓ మత్స్యకారుడి ఆయువు ఆ సముద్రంలోనే కలిసిపోయింది. చేపల కోసం వల వేస్తుండగా అనుకోని ప్రమాదానికి గురై మృతిచెందారు. స్థానిక మత్స్యకారుల కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం కొత్తపాలెంకు చెందిన కర్రి విశ్వనాథం (32) మంగళవారం మరో 12 మంది మత్స్యకారులతో కలిసి సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. సముద్రంలో వల వేస్తుండగా బోటు నుంచి కాలుజారి సముద్రంలో పడిపోయాడు. ఈ క్రమంలో బోటు వెనుక భాగంలో ఉన్న ఫ్యాన్ తల భాగంలో బలంగా తగలడంతో విశ్వనాథం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తోటివారు ఆయన మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి శవ పంచనామా నిర్వహించారు. విశ్వనాథంకు భార్య ఈశ్వరి, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

విశ్వనాథం (ఫైల్)

వికలాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వికలాంగుల సంక్షేమం, గౌరవానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రిని వికలాంగులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా త్రీ వీలర్స్ (రెట్రోఫిటెడ్ మోటారు వాహనాలు) అందిస్తామన్నారు. ఇందుకు రూ.17.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. విశాఖలో వికలాంగుల కోసం పారా స్పోర్ట్స్ స్టేడియాన్ని రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణంతో సహా ఏడు వరాలు ఇచ్చారంటూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుర్వేద వైద్యులతో శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పురాతన భారతీయ వైద్య విధానాన్ని ఆధునిక చికిత్స విధానంతో అనుసంధానం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. తగు శిక్షణతో శస్త్ర చికిత్స ప్రక్రియకు సంబంధించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకున్న ఆయుర్వేద వైద్యులు స్వతంత్రంగా శస్త్ర చికిత్సలు (ఆపరేషన్లు) చేయడానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇండియన్ మెడిసిన్ సెంట్రల్ కౌన్సిల్ నియమావళి-2020, నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్స్ ఆఫ్ మెడిసిన్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఆయుర్వేద వైద్యులు శస్త్ర చికిత్సలు చేసేలా తగు గుర్తింపుతో పాటు అనుమతినివ్వడానికి మంత్రి అంగీకరించినట్లు వెల్లడించింది.

షెఫాలీ మెరుపులు

- **శ్రీచరణి, వైష్ణవి మాయాజాలం**
- **రెండో టి20లో శ్రీలంకపై ఏడు వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం**

విశాఖపట్నం: ఎసిఎ-విడిసిఎ మైదానంలో శ్రీలంక మహిళలతో జరిగిన రెండో టి20లోనూ భారతజట్టు ఘన విజయం సాధించింది. తొలుత తెలుగు తేజం శ్రీచరణికి తోడు వైష్ణవి శర్మ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో శ్రీలంక జట్టు కేవలం 128 పరుగులకే పరిమితమైంది. ఆ లక్ష్యాన్ని భారత ఓపెనర్ షెఫాలీ వర్మ(69నాటౌట్; 34బంతుల్లో 11ఫోర్లు, సిక్సర్) ధనా ధన్ ఇన్నింగ్స్‌కి తోడు రోడ్రిగ్స్(26) బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించడంతో కేవలం 11.5ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. 2వ వికెట్‌కు షెఫాలీ, రోడ్రిగ్స్ కలిసి 58పరుగులు జతచేసి గెలుపు తీరాలకు చేర్చారు. గెలుపుకు ఒక్క పరుగు దూరంలో ఉండగా హర్మన్‌ప్రీత్(10) ఔటయ్యింది. పవర్ ప్లే 6 ఓవర్లు ముగిసేసరికే భారతజట్టు వికెట్ నష్టానికి 68 పరుగులు చేసింది. ఈ గెలుపుతో ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యతలో నిలువగా.. మిగిలిన మూడు టి20లు తిరువనంతపురం వేదికగా జరగనున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకను తొలి ఓవర్లోనే క్రాంతి గాడ్ షాక్ ఇచ్చింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ విష్మీ గుణరత్నే(11)ను రిటర్న్ క్యాచ్ అందుకొని పెవీలియన్‌కు పంపింది. అనంతరం ఫోర్, సిక్సర్‌తో మెరుస్తున్న కెప్టెన్ చమరి ఆటపట్టు (31)ను స్నేహ్ రాణా ఔట్ చేసింది. మిడాన్‌లో పెద్ద షాట్ ఆడిన ఆటపట్టు క్యాచ్‌ను అమన్‌జ్యోత్ కౌర్ అందుకొని పెవీలియన్‌కు పంపింది. క్రాంతి, స్నేహ్ రాణా విజృంభణతో లంక టీమ్ పవర్ ప్లే లోనే రెండు వికెట్లు కోల్పోయింది. 38పరుగులకే రెండు వికెట్లు పడిన శ్రీలంకను హాసిన పెరేరా(22), హర్షిత సమరవిక్రమ(33) కలిసి ఆదుకున్నారు. శ్రీలంక 82పరుగుల వద్ద మూడో వికెట్లు కోల్పోగా.. 16ఓవర్లు ముగిసేసరికి 3వికెట్ల నష్టానికి 104 పరుగులతో పటిష్టంగా ఉన్నా.. చివర్లో స్పిన్నర్లు వైష్ణవి శర్మ, శ్రీచరణి లంకను కట్టడిచేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షెఫాలీ వర్మకు దక్కింది. మూడో టి20 శుక్రవారం జరగనుంది.

స్కోర్‌బోర్డు...

శ్రీలంక మహిళల ఇన్నింగ్స్: గుణరత్నే (సి అండ్ బి)క్రాంతి గాడ్ 1, ఆటపట్టు (సి)అమన్‌జ్యోత్ (బి)స్నేహ్ రాణా 31, పెరేరా (సి అండ్ బి)శ్రీచరణి 22, హర్షిత సమరవిక్రమ (రనౌట్) అమన్‌జ్యోత్/రీచా ఘోష్ 33, కవిషా దిల్హారి (సి)అమన్‌జ్యోత్ (బి)శ్రీచరణి 14, నీలాక్షి డి-శిల్వ (సి)శ్రీచరణి (బి)వైష్ణవి శర్మ 2, కౌషాణి (సి)రనౌట్)క్రాంతి గాడ్/రీచా ఘోష్ 11, షాషిని గింహానీ (సి)మంధాన (బి)వైష్ణవి శర్మ 0, కావ్యా కవింది (రనౌట్)శ్రీచరణి/రీచా ఘోష్ 1, మల్కి మదర (నాటౌట్) 1, అదనం 12. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 128 పరుగులు. **వికెట్ల పతనం:** 1/2, 2/38, 3/82, 4/104, 5/109, 6/121, 7/122, 8/126, 9/128 **బౌలింగ్:** క్రాంతి గాడ్ 3-0-21-1, అరుంధతి రెడ్డి 3-0-22-0, స్నేహ్ రాణా 4-1-11-1, అమన్‌జ్యోత్ కౌర్ 2-0-11-0, వైష్ణవి శర్మ 4-0-32-2, శ్రీచరణి 4-0-23-2.

ఇండియా మహిళల ఇన్నింగ్స్: మంధాన (సి)కావ్య కవింది (బి)కవిషా దిల్హారీ 14, షెఫాలీ వర్మ (నాటౌట్) 69, జెమీమా రోడ్రిగ్స్ (సి)కవిషా దిల్హారి (బి)కావ్యా కవిందు 26, హర్మన్‌ప్రీత్ కౌర్ (బి)మల్కీ మదార 10, రీచా (నాటౌట్) 1, అదనం 9. (11.5ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 129 పరుగులు.

వికెట్ల పతనం: 1/29, 2/87, 3/128

బౌలింగ్: మదారా 2.5-0-22-1, కవింది 3-0-32-1, దిల్హారీ 2-0-15-1, రణవీరా 2-0-31-0, ఆటపట్టు 1-0-17-0, గింహానీ 1-0-12-0.

బాక్సింగ్ డే టెస్ట్‌కు స్మిత్‌కు పగ్గాలు

- **కమిన్స్, లియాన్ ఔట్..**
- **నాల్గో టెస్ట్‌కు ఆసీస్ జట్టు ఇదే!**

మెల్‌బోర్న్: ఈనెల 26నుంచి మెల్‌బోర్న్ వేదికగా జరిగే యాషెస్ సిరీస్ నాల్గో(బాక్సింగ్ డే) టెస్ట్‌కు జట్టును క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) మంగళవారం ప్రకటించింది. ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌లో తొలి మూడు టెస్ట్‌లను గెలుచుకొని సిరీస్‌ను కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా జట్టులో పలు మార్పులు చేసుకున్నాయి. నాల్గో టెస్ట్‌కు సిఎ ప్రకటించిన జట్టులో రెగ్యులర్ కెప్టెన్ కమిన్స్‌తోపాటు స్టార్ స్పిన్నర్ లియాన్‌లకు చోటు దక్కలేదు. దీంతో బాక్సింగ్ డే టెస్ట్‌కు కెప్టెన్‌గా సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఎంపికయ్యాడు. లియాన్ సర్జరీ కారణంగా నాల్గో టెస్ట్‌కు దూరం కాగా.. పాట్ కమిన్స్‌కు బోర్డు విశ్రాంతి నిచ్చింది. దీంతో కమిన్స్ స్థానంలో రిచర్డ్సన్, టాడ్ మర్ఫీ ఎంపికయ్యారు. మెల్‌బోర్న్ వేదికగా ఈనెల 26నుంచి ఇంగ్లండ్‌తో నాల్గో టెస్ట్ ప్రారంభం కానుంది. పెర్త్, బ్రిస్బేన్ టెస్ట్ మ్యాచ్‌లలో 8వికెట్ల తేడాతో గెలిచిన ఆస్ట్రేలియా.. ఆడిలైడ్ టెస్ట్‌లో 82పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి మరో రెండు టెస్ట్ మ్యాచ్‌లు మిగిలి ఉండగానే యాషెస్ ట్రోఫీని నిలబెట్టుకుంది.

జట్టు: స్మిత్(కెప్టెన్), బోలండ్, క్యారీ, డోగెట్, గ్రీన్, హెడ్, ఇంగ్లిస్, ఖవాజా, లబూషేన్, మర్ఫీ, నెసెర్, రిచర్డ్సన్, స్టార్క్, వేథర్లాండ్, వెబ్‌స్టర్.

ఓవర్‌లో ఐదు వికెట్లు

- **ఇండోనేషియా బౌలర్ ప్రియందన కొత్త చరిత్ర**

బాలి: ఇండోనేషియా బౌలర్ గెడే ప్రియందన అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో సరికొత్త రికార్డును నెలకొల్పాడు. ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు పుటల్లోకెక్కాడు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో ఓ బౌలర్ ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు తీయడం ఇదే తొలిసారి. అంతకుముందు లసిత్ మలింగ(శ్రీలంక) 2019లో న్యూజిలాండ్‌పై ఒకే ఓవర్‌లో 4 వికెట్లు పడగొట్టి రికార్డు పుటల్లోకెక్కగా.. తాజా స్పెల్‌లో గెడే ప్రియందన ఆ రికార్డును బ్రేక్ చేశాడు. కంబోడియాతో మంగళవారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఈ అరుదైన రికార్డు నమోదైంది. ప్రియందన వేసిన ఆ ఓవర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ఓవర్ ప్రారంభమే హ్యాట్రిక్‌తో మొదలైంది. మొదటి మూడు బంతుల్లో వరుసగా షా అబ్రార్ హుస్సేన్, నిర్మల్జిత్ సింగ్, చంతోన్ రత్నక్‌లను అవుట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. ఆ తర్వాత నాలుగో బంతి డాట్ బాల్‌గా నమోదైంది. అనంతరం మళ్లీ విజృంభించిన ప్రియందన... మోంగ్‌దారా సోక్, పెల్ వెనాక్‌లను అవుట్ చేసి తన ఐదు వికెట్ల కోటాను పూర్తి చేశాడు. దీంతో కంబోడియా జట్టు 16ఓవర్లలో 107పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు ఇండోనేషియా జట్టు బ్యాటర్ ధర్మ కేశుమ 68 బంతుల్లో 8 ఫోర్లు, 6సిక్సర్లతో సహా 110 పరుగులు చేయడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది.

సంపాదకీయం

ఆరావళిని రక్షించుకుందాం

ప్రకృతి నిర్మించిన రక్షణ కవచం ఆరావళి పర్వత శ్రేణులను చట్టబద్ధంగా అస్మదీయ మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తుండటం ఆందోళనకరం. వందల కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన ప్రపంచంలోనే అతి పురాతన మడత పర్వత శ్రేణుల్లో ఒకటైన వీటిని ఇటీవల కేంద్రం కొత్తగా నిర్వచించడం కార్పొరేట్ శక్తుల కోసమేనన్నది బహిరంగ రహస్యం. దానికి సుప్రీంకోర్టు ఆమోదం తెలపడం పర్యావరణానికి, జీవ కారుణ్యానికే కాదు... మానవ మనుగడకే ప్రమాదకరం. సామాజిక మాధ్యమ వేదికల్లో ఉత్తరాదిన ప్రారంభమైన 'సేవ్ ఆరావళి క్యాంపెయిన్' రోజురోజుకూ దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఉత్తర భారతానికి గ్రీన్ లంగ్స్ (పచ్చని ఊపిరితిత్తులు)గా ఉన్న ఆరావళిని కాపాడాలన్న హ్యాష్ ట్యాగ్‌లతో విద్యావంతులు, మేధావులు, పర్యావరణ వేత్తలు, నిపుణులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అక్రమ మైనింగ్‌ను ఎలా చట్టబద్ధం చేస్తారని కేంద్రాన్ని నిలదీస్తున్నారు.

వంద మీటర్లు.. అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న వాటినే పర్వతాలుగా పరిగణిస్తామని, 500 మీటర్ల పరిధిలో ఉండే పర్వత సమూహాలనే ఆరావళి పర్వత శ్రేణిగా గుర్తిస్తామని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రామాణికాలు నిర్దేశించింది. అంతకంటే తక్కువ ఎత్తుంటే పర్వతాలుగా పరిగణించబోమన్న కేంద్రం వాదనను సుప్రీంకోర్టు ఆమోదించింది. అటవీ, జల, ఖనిజ ఇతర సహజ వనరులను అందిస్తూ.. నాలుగు రాష్ట్రాల సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్న ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్, రియల్ ఎస్టేట్ ముప్పు పొంచి వుంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హర్యానా, రాజస్థాన్, గుజరాత్ వరకూ దాదాపు 700 కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఈ పర్వత శ్రేణి థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక, ధూళిని అడ్డుకోవడంలో కీలకమైనవని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) నివేదిక స్పష్టం చేస్తోంది.

'పీపుల్ ఫర్ ఆరావళీస్' సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం అనూహ్యంగా పెరిగిన పట్టణీకరణ, ఖనిజాన్వేషణలతో అడవుల్లో ముమ్మరంగా సాగుతున్న తవ్వకాలు, నివాస ప్రాంతాల విస్తరణ వల్ల హర్యానా, రాజస్థాన్‌లోని ఛార్ఖీ దాద్రి, భివాని జిల్లాల్లో పర్వతాలు ధ్వంసమై జీవవైవిధ్యం నాశనమైంది. ఒక్క రాజస్థాన్‌లోనే దాదాపు 25 శాతం కొండలు హరించుకుపోయాయని 2018లోనే సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార సంఘం తేల్చిచెప్పింది. 25 వేలకుపైగా ఎకరాల్లో కొండలు కనుమరుగయ్యాయి. 2011-17 మధ్యలో ఆరావళి శ్రేణుల నుంచి 9.80 లక్షల టన్నుల ఖనిజ వనరులను అక్రమంగా తరలించారనేది కాగ్ నివేదిక. మైనింగ్, రియల్ ఎస్టేట్ అక్రమాలపై నాలుగు వేలకుపైగా కేసులు న్యాయస్థానాల్లో మూలుగున్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్ పరిసర ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాలను 2002లోనూ, నాలుగు రాష్ట్రాల్లో తవ్వకాలను 2009లోనూ నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పులిచ్చినా... అమలు చేసే ప్రభుత్వాలే లేవు. పర్వతాల స్వరూపం మార్చకూడదన్న సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు చుట్టూ మైనింగ్ జరుగుతుంటే ఎలా అమలవుతాయి? ఢిల్లీ నుంచి థార్ వరకూ ఎడారిగా మారుతుందని, భూగర్భ జలాలు అడుగంటతాయని, వాయు కాలుష్యంతో ఢిల్లీసహా ఆయా రాష్ట్రాల నుంచి వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందంటున్న పర్యావరణవేత్తల హెచ్చరికలు పాలకుల చెవికెక్కడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించిన ప్రధాని ఢిల్లీ నుంచి గుజరాత్ వరకూ అడవులు పెంచడమే లక్ష్యమన్నారు. 90 శాతం ప్రాంతంలో మైనింగ్ తవ్వేందుకు వీలుగా నిర్వచనాన్నే మార్చేసి పచ్చదనం ఎక్కడి నుంచి వస్తుందో సమాధానం చెప్పాల్సింది ఏలినవారే. 0.19 శాతమే మైనింగ్‌కు అనుమతిస్తున్నామంటూ పర్యావరణ మంత్రి చెబుతున్నది వాస్తవదూరం. వంద మీటర్లకంటే తక్కువ ఎత్తులోని 90 శాతం ప్రాంతాల రక్షణకు చర్యలు చేపట్టాలి. డిజిటల్ మానిటరింగ్, ఎ.ఐ టూల్స్ తదితర చర్యల ద్వారా అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలి. కోట్ల ఏళ్లగా పర్యావరణానికి పెట్టని కోటగా ఉన్న ఆరావళిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు భద్రంగా అప్పగించడం, 'సేవ్ ఆరావళి'కి మద్దతు పలకడం మనందరి బాధ్యత. మన రాష్ట్రంలోనూ లేటరైట్, బాక్సైట్ తదితర విలువైన ఖనిజాలను తవ్వి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అత్యుత్సాహం చూపే పర్యావరణ వినాశక చర్యలకు అడ్డుకట్ట పడాలి.

మంచి మాట



అది ఏ గ్రంథంలోనైనా వుండొచ్చు.
దాన్ని ఎవరైనా చెప్పొచ్చు.
చివరకు నేను కూడా
చెప్పి వుండొచ్చు.
నీ సొంత హేతువుకూ,
నీ ఇంగితజ్ఞానానికీ
అది నిలబడకపోతే దాన్ని నమ్మొద్దు!
- గౌతమ బుద్ధుడు

విశ్లేషణ

రాష్ట్రాభివృద్ధి అంటే జిడిపి వృద్ధి రేటేనా?

డా॥ బి. గంగారావు

గత వారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వృద్ధి రేటు కేంద్రంగా అమరావతిలో కలెక్టర్ల సదస్సును నిర్వహించారు. జిల్లాల జిడిపి ర్యాంకులను కూడా విడుదల చేశారు. అంతకు ముందు రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబర్) రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి (జిఎస్ డిపి) రేటు వివరాలు విడుదల చేస్తూ ఈ త్రైమాసికంలో 11.5 శాతం, తొలి ఈ ఆరు నెలల్లో 10.9 శాతం వృద్ధి రేటు నమోదయ్యిందని....ఇది జాతీయ స్థాయిలో వృద్ధి రేటు 8.7 శాతం కన్నా ఎక్కువ అని చెప్పారు. ఈ ఏడాది లక్ష్యం 17.11 శాతం వృద్ధి రేటు సాధిస్తామని, ఇందుకోసం రంగాలవారీ ప్రత్యేక వ్యూహంతో ముందుకెళుతున్నామని ప్రకటించారు.

రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్ల (2014-19) తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో సగటున 13.5 శాతంతో పోలిస్తే వైసిపి పాలనలో సగటున 10.32 శాతంతో జిఎస్ డిపి వృద్ధి రేటు 3.2 శాతం తగ్గి రాష్ట్రం సుమారు రూ.7 లక్షల కోట్లు స్థూల ఉత్పత్తి కోల్పోయిందని, దీనివల్ల రాష్ట్ర రెవిన్యూ వసూళ్లు రూ.76195 కోట్లు నష్టపోయామని తెలిపారు.

ఈ 18 నెలల కష్టంతో ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోశామని, ఇప్పుడు జిఎస్ డిపి వృద్ధి రేటును పెంచడానికి పెద్దఎత్తున ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. జిఎస్ డిపి పెరిగితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, ఉపాధి పెరుగుతుందని ఫలితంగా రాష్ట్రం దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారుతుందని ఉపదేశించారు.

కేంద్ర ప్రభుత్వ వికసిత భారత్ 2047లో భాగంగా అప్పటికి ఆంధ్ర రాష్ట్రం 2.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.200 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థకు చేరుకోవాలని, దీని సాధనకు ప్రతి ఏడాది సగటున 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది జరగాలంటే విదేశీ, స్వదేశీ పెట్టుబడులు పెద్ద ఎత్తున ఆహ్వానించాలని, ఇందుకు భూములు, పెట్టుబడి, పన్నుల రాయితీలు, ఇతర ఇన్‌పుట్స్ సబ్సిడీలు వంటివి భారీగా ఇవ్వాలని అలాగే ప్రస్తుత కార్మిక, భూ తదితర చట్టాలు పెట్టుబడులకు అనుగుణంగా మార్పులు చేయాలని నిర్ణయించారు.

చంద్రబాబు చెబుతున్న జిడిపి వృద్ధి రేటు సిద్ధాంతం కొత్తదేమీ కాదు. ఇది నయా ఉదారవాద విధానాల నుండి ఉద్భవించిన పెట్టుబడిదారీ వ్యూహం. దేశంలో, రాష్ట్రంలో గత మూడు దశాబ్దాల నుండి పాలకులు స్థూల ఉత్పత్తి ఎక్కువ సాధించడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు తగ్గిపోతాయని ప్రచారం చేస్తున్నారు.

కానీ జిడిపి పెంపు చుట్టూ చేస్తున్న వాదనలన్నీ పసలేనివని ఆచరణలో తేలిపోయింది. వాస్తవంగా జిడిపి వృద్ధి రేటు వల్ల ఉపాధి వృద్ధి రేటులో వచ్చే పెరుగుదల అనేది జిడిపి యొక్క పక్రియ, దాని స్వభావం, ఏయే రంగాల నుండి ఈ పెరుగుదల వచ్చింది, దీనివల్ల ఏయే తరగతులకు మేలు జరిగింది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు వ్యవసాయం-చిన్న ఉత్పత్తి వంటి రంగాల ద్వారా వృద్ధి పెరిగితే దాని ద్వారా కలిగే ఉపాధి ప్రభావం తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ గత మూడు దశాబ్దాల నయా ఉదారవాద విధానాల అనుభవం ఏమిటంటే ఈ కాలంలో ఇవి తీవ్ర సంక్షోభంలో పడ్డాయి.

ఆంధ్ర రాష్ట్రంలో చూస్తే రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర జిడిపి లో వ్యవసాయ రంగం వాటా 2014-15లో 30.39 శాతం నుండి 2024-25 కి 35.20 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో సాంప్రదాయ పంటలు ముఖ్యంగా ఆహార పంటల (ఉద్యాన పంటలు మినహా) వాటా 8.31 శాతం నుండి 3.89 శాతానికి పడిపోయింది. అలాగే రొయ్యలు, చేపలు, పౌల్ట్రీ, మాంసం వంటి వాటి వాటా 13. 50 శాతం నుండి 20.26 శాతానికి పెరిగింది. అత్యధిక మంది ఆధారపడ్డ ఆహార పంటల నుండి వస్తున్న ఆదాయం దారుణంగా పడిపోతున్నది. కేవలం కొద్ది మంది ఆధారపడ్డ రొయ్యలు, పౌల్ట్రీ వంటి వాటి నుండి ఎక్కువ ఆదాయం వస్తున్నది. అంటే వ్యవసాయ రంగం నుండి వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం కొద్ది మందికి మాత్రమే వెళుతున్నది. ఈ పరిణామం వ్యవసాయ రంగంలో సంపద, భూ కేంద్రీకరణ, భూములు కోల్పోవడం, దివాళా, అప్పుల పాలవడం, వలసలు పెరగడం, ఆత్మహత్యలు వంటి చర్యలకు దారితీస్తున్నది. ఈ కఠోర వాస్తవ పరిస్థితులను రాష్ట్ర జిడిపి అంకెలు మరుగున పరుస్తున్నాయి.

ఇతర రంగాల్లో కూడా దీనికి భిన్నమయిన పరిస్థితేమీ కాదు. జిడిపి వృద్ధి రేటు కన్నా అతి తక్కువ ఉపాధి రేటు ఈ కాలంలో కొనసాగుతున్నది. దీనినే ఉపాధి రహిత అభివృద్ధి అంటున్నారు. రెండోవైపు శ్రామిక మార్కెట్ లోకి శ్రామిక శక్తి ప్రవేశ రేటు పెరుగుతున్నది. వీరందరికీ పెరుగుతున్న జిడిపి ఉపాధి కల్పించలేక పోవడంతో వారంతా నిరుద్యోగులుగా మారిపోతున్నారు. వస్తున్న ఉపాధి కూడా ఎక్కువ రంగాల్లో అతి తక్కువ వేతనాలతో కూడిన ఏ హక్కులూ లేని అత్యంత దారుణమైనది. దీనివల్ల అత్యధిక శ్రామిక జనావళికి కొనుగోలు శక్తి లేకుండా పోతున్నది. ఇది అంతిమంగా సమిష్టి డిమాండ్ కొరతకు దారి తీస్తున్నది.

ఇతర రంగాల్లో కూడా దీనికి భిన్నమయిన పరిస్థితేమీ కాదు. జిడిపి వృద్ధి రేటు కన్నా అతి తక్కువ ఉపాధి రేటు ఈ కాలంలో కొనసాగుతున్నది. దీనినే ఉపాధి రహిత అభివృద్ధి అంటున్నారు. రెండోవైపు శ్రామిక మార్కెట్ లోకి శ్రామిక శక్తి ప్రవేశ రేటు పెరుగుతున్నది. వీరందరికీ పెరుగుతున్న జిడిపి ఉపాధి కల్పించలేక పోవడంతో వారంతా నిరుద్యోగులుగా మారిపోతున్నారు. వస్తున్న ఉపాధి కూడా ఎక్కువ రంగాల్లో అతి తక్కువ వేతనాలతో కూడిన ఏ హక్కులూ లేని అత్యంత దారుణమైనది. దీనివల్ల అత్యధిక శ్రామిక జనావళికి కొనుగోలు శక్తి లేకుండా పోతున్నది. ఇది అంతిమంగా సమిష్టి డిమాండ్ కొరతకు దారి తీస్తున్నది.



కానీ జిడిపి పెంపు చుట్టూ చేస్తున్న వాదనలన్నీ పసలేనివని ఆచరణలో తేలిపోయింది. వాస్తవంగా జిడిపి వృద్ధి రేటు వల్ల ఉపాధి వృద్ధి రేటులో వచ్చే పెరుగుదల అనేది జిడిపి యొక్క పక్రియ, దాని స్వభావం, ఏయే రంగాల నుండి ఈ పెరుగుదల వచ్చింది, దీనివల్ల ఏయే తరగతులకు మేలు జరిగింది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు వ్యవసాయం-చిన్న ఉత్పత్తి వంటి రంగాల ద్వారా వృద్ధి పెరిగితే దాని ద్వారా కలిగే ఉపాధి ప్రభావం తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ గత మూడు దశాబ్దాల నయా ఉదారవాద విధానాల అనుభవం ఏమిటంటే ఈ కాలంలో ఇవి తీవ్ర సంక్షోభంలో పడ్డాయి.

ఈ విపత్కర పరిస్థితిని సరిదిద్దేందుకు పాలకులు ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకోవాలి. కనీసం కార్మికులు కనీస జీవన స్థాయిలో జీవించేందుకు సరిపడా కనీస వేతనాలు ఎప్పటికప్పుడు నిర్ణయిస్తూ అమలు చేయించాలి. కార్మిక, సామాజిక భద్రత వంటి అత్యంత ముఖ్యమైన చట్టాలను కూడా అమలు పరచాలి. కానీ దీనికి భిన్నంగా నేడు వృద్ధి రేటు పెంపు పేర కొద్దిగానైనా కార్మికులకు రక్షణగా వున్న ముఖ్యమైన కార్మిక చట్టాలన్నింటిని నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల శ్రమను పెట్టుబడిదారులు యథేచ్ఛగా కొల్లగొట్టుకోవటానికి అవకాశం కల్పించారు. ఈ ప్రమాదకర విధానాలు రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చాలా దూకుడుగా అమలు చేస్తున్నది.

కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్నట్లే రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయడంలేదు. దీంతో నిరుద్యోగ సమస్య పెరిగిపోతున్నది. అలాగే రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ సంస్థలు, శాఖల్లో సుమారు 6 లక్షలకు పైగా ఉన్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వంటి పేర్లతో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న వారి వేతనాలు పెంచి వారి జీవన ప్రమాణాలు పెంచే చర్యలు తీసుకోవడానికి మొండిగా వ్యవహరిస్తున్నది.

ప్రభుత్వ వ్యయం కూడా పెంచడం లేదు. సంక్షేమ పథకాల పేర ప్రభుత్వ వ్యయ కోతకు పాల్పడుతున్నది. 2018-19లో రాష్ట్ర బడ్జెట్ వ్యయం రాష్ట్ర జిడిపి లో 17.2 శాతం ఉంటే 2024-25 కి 15.97 శాతానికి పడిపోయింది. సామాజిక రంగాలు దారుణమైన పరిస్థితులు చవిచూస్తున్నాయి. ముఖ్యమైన మూలధన వ్యయం కూడా జిఎస్ డిపి లో ఇదే కాలంలో 2.2 శాతం నుండి 0.13 శాతానికి కుదించబడింది. రాష్ట్ర జిడిపి పెరుగుదలతో పాటు వీటి వ్యయం పెరగాల్సిందిపోయి దిగకోతకు గురవుతున్నాయి.

జిడిపి వృద్ధిరేటు పేరుతో ఇప్పుడు చంద్రబాబు పెద్దఎత్తున భూములను కార్పొరేట్లకు ధారాతత్వం చేస్తున్నారు. ల్యాండ్ బ్యాంకుల కోసం ప్రయత్నం చేస్తున్నది. రైతులు దగ్గర నుండి వ్యవసాయ భూములను బలవంతపు సేకరణకు పాల్పడుతుంది. అసైన్డ్ భూములను కూడా పేదల నుండి బలవంతంగా గుంజుకుంటున్నది. భూ సేకరణకు ఆటంకంగా ఉన్న చట్టాలలో అనేక వాటిని సరళతరం చేస్తున్నారు. గతంలో నరేంద్రమోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయక చట్టాలు తీసుకురావడానికి చేసిన తీవ్ర ప్రయత్నం చూశాము. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిలో రాష్ట్రంలో అమలుకు పూనుకున్నది.

చట్టాలను కూడా ధిక్కరించి బిజెపి అండతో రాష్ట్రంలో ఐదవ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన అటవీ ప్రాంతాన్ని కూడా విచ్చలవిడిగా కార్పొరేటర్ల పరం చేసే చర్యలకు తెరలేపారు. ఖనిజ సంపదను, గిరిజన, అటవీ భూములను ఈ శక్తులు తమ దోపిడీకి వినియోగించుకోవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బాక్సైట్ తవ్వకాలకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఇప్పటికే హైడ్రో, గ్రీన్ ఎనర్జీల పేర కార్పొరేట్ సంస్థలకు వేలాది ఎకరాల భూములను కేటాయించారు. ఈ చర్యలు ఆదివాసి గిరిజనుల జీవితాలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. పర్యావరణానికి తీవ్ర ప్రమాదాన్ని తెచ్చి పెడతాయి.

మరో దారుణానికి కూడా ఒడిగట్టారు. భూ వినియోగంలో సామాజిక ప్రయోజనాలను దెబ్బతీసి పూర్తిగా కార్పొరేట్ల కొమ్ము కాయటం మరో ముఖ్యమైన మార్పు. స్వాతంత్ర్యం అనంతరం భూమి నియోగంపై అనేక నియంత్రణలు, కఠిన ఆంక్షలు, చట్టాలు కొనసాగుతూ వస్తున్నాయి. ఎందుకంటే భూమి పరిమితమైన స్థిర పరిమాణంలో ఉంటుంది. ఇతర ప్రయోజనాలకు కేటాయించే కొద్దీ తరిగిపోతుంది. భూవినియోగం వల్ల సమాజం గరిష్ఠ ప్రయోజనం పొందాలి. ఈ అవగాహనతోనే సామాజిక ప్రయోజనాలు, ఆహార భద్రత, నాణ్యమైన ఉపాధి, ప్రాంతీయ అసమానతలు తగ్గింపు, భూ కేంద్రీకరణ నియంత్రణ వంటి అనేక కేంద్ర లక్ష్యాల చుట్టూ కేటాయింపులు జరుగుతూ వచ్చింది. ఈ సామాజిక ప్రయోజనాల నుండి పాలకులు క్రమేణా వైదొలుగుతూ వస్తున్నారు. ఇప్పుడు ఏకంగా భూముల కేటాయింపుతో పాటు కార్పొరేట్ శక్తులు ఇష్టారాజ్యంగా వాటిని వినియోగించుకునేందుకు సర్వ హక్కులు కల్పిస్తున్నారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే ప్రత్యేక ఆర్థిక మండళ్లు, కెమికల్, ఫార్మా హబ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, కారిడార్లు...ఇలా అనేక పేర్లతో బలవంతంగా భూములను సేకరించి పరిశ్రమాధిపతుల పరం చేశారు. ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత వేగంగా హద్దు అదుపూ లేకుండా అన్ని జిల్లాల్లో అనేక పేర్లతో సాగిస్తున్నారు.

రాష్ట్రానికి ఉన్న 974 కిలోమీటర్ల పొడవుగల సముద్ర తీర ప్రాంతాన్ని కూడా కార్పొరేట్ శక్తుల లాభాలు పోగేసుకోవడానికి కేటాయిస్తున్నారు. బీచ్ శాండ్ మినరల్స్ తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారు. టూరిజం కేంద్రంగా బడా పెట్టుబడులకు తీరంపై గుత్తాధిపత్యం కల్పిస్తున్నారు. మారీటైమ్, తీర ప్రాంత రెగ్యులేటరీ జోన్ (సి.ఆర్.జెడ్) నిబంధనలను సడలించేస్తున్నారు. దీంతో లక్షలాది మత్స్యకారుల ఉపాధి, జీవితాలు ప్రమాదంలో పడ్డాయి. ఇప్పటికే తీర్పు ప్రాంతంలో ఉన్న చిన్న సన్నకారు రైతులు, చిన్న ఉత్పత్తిదారులు తరిమి వేయబడుతున్నారు.

కార్మికులు మెరుగైన జీవనం కోసం, వేతనాల సదుపాయాల కోసం, చట్టాల అమలు కోసం చేసే ఆందోళన పోరాటాలు ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలుగాను, వీటివల్ల వృద్ధిరేటు తగ్గి స్థూల ఉత్పత్తికి తీవ్ర నష్టం జరుగుతుందనే వాదనను ముందుకు తీసుకొస్తున్నారు. తమ గుప్పెట్లో ఉన్న కార్పొరేట్ మీడియాతో కార్మిక వర్గానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం సాగిస్తున్నారు. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సమ్మిట్ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖ స్టీల్‌ప్లాంట్ మీద, అందులో పనిచేస్తున్న కార్మికుల మీద అత్యంత దారుణంగా ఆరోపణలు చేసిన సంఘటన చూశాం. తమకు అనుకూలంగా మాట్లాడే విధంగా కొంత మందిని తయారు చేస్తున్నారు.

మొత్తంగా చూస్తే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బడా కార్పొరేట్ శక్తులు గుత్తాధిపత్యంలోకి తీసుకెళ్లడమే మోడీ నాయకత్వంలో చంద్రబాబు-పవన్ కూటమి ప్రభుత్వ జిడిపి వృద్ధి రేటు వ్యూహం. సహజ వనరులు, ప్రజల ఆస్తులు, శ్రమశక్తిని విచ్చలవిడిగా కొల్లగొట్టడం ద్వారా రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెంచాలనేది వీరి దుష్ట పన్నాగం.

/ వ్యాసకర్త సెల్: 9490098792 /

అంతర్జాతీయం

హిట్లర్ బాటలో శాస్త్రవేత్తలను బయటకు పంపుతున్న ట్రంప్ !

ఎం. కోటేశ్వరరావు

అమెరికాలో రెండవసారి అధికారానికి వచ్చి ఇంకా ఏడాది కూడా పూర్తికాకుండానే డోనాల్డ్ ట్రంప్ సైన్సు, సంబంధిత అంశాలపై దాడులు చేస్తున్నాడు. దానికి వ్యతిరేకంగా సైన్సు రక్షణకు అక్కడి శాస్త్రవేత్తలు నడుంకట్టారు. గత పదకొండు నెలల కాలంలోనే ట్రంప్ వేగవంతంగా, తీవ్రమైన దాడులు ఐదువందలసార్లు చేశాడని ఆ రంగం తీరుతెన్నులను పరిశీలిస్తున్న విశ్లేషకులు చెబుతున్నారు. అనేక సంస్థలలో అశాస్త్రీయ భావాలు కలవారితో నింపుతున్నాడు. పొమ్మనకుండానే పొగబెట్టినట్లుగా ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు నిధుల కోత పెడుతున్నాడు.

డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సైన్సు మీద జరుపుతున్నదాడి వలన అమెరికా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, అది స్వయంగా చేసుకొనే తీవ్రహాని అని అనేక మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక ప్రముఖ విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు పాలస్తీనాకు అనుకూలంగా ఇజ్రాయిల్ దుర్మార్గాలను వ్యతిరేకిస్తూ వీధుల్లోకి రావటాన్ని సహించలేని ట్రంప్ వాటికి నిధులు కోతపెడతానని బెదిరించిన సంగతి తెలిసిందే. వాటితో నిమిత్తం లేకుండానే శాస్త్ర పరిశోధనలను నిరుత్సాహపరిచేందుకు బిలియన్లకొద్దీ నిధులకోత ప్రారంభించాడు. ప్రధాన పరిశోధనా సంస్థల బడ్జెట్‌లో 50 శాతం కోత పెట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో అనేక మంది శాస్త్రవేత్తలు అమెరికా వీడటం ప్రారంభమైంది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జర్మనీలో హిట్లర్ యూదులపై జరిపిన ఊచకోత నుంచి తప్పించుకొనేందుకు ఆ సామాజిక తరగతికి చెందిన అనేక మంది విద్యావంతులు, శాస్త్రవేత్తలు అమెరికా, ఇతర ఐరోపా దేశాలకు వలసలు పోయారు. ఆ దేశాల్లో అనేక నవకల్పనలకు ఆద్యులయ్యారు. దీంతో ఇతర దేశాలకు "హిట్లర్ ఇచ్చిన బహుమతి" అని ఈ పరిణామాన్ని వర్ణించారు. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ కూడా అదే చేస్తున్నారని చెబుతున్నారు. ఈ చర్యలతో చైనాతో సహా ఐరోపా ధనికదేశాలన్నీ లబ్ధి పొందుతాయని భావిస్తున్నారు!

శాస్త్ర పరిశోధనలకు గత కొన్ని దశబ్దాలుగా అమెరికా కేంద్రంగా ఉన్న సంగతి తెలిసిందే, వివిధ రంగాలలో నోబెల్ బహుమతి గ్రహీతల్లో సగం మంది అక్కడి నుంచే ఉన్నారు. అలాంటి చోట

శాస్త్రంపై కత్తికట్టటం అంటే అది ఒక్క అమెరికాకే కాదు, యావత్ ప్రపంచానికి నష్టం. ఇప్పటికీ అనేక వ్యాధులకు కారణాలు, చికిత్సలు సవాలుగానే ఉన్నాయి. ట్రంప్ తీసుకున్న మతిమాలిన చర్యల కారణంగా అనేక పరిశోధనలు అర్ధంతరంగా ఆగటం లేదా ఆలశ్యానికి దారితీస్తాయి. అన్ని దేశాల్లో ఉన్నట్లే బ్యూరోక్రసీ అమెరికాలో కూడా తక్కువేమీ కాదు. ఐదు రోజుల పనివారంలో రెండు రోజులు ప్రయోగశాలలకు బదులు ప్రభుత్వ యంత్రాంగ కాగితాలు నింపటానికే రెండు రోజులు పోతున్నదని అనేక మంది శాస్త్రవేత్తలు విమర్శిస్తున్నమాట నిజం. నివారణకు మార్గాలు వెతకాలి తప్ప అసలు పరిశోధకులనే తొలగిస్తే ఎలా? అమెరికా అనుసరిస్తున్న ప్రతికూల విధానాల ఫలితంగా అక్కడ ఉండేవారి సంఖ్య తగ్గుతోంది. ఈ ఏడాది తొలి మూడు మాసాల్లో పరిశోధనలకు విదేశాలకు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్న అమెరికా శాస్త్రవేత్తలు 2024 మొదటి మూడు నెలలతో పోలిస్తే మూడో వంతు పెరిగింది. అమెరికాకు రావాలనుకొనే వారు నాలుగో వంతు తగ్గారు. ఒకసారి ఉన్న పేరు పోతే తిరిగి తెచ్చుకోవటం కష్టమని అనేక మంది చెబుతున్నా ట్రంప్ చెవికి ఎక్కటం లేదు. అమెరికా మిలిటరీ, సాంకేతిక పరిజ్ఞానంలో ఉన్నతంగా ఉండటానికి శాస్త్రపరిశోధనలే కారణమని, అలాంటివి లేకపోతే ఆ స్థానాన్ని చైనా ఆక్రమిస్తుందని ఆందోళన చెందేవారు మరోవైపు ఉన్నారు. శాస్త్రవిజ్ఞానాన్ని మానవాళి సౌభాగ్యానికి వినియోగించాలి. వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలు ఎక్కడ జరిగినా కాస్త వెనుకా ముందూ ప్రపంచంలోని వారందరికీ అందుబాటులోకి వస్తాయి. అలాంటి పరిశోధనా రంగంలో ముందున్న అమెరికా ఒక్కసారిగా జెండా ఎత్తేస్తే లోకమంతా అలాగే ఉంటుందని కాదు గానీ, పరిశోధనలు ఆలశ్యమౌతాయి.

శాస్త్ర పరిశోధనలు ప్రస్తుతం కొన్ని దేశాలకే పరిమితం అవుతున్నందున వాటిని ఆయుధాలుగా చేసుకొని వెనుకబడిన దేశాలను దోపిడీ చేయటం కూడా ఒక వాస్తవం. వర్షాలు, వరదలు, దుర్భిక్షం వంటి ప్రకృతి వైపరీత్యాల గురించి ముందుగానే పసిగట్టే పరిజ్ఞానాన్ని మరింత నిర్దిష్టం కావించాలి. అది అమెరికాకూ అవసరమే. అక్కడి కొన్ని రాష్ట్రాలలో సంభవించిన ప్రమాదకర వరదలు, తుఫాన్లను సకాలంలో పసిగట్టగలిగి ఉంటే నష్టాలు తగ్గి ఉండేవి. జలుబుకు కారణమౌతున్న వైరస్‌లు అమెరికాలో ఇప్పటికీ ప్రాణాంతకంగానే ఉన్నాయి. ఉష్ణమండల ప్రాంతాల్లో దోమ కాటు వలన డెంగీ ఎంత ప్రమాదకరంగా ఉందో తెలిసిందే. రాజకీయాలలో ప్రపంచమంతటా మితవాద శక్తులు పెరిగిపోతున్నట్లుగానే ప్రపంచంలో శాస్త్రవిజ్ఞానాన్ని వ్యతిరేకించే మూఢత్వం కూడా పెరుగుతున్నది. కరోనా సమయంలో మనదేశంతో సహా ప్రపంచమంతటా అలాంటి శక్తులు ఎలా రెచ్చిపోయాయో చూశాము. శాస్త్రవేత్తలు, వైద్యుల సలహాలను పక్కన పెట్టి, వ్యాక్సిన్‌ను వ్యతిరేకంచే శక్తుల మాటలు నమ్మి లక్షలాది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. కరోనా, వాతావరణమార్పులు వాస్తవం కాదని, వ్యాక్సిన్ల వలన ప్రయోజనం లేదని అమెరికా, ఐరోపాలోని ప్రముఖ మీడియా సంస్థలు చేసిన తప్పుడు ప్రచారం తెలిసిందే.

పర్యావరణానికి కలుగుతున్న హాని, వివిధ వ్యాధుల నివారణకు అవసరమైన వ్యాక్సిన్లపై జరిపే పరిశోధనలకు ట్రంప్ సర్కార్ నిధుల కోత పెడుతున్నది, సిబ్బందిని తగ్గిస్తున్నది. వాతావరణ మార్పులపై పరిశోధన చేస్తున్న ఎన్‌సిఏఆర్ వంటి సంస్థలను ఎత్తివేయాలని చూస్తున్నది. వచ్చే ఏడాది ఎలాంటి దాడులను చేస్తుందో తెలియదు, 2025లో పరిశోధనా ప్రయత్నాలు, కీలకమైన శాస్త్రీయ సమాచారంతో పౌరులందరికీ అందుబాటులో వెబ్‌సైట్లను మూసివేసింది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే లేదా వ్యతిరేకించేవారి మీద దాడులకు ఉసిగొల్పుతున్నది, పదవుల నుంచి తొలగిస్తున్నది. ప్రజారోగ్య రక్షణలో ముందున్న డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్(సిడిసి) అధిపతిగా సుసాన్ మోనారెజ్ బాధ్యతలు స్వీకరించినపుడు అనేక మంది పరిశోధకులు ఊపిరి పీల్చుకున్నారు.

శాస్త్ర పరిశోధనలకు గత కొన్ని దశబ్దాలుగా అమెరికా కేంద్రంగా ఉన్న సంగతి తెలిసిందే, వివిధ రంగాలలో నోబెల్ బహుమతి గ్రహీతల్లో సగం మంది అక్కడి నుంచే ఉన్నారు. అలాంటి చోట శాస్త్రంపై కత్తి కట్టటం అంటే అది ఒక్క అమెరికాకే కాదు, యావత్ ప్రపంచానికి నష్టం. ఇప్పటికీ అనేక వ్యాధులకు కారణాలు, చికిత్సలు సవాలుగానే ఉన్నాయి. ట్రంప్ తీసుకున్న మతిమాలిన చర్యల కారణంగా అనేక పరిశోధనలు అర్ధంతరంగా ఆగటం లేదా ఆలశ్యానికి దారితీస్తాయి.

ఆమెకు రాజీపడని మైక్రోబయాలజిస్ట్, ఇమ్యునాలజిస్ట్ శాస్త్రవేత్తగా పేరుంది. ప్రభుత్వంలో ఇరవై సంవత్సరాలుగా పని చేస్తున్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల్లోనే ఆగస్టులో ట్రంప్ ఆమెను బయటకు పంపాడు. ఒక శాస్త్రవేత్తగా రాజీ పడని కారణంగానే తనను తొలగించారని ఆమె చెప్పారు. సిడిసిలో కొంత మంది శాస్త్రవేత్తలను తొలగించాలని, ఎలాంటి శాస్త్రీయ సమాచారం లేకపోయినప్పటికీ కొన్ని వ్యాక్సిన్లకు ఆమోద ముద్ర వేయాలని ఆరోగ్యశాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెనడీ జూనియర్ తనపై తెచ్చిన ఒత్తిడికి లొంగని కారణంగా తప్పుడు ఆరోపణలతో తొలగించినట్లు ఆమె చెప్పారు. ఈ మంత్రి గతంలో అమెరికాలో అత్యంత అవినీతి సంస్థగా సిడిసిని వర్ణించాడు. వ్యాక్సిన్లకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన కెనడీ వ్యాక్సిన్ల విషయంలోనే ఆమెను ఒత్తిడి చేయటం అంటే సదరు కంపెనీల లాబీ ఎంతటి శక్తివంతమైనదో అర్థం చేసుకోవచ్చు. బహిరంగంగా వ్యాక్సిన్లను విమర్శించిన వారిని ఆ సంస్థలో చేర్చాడు. నాలుగో వంతు సిబ్బందిని తగ్గించాడు. డోనాల్డ్ ట్రంప్ విధానాలు ప్రజారోగ్యానికి ముప్పు తెస్తాయని మోనారెజ్ హెచ్చరించారు. నిబద్ధత, ఆత్మగౌరవం ఉన్న శాస్త్రవేత్త ఎవరూ తగిన శాస్త్రీయ సమాచారం లేకుండా వ్యాక్సిన్ లేదా ఔషధాలను అంగీకరించరని సుసాన్ కూడా అదే చేశారని అనేక మంది ప్రశంసించారు. ఆమెకు మద్దతుగా ఒక వైద్యాధికారి, ముగ్గురు సీనియర్ సిడిసి శాస్త్రవేత్తలు ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ రాజీనామా చేశారు.

ట్రంప్ వైఖరిని సైన్సుపై నిరంకుశత్వంగా వర్ణిస్తూ దాన్ని ఎదుర్కొనేందుకు సంసిద్ధులు కావాలని, వచ్చే ఏడాది చేపట్టే కార్యాచరణకు గాను డిసెంబరు 31 లోగా విరాళాలు ఇవ్వాలని "తాపత్రయపడే సైంటిస్టుల యూనియన్" పిలుపునిచ్చింది. అతగాడి విధానాలను కార్మికవర్గం ఎలా ప్రతిఘటిస్తున్నదో అదే విధంగా అమెరికా శాస్త్రవేత్తలు ప్రారంభించిన ఉద్యమం కూడా ముందుకు పోయి తగిన ప్రభావం చూపటం అనివార్యం!

★

కవిత

తాత!

కలలోన కనిపించి..
విలువైన చూపులతో
స్వాతంత్ర్య రాట్నమై..
చేనేత రత్నమై
నవ్వుతున్నాడమ్మా!
మన గాంధీ తాత
కూలోళ్ల వాకిట్ల
మొల గోచి పాత!
వీధులన్నీ తిరిగి
వేదనలు చూసాడు!
దళిత కన్నీళ్ళతో
మిళితమైనా వాడు !
పల్లెలా సుఖముకై పలవరించినవాడు !
వెన్నెముక నా చేతి
కర్ర అనుకున్నాడు!
సంస్కృతిలో భాగం
మతం అనుకున్నాడు!
ఉన్మాద కాల్పులకు
తనువు అర్పించాడు !
పేద పౌరుల బాధ
బాధ్యతనుకున్నాడు !
అర్థ నగ్నం బతుకు
సాధ్యమే అన్నాడు!
కనుజోడు ఫ్రేముకు
అద్దాలు తీసేసి
పథకాల బొమ్మలుగా వాడేసుకున్నారు!
జెండాల పండగల
జేజేలు రాసేసి
ఊరు, వాడా
గోడ నింపేసుకున్నారు!
మగ్గాల తువ్వాలు
చెమటతో తడిసింది!
పత్తి పువ్విప్పుడు
ఒత్తిగా మిగిలింది!
నవ్వుతున్నాడమ్మా
మన గాంధితాత!
కూలీల వాకిట్లో
మన గోచిపాత!?

- నల్లి ధర్మారావు
సెల్: 7660967313

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

రెండేళ్లలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పూర్తి

• 7,500 టన్నుల చెత్త నుంచి విద్యుత్ • డిస్కమ్‌లతో ఒప్పందం చేసుకున్న పట్టణాభివృద్ధిశాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న 7,500 టన్నుల చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసేలా ప్లాంట్లు నెలకొల్పుతున్నామని మంత్రి నారాయణ తెలిపారు. రెండేళ్లలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న నాలుగు వేస్ట్ టు ఎనర్జీ కేంద్రాల విద్యుత్‌ను డిస్కమ్‌లకు విక్రయించేలా మంగళవారం నాడు మంత్రి నారాయణ సమక్షంలో డిస్కమ్‌లు ఒప్పందం చేసుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చెత్తపైనా పన్ను వసూలు చేసిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త వదిలిపోయిందన్నారు. అక్టోబర్ నాటికి చెత్తను తొలగించాలని సిఎం చెప్పారని, ఇంకా 93 లక్షల టన్నుల చెత్తను అధికారులు తరలించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 10 ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ప్రస్తుతం విశాఖ, గుంటూరులో రెండు కేంద్రాల నుండి చెత్త నుండి విద్యుదుత్పత్తి అవుతోందని, నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలులో ఏర్పాటు చేసే నాలుగు ప్లాంట్లతో డిస్కమ్‌లు ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. రెండేళ్లలో ప్లాంట్లను పూర్తి చేస్తామన్నారు. పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ... మున్సిపల్ వ్యర్థాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తామన్నారు. గుంటూరులో 20 మెగావాట్లు, విశాఖలో 15 మెగావాట్లు ఉత్పత్తి చేస్తామన్నారు.

ఆరావళి పర్వతాల్లో హిల్ హౌస్‌లు
పర్యావరణానికి ముప్పు

- డిస్కమ్‌లను ప్రైవేటీకరించేందుకే విద్యుత్ సవరణ చట్టం
- 'వివి జి ఆర్‌ఎంఎం జి'తో సామాజిక భద్రతకు తూట్లు : బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఢిల్లీ సమీపంలోని ఆరావళి పర్వత శ్రేణుల్లో కార్పొరేట్ హిల్ హౌస్‌లు పెరిగిపోతున్నాయని, పర్యావరణానికి, నీటి వనరులకు ఇది తీవ్ర నష్టమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జ్యోతితో కలిసి విలేకరుల సమావేశంలో రాఘవులు మాట్లాడారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థలను (డిస్కమ్‌లు) ప్రయివేటు పరం చేసేందుకే మోడీ ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లు తెచ్చిందన్నారు. తాజాగా ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో దేశానికే అత్యంత ప్రమాదకరమైన నాలుగు చట్టాలను కేంద్రం ఆమోద ముద్ర వేసుకుందని, వాటి పరిణామాలు దేశ ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగించనున్నాయని హెచ్చరించారు. వాటికి వ్యతిరేకంగా కలిసొచ్చే శక్తులన్నింటిని, పార్టీలను కలుపుకుని దేశవ్యాప్త పోరాటాలను నిర్వహించబోతున్నామని తెలిపారు. కార్పొరేట్ అధిక లాభాల కోసం గడించేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఇప్పటివరకు విద్యుత్ పంపిణీ వ్యవస్థ 99 శాతం ప్రభుత్వ ఆధీనంలో నడిచేదని, దాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే మోడీ సర్కార్ విద్యుత్ సవరణ చట్టాన్ని చేసిందని విమర్శించారు. ఈ చట్టం ద్వారా సబ్సిడీ ఎగిరిపోతుందని, రైతులు, పేదలు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కోల్పోతారని వివరించారు. అదానీ, అంబాని, గోద్రెజ్, సుజాన్, వంటి విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఎప్పటి నుంచో పంపిణీ వ్యవస్థను తమకివ్వాలని ఒత్తిడి తేవడంతోనే మోడీ సర్కారు ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. తెలంగాణలో మూడో డిస్కమ్ ఏర్పాటును రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిపాదించడాన్ని తప్పుబట్టారు. 'వివి జి ఆర్ఎంఎం జి' చట్టం రాష్ట్రాలకు పెనుభారంగా మారబోతోందని, ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రాలు 40 శాతం నిధులను ఖర్చుచేయకపోతే కేంద్రం ఇచ్చే 60 శాతం నిధులను ఆపేస్తుందని తెలిపారు. దేశంలోనే ఎక్కువ పనిదినాలను వాడుకుంటున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. 'సబ్‌కా బీమా సబ్‌కా రక్ష కాదు.. సబ్‌కే బీమా కార్పొరేట్‌కా రక్ష' అనే ఇన్సూరెన్స్ చట్టంలో మార్పులున్నాయని, విదేశీ సంస్థలకు ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని మోడీ సర్కారు కల్పించిందని విమర్శించారు. శాంతి పేరుతో తీసుకొస్తున్న న్యూక్లియర్ లయబిలిటీ బిల్లు విదేశీ సంస్థల కంపెనీల స్థాపించే అవకాశాన్ని కల్పిస్తుందని, ప్రమాదాలు జరిగితే కంపెనీల బాధ్యత కాదని ఆ చట్టంలో పేర్కొనడం దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. నిజమైన దేశభక్తులు ఎన్‌డిఎ, దాని మిత్రపక్షాలు కాదని, దేశ రక్షణ కోసం కొట్లాడుతున్న కమ్యూనిస్టులు, లౌకికశక్తులు, ప్రజలు నిజమైన దేశభక్తులని స్పష్టం చేశారు. బిజెపి చేతుల్లో ఇసి పావుగా మారిందన్నారు.

వైసిపి బిల్డింగ్‌కు ఒసి జారీపై నిష్పక్షికంగా ఉండండి : హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి : మచిలీపట్నంలో వైసిపి ఆఫీసు బిల్డింగ్‌కు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఒసి) జారీ వ్యవహారంలో అధికారులు నిష్పక్షికంగా వ్యవహరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఒసి కోసం నాలుగు రోజుల్లో కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు పేర్ని నానికి ఆదేశాలు జారీ చేసింది. భవన నిర్మాణ అనుమతుల పత్రాలను కమిషనర్‌కు అందజేయాలంది. దరఖాస్తును మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ న్యాయవాది ఎసిఎస్ బోస్‌కు కూడా అందజేయాలంది.

వ్యవసాయ రంగంపై అశ్రద్ధ తగదు : వడ్డే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : వ్యవసాయం రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అశ్రద్ధ చూపుతూ ఆదాని, అంబాని లాంటి బడా కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూరుస్తున్నాయని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని 'రైతాంగం సమస్యలు - పరిష్కారాలు'పై జన చైతన్య వేదిక ఆధ్వర్యాన గుంటూరులో రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. వ్యవసాయరంగ అభివృద్ధికి చరణ్ సింగ్ అవిరళ కృషి చేశారన్నారు. ప్రస్తుతం లక్షలాది ఎకరాల పంట భూములను బడా కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని, అప్పుల ఊబిలోనున్న రైతుల రుణాలను రద్దు చేయాలన్న ఆలోచన పాలకులకు కొరవడిందన్నారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత అల్పంగా ఉందని, పరిశోధనలకు తగిన బడ్జెట్ కేటాయించడం లేదని విమర్శించారు. పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడం వల్ల ఏటా మూడు లక్షల కోట్ల రూపాయలను రైతులు నష్టపోతున్నారన్నారు. చైనా ప్రభుత్వం రైతులకు ఏటా రూ.15 లక్షల కోట్ల సబ్సిడీ అందిస్తోందని, అందులో పది శాతం కూడా భారత ప్రభుత్వం రైతాంగానికి అందించడం లేదన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ... భారతదేశ జనాభాలో 46 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, జాతీయ ఆదాయంలో 15 శాతం మాత్రమే పొందుతున్నారన్నారు. అమెరికా జనాభాలో 1.3 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడ్డారని, ఆ దేశ జాతీయ ఆదాయంలో ఒక్క శాతం ఆదాయం పొందుతున్నారని అన్నారు. ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాల్, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, మానవత కార్యదర్శి కె.సతీష్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేత సిహెచ్ పరమేశ్వర రెడ్డి, రైతు సంఘ నాయకులు కొల్లి రంగారెడ్డి, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు పఠాన్ అల్లాభక్షు, జనచైతన్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి ధనుంజయ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

SBI స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా

యస్‌యమ్‌ఇ బ్రాంచి బిసెంట్ రోడ్ బ్రాంచి (బ్రాంచ్ కోడ్ : 63640), డోరు నెం.27-129-42 & 27-06-106, గ్రావిటీ టవర్స్, 2వ అంతస్థు, ప్రకాశం రోడ్, విజయవాడ-520002. ఫోన్: 0866-2572192, 2571893, Email: sbi.63640@sbi.co.in

ఋణగ్రహీత, హామీదారుకు సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2)కు లోబడి జారీచేయబడిన నోటీసు)

ఋణగ్రహీత మరియు హామీదారుల పేర్లు, చిరునామా	ఋణము, ఖాతా నెం.& చెల్లించవలసిన మొత్తము
ఋణగ్రహీత : మెస్సర్స్ కార్తికేయ అసోసియేట్స్ 1) సజ్జా నితిన్ చక్రవర్తి, చిరునామా : సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి : సజ్జా సురేష్, నివాసము : తండ్రి : సురేష్, ఫ్లాట్ నెం.4, షారోన్ అపార్ట్‌మెంట్స్, మెథోడిస్ట్ కాలనీ, బేగంపేట, హైదరాబాద్, తెలంగాణ-500016, 2) చుక్కపల్లి శ్రావణి, చిరునామా : శ్రీమతి చుక్కపల్లి శ్రావణి, భర్త : సజ్జా నితిన్ చక్రవర్తి, నివాసము : కేరాఫ్ : సజ్జా నితిన్ చక్రవర్తి, ఫ్లాట్ నెం.4, షారోన్ అపార్ట్‌మెంట్స్, మెథోడిస్ట్ కాలనీ, బేగంపేట, హైదరాబాద్, తెలంగాణ-500016, హామీదారులు : 1) సజ్జా నితిన్ చక్రవర్తి, చిరునామా : కార్తికేయ అసోసియేట్స్, ప్లాట్ నెం.60, వార్డు నెం.8, కెపి నగర్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ, కృష్ణా జిల్లా, 2) చుక్కపల్లి శ్రావణి, చిరునామా : కార్తికేయ అసోసియేట్స్, ప్లాట్ నెం.60, వార్డు నెం.8, కెపి నగర్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ, కృష్ణా జిల్లా.	టర్మ్ లోన్ అకౌంట్ నెం. 43404366479

డిమాండ్ నోటీసు తేది	04-12-2025	యన్‌పిఎ తేది	30-11-2025

బకాయి మొత్తం: ది.04-12-2025 నాటికి రూ.4,94,85,661/- (అక్షరాల నాలుగు కోట్ల తొంభైనాలుగు లక్షలఎనభైఐదు వేల ఆరు వందల అరవైఒక్కటి రూపాయలు మాత్రము) ప్లస్ ది.05-12-2025 నుండి తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులతో పాటు

షెడ్యూలు-సి

షెడ్యూలు నెం.1 : గుంటూరు జిల్లా, తెనాలి యస్‌ఆర్‌ఒ లో రిజిస్టర్డ్ కాబడిన దస్తావేజు నెం.3671/2023 ప్రకారం శ్రీ సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి : సజ్జా సురేష్‌కు చెందిన ఆస్తి : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, కంకిపాడు మండలం, సూర్యా నగర్ వెంచర్ దగ్గర, గొడవర్రు గ్రామము, డివిజన్ నెం.312/1, అడంగల్ ప్రకారం 312/1ఎ, సమీప డోరు నెం.1-83 నందు 5929.00 చ॥గ॥లు లేదా 4957.00 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: మల్లెల విజయలక్ష్మి మరియు ఇతరుల యొక్క ఆస్తి, దక్షిణం: కొనేరు శ్రీకృష్ణ మూర్తి యొక్క ఆస్తి, పడమర: యలమంచిలి వెంకట నారాయణ రావు యొక్క ఆస్తి మరియు లేఅవుట్ రోడ్‌కు వెళ్ళు నడకమార్గం, ఉత్తరం: కొనేరు దిలీప్ కుమార్ యొక్క ఆస్తి.

పైన పేర్కొన్న ఋణగ్రహీతలు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్‌యమ్‌ఇ బిసెంట్ రోడ్ బ్రాంచ్ (63640), విజయవాడ, కృష్ణా జిల్లా నుండి లోన్స్ / అడ్వాన్స్‌ల రూపంలో ఋణసౌకర్యములను పొందియున్నారు. మీరు పొందిన ఋణము తిరిగి చెల్లించనందున యన్‌పిఎగా వర్గీకరింపబడి పైన పేర్కొనబడిన సొమ్ము బకాయిగా వున్నది. మేము ఇప్పటికే 04-12-2025 తేదీ గల డిమాండ్ నోటీసు సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద తిరుగు రశీదుతో రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించగా అట్టి నోటీను తిరిగి వచ్చినందున/ ఋణగ్రహీత సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరలా నోటీసు జారీచేయడమైనది. సెక్షన్ 13(4) చట్టం క్రింద 60 రోజులలోపు పైన చెప్పిన మొత్తాన్ని చెల్లించని పక్షంలో బ్యాంకుకు తనఖావుంచిన సెక్యూరిటీ ఆస్తులను స్వాధీనం చేసుకొనగలమని మా అభిప్రాయాన్ని తెలియచేయడమైనది.
మీకు ఇస్తున్న సూచనలు : 1) అసలు నోటీసు కాపీ/నోటీసుకు సంబంధించిన సమగ్ర వివరములను, అధీకృత అధికారి నుండి పొందవచ్చునని సూచించబడినది. 2) SARFAESI యాక్ట్ క్రింద తదుపరి చర్యలకు పాల్పడకుండా వుండేందుకు నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు వడ్డీ, ఖర్చులతో సహా మొత్తం బకాయి చెల్లించవలసి వుంటుంది.
ప్రదేశం : విజయవాడ, తేది : 04-12-2025 సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్‌యమ్‌ఇ బిసెంట్ రోడ్ బ్రాంచ్, విజయవాడ.

ARKA అర్కా ఫిన్‌క్యాప్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీస్: 2504, 25వఅంతస్తు, వన్‌లోధా ప్లేస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్, ముంబయి-400013 మహారాష్ట్ర,
Email: customercare@arkaholdings.com. CIN Number:- U65993MH2018PLC308329
Contact No. 022 40471000 Mobile No. 9677261411

(స్థిరాస్తుల యొక్క వేలం అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన)

సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1)తో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీతలకు ప్రకటన ఇవ్వడమేమనగా సెక్యూరిటైజేషన్అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద అర్కా ఫిన్‌క్యాప్ లిమిటెడ్ (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటర్" అనిసూచిస్తారు) యొక్క అధీకృత అధికారిగా దిగువ పేర్కొన్న సెక్యూర్డు అసెట్స్ యొక్క భౌతిక స్వాధీనతాను అనుసరించి దిగువ వివరించి విధంగా స్థిరాస్తి కొనుగోలు కొరకు దిగువ సంతకందారు ద్వారా రుణగ్రహీతల నుండి మొత్తం బకాయిలను రికవరీ కొరకు మా సేల్స్ మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ పార్ట్‌నర్, క్రెడిట్ రిజల్యూషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనగా www.credauction యొక్క వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో సమర్పించమని ఆహ్వానించబడ్డారు.

రుణగ్రహీత(ల) వివరాలు	13(2) డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం	రిజర్వు ధర / ఈఎండి / బిడ్ పెంపుదల మొత్తం	ఇ-వేలం తేదీ& సమయం
బ్రాంచ్: విజయవాడ రుణగ్రహీత: మెస్సర్స్ సాయి శ్రీ గ్రౌండ్‌నట్స్ సహ-రుణగ్రహీతలు: 1) మెస్సర్స్ లక్ష్మీ సీడ్స్ 2) శ్రీ మాధవ్ కుమార్ సకల 3) శ్రీమతి రమ్య సకల	తేదీ: 08/05/2025 06/05/2025 నాటికి రుణ ఖాతా నెం.2002007294 కొరకు రూ.2,09,61,352.85/- (రూపాయలు రెండు కోట్ల తొమ్మిది లక్షల అరవైఒక వేల మూడు వందల యాభై రెండు మరియు ఎనభై ఐదు పైసలు మాత్రమే)	INR 1,70,00,000/- (రూపాయలు ఒక కోటి డెబ్బై లక్షలు మాత్రమే) INR 17,00,000/- (రూపాయలు పదిహేడు లక్షలు మాత్రమే) INR 50,000/- (రూపాయలు యాభై వేలు మాత్రమే)	20 జనవరి, 2026 సమయం: ఉ.10.30 నుండి 11.30 వరకు 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో

ఆస్తికి సంబంధించిన వివరణ: పాత డో నెం.16/528, కొత్త డోర్ నెం.20-10-12, 20-10-12/ఏ కలిగిన స్థలం మరియు దానిపై నిర్మించిన బిల్డింగ్ కలిగిన ఆస్తి మొత్తం భాగం, మున్సిపల్ అసెస్మెంట్ నెం.28807, ప్రస్తుత అసెస్మెంట్ నెం.1021087200, టి.ఎస్ నెం.18, మున్సిపల్ ఫ్యాక్టరీస్, పాత వార్డ్ నెం.14, ప్రస్తుత వార్డ్ నెం.16, బ్లాక్ నెం.1, ఆర్.అగ్రహారం కోనేటి రోడ్ ప్రాంతం, గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, 261.4/9 చ.గ.ల విస్తీర్ణంలో మరియు అన్ని సౌలభ్యహక్కులతో మరియు సరిహద్దులు: తూర్పు: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్-45.6 అ.లు, దక్షిణం: చింతపల్లి నర్సింహారావు ఆస్తి-51.6అ.లు, పడమర: ఇంటి గోడ మంజుఒందరు అచ్చుతరావుకు చెందినది-45.6 అ.లు, ఉత్తరం: శ్రీ సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం-52.0అ.లు.

ఇ-వేలం నిబంధనలు మరియు షరతులు:

1) వేలం బిడ్ డాక్యుమెంట్ యొక్క తదుపరి నిబంధనలు మరియు షరతుల ప్రకారం మరియు అందులో పేర్కొన్న విధానం ప్రకారం నిర్వహించబడుతుంది. బిడ్డర్లు బిడ్ డాక్యుమెంట్ల కోసం అర్కా ఫిన్‌క్యాప్ లిమిటెడ్ వెబ్‌సైట్ (www.arkaholdings.com) మరియు ఇ-వేలం కోసం ఉంచిన సెక్యూర్డ్ ఆస్తి వివరాలు మరియు ఆన్‌లైన్‌లో సమర్పించబడే బిడ్ ఫారమ్.మా సేల్స్ &మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్: www.credauction.com ద్వారా వెళ్ళవచ్చుఞ
2) అందరూ ఉద్దేశించిన కొనుగోలుదారులు/బిడ్డర్లు పైన పేర్కొన్న www.credauction.com వెబ్ పోర్టల్‌లో వారి పేరును నమోదు చేసుకోవాలి మరియు పైన పేర్కొన్న తేదీ మరియు సమయంలో ఇ-వేలంలో పాల్గొనడానికి వారి స్వంత యూజర్ ఐడి & పాస్‌వర్డ్‌ను ఉచితంగా జనరేట్ చేయాలి.
3) ఆస్తి యొక్క ఏదైనా విచారణ, సమాచారం & తనిఖీ, మద్దతు, విధానం మరియు ఆన్‌లైన్ శిక్షణ కోసం, కాబోయే బిడ్డరుదారులు మా సేల్స్ & మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ పార్ట్‌నర్ క్రెడిట్ రిజల్యూషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యొక్క క్లయింట్ సర్వీస్ డెలివరీ (సిఎస్‌డి) అపార్ట్‌మెంట్, ఈ-మెయిల్ ఐడి:balram@credsolv.com లేదా amit@credsolv.com లేదా అధీకృత అధికారి, shantanu.dorlikar@arkaholdings.com వారిని సంప్రదించవచ్చు. అధీకృత అధికారికి తెలిసినంత వరకు మరియు సమాచారం మేరకు, ఆస్తి/ఆస్తులలో ఎటువంటి భారంలేదు. అయితే, ఉద్దేశించిన బిడ్డర్లు తమ బిడ్‌ను సమర్పించే ముందు ఆస్తి/ఆస్తులపై విధించిన భారం, టైటిల్ మరియు క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిలు/ఆస్తుతిని ప్రభావితం చేసే వాటి గురించి వారిస్వంత స్వతంత్ర విచారణలు చేసుకోవాలి. ఇ-వేలం ప్రకటన సెక్యూర్డ్ క్రెడిటర్/అధీకృత అధికారి యొక్క ఏదైనానిబద్ధత లేదా ఏదైనా ప్రాతినిధ్యాన్ని కలిగి ఉండదు. సెక్యూర్డ్ క్రెడిటర్/అధీకృత అధికారికి తెలియని అన్ని ప్రస్తుత మరియు భవిష్యత్తులో వచ్చే రుణభారాలతో ఆస్తిని అమ్ముతున్నారు. అధీకృత అధికారి/సెక్యూర్డ్ క్రెడిటర్ ఏ మూడవ పక్ష క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిలకు ఏ విధంగానూ బాధ్యత వహించరు.
4) ఇ-వేలంలో పాల్గొనడానికి, ఉద్దేశించిన కొనుగోలుదారులు/బిడ్డర్లు అర్కా ఫిన్‌క్యాప్ లిమిటెడ్‌లోని సెక్యూర్డ్ క్రెడిటర్ కార్యాలయం యొక్క బ్రాంచ్‌లో సరిగ్గా పూరించిన బిడ్ ఫారమ్ యొక్క హార్డ్ కాపీని సమర్పించాలి, డోర్ నెం.39-6-3/1, తోటస్ వివేధ, 1వ అంతస్తు, జక్కా వెంకట స్వామి స్ట్రీట్, విజయవాడ-520010 పైన పేర్కొన్న విధంగా సెక్యూర్డ్ ఆస్తి యొక్క వడ్డీ రహిత రీఫండబుల్ ధరావత్తు (ఈఎండి)(చెల్లింపు వివరాలతో 'అర్కా ఫిన్‌క్యాప్ లిమిటెడ్' పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా లేదా ఆర్టీజిఎస్/ ఎన్ఇఎఫ్టీ ద్వారా ఈ క్రింది విధంగా పేర్కొన్న ఖాతా వివరాలకు:
   ఎ. ఖాతా పేరు: అర్కా ఫిన్‌క్యాప్ లిమిటెడ్
   బి. బ్యాంక్ పేరు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్
   సి. బ్యాంక్ చిరునామా: సిజి రోడ్, అహ్మదాబాద్
   డి. బ్యాంక్ ఖాతా నెంబరు: 032305006479
   ఇ. ఐఎఫ్ఎస్‌సి కోడ్: ICIC0001367
19 జనవరి, 2026న సా.5.00గం.లకు లేదా అంతకు ముందు పాన్‌కార్డ్, ఆధార్ కార్డ్, నివాస చిరునామా రుజువు, కంపెనీ విషయంలో బోర్డు తీర్మానాలు మరియు చిరునామా రుజువు యొక్క స్వీయ-ధృవీకరించబడిన కాపీలతో పాటు సమర్పించాలి.
ఇ-వేలం షరతులు మరియు నియమాలు : వేలం బిడ్ డాక్యుమెంట్ యొక్క తదుపరి నిబంధనలు మరియు షరతుల ప్రకారం మరియు దానిలో పేర్కొన్న విధానం ప్రకారం నిర్వహించబడుతుంది. బిడ్డర్లు బిడ్డింగ్ సమాచారం మరియు మద్దతు కోసం మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్, మెస్సర్స్ఆర్కా ఈమార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వెబ్ పోర్టల్ **https://www.auctionbazaar.com/** " సందర్శించవచ్చు, ఇ-వేలం కోసం ఉంచబడిన సెక్యూర్డ్ ఆస్తి వివరాలు మరియు ఆన్‌లైన్‌లో సమర్పించబడే బిడ్ ఫారమ్. ఆసక్తిగల కొనుగోలుదారులు వేలం నిబంధనలు మరియు షరతులు మరియు ప్రక్రియను అదే పోర్టల్‌లో పరిశీలించవచ్చు మరియు **బొప్పూరి నాగరాజు 7304997399** మరియు **పివిఆర్ సుబ్రహ్మణ్యం 9372705039** ని సంప్రదించవచ్చు, పైన పేర్కొన్న వెబ్ పోర్టల్‌లో వివరాలు అందుబాటులో ఉన్నాయి మరియు వారి కేంద్రీకృత హెల్ప్ డెస్క్: **+ 91 83709 69696**, ఈ-మెయిల్ ఐడి: **contact@auctionbazaar.com** ని సంప్రదించవచ్చు.

ప్రదేశం: విజయవాడ
తేది: 24.12.2025
సం/- అధీకృత అధికారి, (మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్) (గతంలో ఆస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అని పిలిచేవారు)

HDFC BANK We understand your world
నమోదిత కార్యాలయం: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్, ముంబై-400 013
ప్రత్యేక కార్యకలాపాల కోసం శాఖ
768 మరియు 769, 5 వ అంతస్తు, "ఎ" విభాగం, ఫేజ్-III, స్పెన్సర్ ప్లాజా, అన్నా సాలై, చెన్నై-600002.

సర్ఫేసీ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(20 క్రింద డిమాండ్ నోటీసు

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ నుండి పొందిన రుణ సౌకర్యం(లు) తిరిగి చెల్లించడంలో డిఫాల్ట్ అయిన మరియు 31-మే-2025న వారి రుణ ఖాతాను నిరర్థక ఆస్తి (ఎన్‌పిఎ)గా వర్గీకరించారు. క్రింద పేర్కొన్న రుణగ్రహీత, హామీదారు(లు) మరియు తనఖాదారు(లు) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. వారికి సెక్యూరిటైజేషన్ ఆఫ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ది సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేసీ యాక్ట్, 2002) చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం నోటీసులు జారీ చేయబడ్డాయి. వారి చివరి చిరునామాలు తెలిసినవి కానీ వారిలో కొద్దిమంది మాత్రమే తిరిగి ఇవ్వబడలేదు, కాబట్టి వారికి ఈ పబ్లిక్ నోటీసు ద్వారా తెలియజేయబడుతోంది.

రుణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారు	ఆస్తి వివరణ	బకాయి మొత్తం మరియు డిమాండ్ నోటీసు తేది
1 మెసర్స్. శ్రీ వైష్ణవి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రుణగ్రహీత) 2. శ్రీమతి. గాయత్రి సుబ్రహ్మనియా (మేనేజింగ్ డైరెక్టర్ అండ్ గ్యారంటర్) 3. శ్రీ. సంద్ర రవీంద్ర (డైరెక్టర్ అండ్ గ్యారంటర్) 4. శ్రీమతి. దండు లక్ష్మి దేవి, భర్త.శ్రీ.వీరయ్య (డైరెక్టర్, మోర్టగేజర్ అండ్ గ్యారంటర్)	ఖాళీ స్థలం యొక్క ఆ భాగం మరియు పార్సిల్ కొలత 4501 చదరపు గజాల డోర్. నెంలు. 609/1 మరియు 611/1 లలో ఉంది, ఎసిసి షీట్ గోడౌన్ కలిగి బేరింగ్ డోర్ నం.4-127, పాత మూల్యాంకనం నెం. 717,799, కొత్త మూల్యాంకనం నెం. 1021128608, గుంటూరు యొక్క మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నల్లపాడు గ్రామం, సరిహద్దు: ఉత్తరం: దుగ్గంపూడి వెంకటప్ప రెడ్డి మరియు లింగారెడ్డి మరియు ఇతరులకు చెందిన ఆస్తి. దక్షిణం: గుంటూరు నుండి సత్తెనపల్లికి వెళ్ళే రోడ్డు, తూర్పు: ఆరుదుల కోటప్పకు చెందిన ఆస్తి పడమర : చిదిరి లక్ష్మీ కళావతికి చెందిన ఆస్తి గుంటూరు యొక్క రిజిస్ట్రేషన్ మరియు నల్లపాడు యొక్క ఉప-జిల్లా రిజిస్ట్రేషన్ లోపల	రూ.16,01,86,692.29/- (పదహారు కోట్ల ఒక లక్ష ఎనభై ఆరు వేల ఆరు వందల తొంభై రెండు రూపాయల ఇరవై తొమ్మిది పైసలు మాత్రమే) 30.09.2025 నాటికి డిమాండ్ నోటీసు తేదీ: 06-11-2025

పైన పేర్కొన్న రుణగ్రహీత, హామీదారు(లు) మరియు తనఖాదారు(లు) ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 60 రోజులలోపు బకాయి మొత్తాన్ని చెల్లించాలని ఇందుమూలంగా కోరబడుతున్నారు, లేకుంటే 60 రోజుల గడువు ముగిసిన తర్వాత, సర్ఫేసీ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4) ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి. సెక్యూరిటీలను రీడీమ్ చేసుకోవడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, ఆ చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ 8లోని నిబంధనపై రుణగ్రహీతలు, హామీదారులు మరియు తనఖాదారులు దృష్టి సారించాలని కోరుతున్నాము.

తేది : 24.12.2025
ప్రదేశం : చెన్నై
సం/- అధీకృత అధికారి
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తరుపున.

motilal oswal **మోతీలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం : మోతిలాల్ ఓస్వాల్ టవర్, రహిమ్‌తుల్లా సయాని రోడ్, ఎస్‌టి డిపో ఎదురుగా, ప్రభాదేవి, ముంబై-400 025.
ఇమెయిల్ : hfquery@mothilaloswal.com సిఐఎన్ నంబరు: U65923MH2013PLC248741

డిమాండ్ నోటీసు

... LXMOVIJAYW5523-240709660 ... 11-12-2025 & Rs. 10,35,586/- ...

... ఈ పరిహారం ఎమ్ఓహెచ్ఎఫ్ఎల్ కి ఏ ఇతర చట్టం ప్రకారం అందుబాటులో ఉన్న అన్ని ఇతర నివారణలకు అదనంగా మరియు స్వతంత్రంగా ఉంటుంది. అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, సురక్షితమైన ఆస్తులను రీడీమ్ చేయడానికి మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి సంబంధించి, రుణగ్రహీతల దృష్టిని చట్టంలోని సెక్షన్ 13(8)కి ఆహ్వానించారు. దీని ద్వారా రుణగ్రహీత(లు) సురక్షిత ఆస్తి(లు)ని తొలగించడం లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సురక్షిత ఆస్తి(ల) ద్వారా బదిలీ చేయకుండా నిరోధించబడతారు/నిషేధించబడ్డారు. ఎమ్ఓహెచ్ఎఫ్ఎల్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ దిగువసంతకందారు వద్ద అందుబాటులో ఉంది మరియు రుణగ్రహీత(లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ పని వేళల్లో ఏదైనా పని దినాన దిగువసంతకందారు నుండి దానిని సేకరించవచ్చు.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ
తేది : 24.12.2025
సం/- అధీకృత అధికారి
మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

SBI **స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా**
యస్‌యమ్‌ఇ బ్రాంచి బిసెంట్ రోడ్ బ్రాంచి (బ్రాంచ్ కోడ్ : 63640), డోరు నెం.27-129-42 & 27-06-106, గ్రావిటీ టవర్స్, 2వ అంతస్థు, ప్రకాశం రోడ్, విజయవాడ-520002. ఫోన్: 0866-2572192, 2571893, Email: sbi.63640@sbi.co.in

ఋణగ్రహీత, హామీదారుకు సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2)కు లోబడి జారీచేయబడిన నోటీసు)

ఋణగ్రహీత మరియు హామీదారుల పేర్లు, చిరునామా	ఋణము, ఖాతా నెం.& చెల్లించవలసిన మొత్తము
ఋణగ్రహీత : మెస్సర్స్ ఆర్య ఎంటర్ ప్రైజెస్, చిరునామా : సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి : సజ్జా సురేష్, నివాసము : తండ్రి : సురేష్, ఫ్లాట్ నెం.4, షారోన్ అపార్ట్‌మెంట్స్, మెతోడిస్ట్ కాలనీ, బేగంపేట, హైదరాబాద్, తెలంగాణ-500016, **హామీదారులు : సజ్జా నితిన్ చక్రవర్తి,** చిరునామా : ఆర్య ఎంటర్ ప్రైజెస్, ప్లాట్ నెం.60, వార్డు నెం.8, కెపి నగర్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ, కృష్ణా జిల్లా,	టర్మ్ లోన్ అకౌంట్ నెం. 43404271576

డిమాండ్ నోటీసు తేది	04-12-2025	యన్‌పిఎ తేది	30-11-2025

బకాయి మొత్తం: ది.04-12-2025 నాటికి రూ.4,94,76,334/- (అక్షరాల నాలుగు కోట్ల తొంభైనాలుగు లక్షల డెబ్బైఆరు వేల మూడు వందల ముప్పైనాలుగు రూపాయలు మాత్రము) ప్లస్ ది.05-12-2025 నుండి తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులతో పాటు

షెడ్యూలు-సి

షెడ్యూలు నెం.1 : గుంటూరు జిల్లా, తెనాలి యస్ఆర్ఒ లో రిజిస్టర్డ్ కాబడిన దస్తావేజు నెం.3671/2023 ప్రకారం శ్రీ సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి : సజ్జా సురేష్‌కు చెందిన ఆస్తి : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, కంకిపాడు మండలం, సూర్యా నగర్ వెంచర్ దగ్గర, గొడవర్రు గ్రామము, డివిజన్ నెం.312/1, అడంగల్ ప్రకారం 312/1ఎ, సమీప డోరు నెం.1-83 నందు 5929.00 చ॥గ॥లు లేదా 4957.00 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** మల్లెల విజయలక్ష్మి మరియు ఇతరుల యొక్క ఆస్తి, **దక్షిణం:** కొనేరు శ్రీకృష్ణ మూర్తి యొక్క ఆస్తి, **పడమర:** యల మంచిలి వెంకట నారాయణ రావు యొక్క ఆస్తి మరియు లేఅవుట్ రోడ్‌కు వెళ్ళు నడకమార్గం, **ఉత్తరం:** కొనేరు దిలీప్ కుమార్ యొక్క ఆస్తి.

పైన పేర్కొన్న ఋణగ్రహీతలు **స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్‌యమ్‌ఇ బిసెంట్ రోడ్ బ్రాంచ్ (63640), విజయవాడ, కృష్ణా జిల్లా** నుండి లోన్స్ / అడ్వాన్స్‌ల రూపంలో ఋణసౌకర్యములను పొందియున్నారు. మీరు పొందిన ఋణము తిరిగి చెల్లించనందున **యన్‌పిఎగా** వర్గీకరింపబడి పైన పేర్కొనబడిన సొమ్ము బకాయిగా వున్నది. మేము ఇప్పటికే **04-12-2025** తేదీ గల డిమాండ్ నోటీసు సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద తిరుగు రశీదుతో రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించగా అట్టి నోటీసు తిరిగి వచ్చినందున/ ఋణగ్రహీత సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరలా నోటీసు జారీచేయడమైనది. సెక్షన్ 13(4) చట్టం క్రింద 60 రోజులలోపు పైన చెప్పిన మొత్తాన్ని చెల్లించని పక్షంలో బ్యాంకుకు తనఖావుంచిన సెక్యూరిటీ ఆస్తులను స్వాధీనం చేసుకొనగలమని మా అభిప్రాయాన్ని తెలియచేయడమైనది. **మీకు ఇస్తున్న సూచనలు** : 1) అసలు నోటీసు కాపీ/నోటీసుకు సంబంధించిన సమగ్ర వివరములను, అధీకృత అధికారి నుండి పొందవచ్చునని సూచించబడినది. 2) SARFAESI యాక్ట్ క్రింద తదుపరి చర్యలకు పాల్పడకుండా వుండేందుకు **నోటీసు తేదీ** నుండి 60 రోజులలోపు వడ్డీ, ఖర్చులతో సహా మొత్తం బకాయి చెల్లించవలసి వుంటుంది.

ప్రదేశం : విజయవాడ, తేది : 04-12-2025   సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్‌యమ్‌ఇ బిసెంట్ రోడ్ బ్రాంచ్, విజయవాడ.

అఖ్లక్ కుటుంబ సభ్యులతో కలిసి కోర్టు వద్ద మాట్లాడుతున్న బృందాకరత్

బిజెపి మతోన్మాద రాజకీయాలకు చెంపపెట్టు

- అఖ్లక్ కేసులో కోర్టు తీర్పును స్వాగతించిన సిపిఎం

న్యూఢిల్లీ : అఖ్లక్ మూక దాడి కేసులో నిందితుడికి రక్షణ కల్పించాలని కోరుతూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా కోర్టు తిరస్కరించడం న్యాయానికి ఒక విజయమని, మతోన్మాద శక్తుల ఓటమి అని సిపిఎం ఢిల్లీ కమిటీ వ్యాఖ్యానించింది. ఈ తీర్పును స్వాగతించింది. కీలకమైన ఈ విచారణ సందర్భంగా సిపిఎం సీనియర్ నేత బృందాకరత్ కోర్టులోనే వున్నారు. రాజ్యాంగ విలువలు, చట్టబద్ధ పాలనకు పెద్ద పీట వేసిన ఈ తీర్పు, మూక దాడి వంటి హేయమైన నేరాలకు పాల్పడిన దోషులను రక్షించాలన్న బిజెపి ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా గట్టి సందేశం పంపిందని బృందా కరత్ వ్యాఖ్యానించారు. అఖ్లక్‌ను దారుణంగా హత్య చేయడమనేది యాధృచ్ఛికంగా జరిగిన సంఘటన కాదన్నారు. ఇదే రీతిలో అనేక దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలో వున్న వారి నుండి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పొందిన బిజెపి విద్వేష, మతోన్మాద రాజకీయాల ఫలితమే అఖ్లక్ హత్యగా అని ఆమె పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పదే పదే జోక్యం చేసుకోవడం ద్వారా న్యాయ ప్రక్రియను బలహీనపరచడానికి ప్రయత్నించిందని విమర్శించారు. కానీ, కోర్టు ఇచ్చిన తీర్పు ఇటువంటి అన్ని ప్రయత్నాలను నిర్ణయాత్మకంగా ఓడించిందని బృందా కరత్ తెలిపారు. దేశంలో న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యాన్ని, చట్టబద్ధ పాలనను పరిరక్షించే దిశగా ఈ తీర్పు ముఖ్యమైన చర్య అని పేర్కొన్నారు. మూక దాడులకు, మతోన్మాద హింసాకాండకు వ్యతిరేకంగా పోరాడే అన్ని శక్తులకు ఈ తీర్పు ఒక ఆశాకిరణంగా పనిచేస్తుందని అన్నారు.

రాజ్యాంగ సంస్థలతో ప్రత్యర్థులపై బిజెపి దాడి

- బెర్లిన్‌లో రాహుల్

బెర్లిన్ : దేశంలోని వివిధ రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై దాడి చేసేందుకు బిజెపి ఉపయోగించుకుంటోందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని, కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)ని బిజెపి వాడుకుంటోందన్నారు. కానీ బిజెపి, దాని నేతృత్వంలోని ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీల జోలికి వెళ్లడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్మనీలో ఐదు రోజుల పర్యటనలో ఉన్న రాహుల్ బెర్లిన్‌లోని హెర్టీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. భారత రాజ్యాంగ సంస్థలన్నింటినీ గంపగుత్తగా స్వాధీనం చేసుకున్నారని, ఇది రాజ్యాంగ వ్యవస్థపై పూర్తి స్థాయిలో జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు. ఇడి, సిబిఐ వంటి సంస్థలు బిజెపిపై ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని, ఆ పార్టీని వ్యతిరేకించే వారి పైనే ఎక్కువగా కేసులు పెడుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్‌కు ఎవరైనా వ్యాపారవేత్తలు మద్దతిస్తే వారినీ బెదిరిస్తున్నారని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని, దానిని అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నదని రాహుల్ అభిప్రాయపడ్డారు. రాహుల్ తన ప్రసంగంలో ఓట్ల చోరీని మరోసారి ప్రస్తావించారు. గత సంవత్సరం హర్యానా శాసనసభకు జరిగిన ఎన్నికలను బిజెపికి అనుకూలంగా రిగ్గింగ్ చేశారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోనూ ఎన్నికలు నిస్పాక్షికంగా జరిగాయని తాము భావించడం లేదని చెప్పారు.

నిరంకుశ దాడులపై ఐక్య పోరాటం

- ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె
- కేంద్ర కార్మిక సంఘాల పిలుపు
- ప్రజా, కార్మిక హక్కులను మోడీ సర్కార్ కాలరాస్తోందని ఆగ్రహం



న్యూఢిల్లీ : దేశ ప్రజలపై, శ్రమజీవులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సాగిస్తున్న నిరంకుశ దాడులపై ఐక్యంగా పోరాటాలు సాగించాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన నిరంకుశ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, ప్రజల హక్కులు, అర్హతలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బహు ముఖ దాడిని వ్యతిరేకిస్తూ సార్వత్రిక సమ్మె నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు (సిటియు), రంగాల వారీ సమాఖ్యలు, అసోసియేషన్ల సంయుక్త వేదిక పిలుపునిచ్చింది. ఈ నెల 22న కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యల సంయుక్త వేదిక హైబ్రీడ్ మోడ్‌లో సమావేశమైంది. ఫిబ్రవరి12వ తేదీన ఒక రోజు సమ్మె నిర్వహించడం ద్వారా మోడీ ప్రభుత్వానికి బలమైన సందేశాన్ని పంపాలని నిర్ణయించింది. సమ్మె చేసే తేదీని లాంఛనంగా నిర్ణయించారు. సవివరమైన కార్యాచరణ ప్రణాళికను జనవరి 9వ తేదీన ఢిల్లీలో జరిగే జాతీయ కార్మిక సదస్సులో రూపొందిస్తారు. సార్వత్రిక సమ్మెకు సమాయత్తం కావాలని, విస్తృతంగా ప్రచారాన్ని ప్రారంభించాలని, ఉధృతమైన పోరాటానికి తమ సంఘాలను సన్నద్ధం చేయాలని యావత్ కార్మిక లోకానికి, ఇతర ప్రజా సంఘాలకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. పార్లమెంట్‌లోని ప్రతిపక్ష పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ముఖ్యంగా యువత, విద్యార్థులు మద్దతుగా ముందుకు వచ్చి, ఈ సమ్మెకు సంఘీభావం ప్రకటించి, కార్మికుల ప్రాథమిక హక్కులను కాపాడాలని, దేశ ప్రజాస్వామ్య కూర్పును పరిరక్షించాలని కేంద్ర కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఇటీవల కాలంలో పార్లమెంట్ లోపల, వెలుపల మోడీ ప్రభుత్వం పాల్పడుతున్న దారుణమైన దాడుల పట్ల సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సమావేశం అనంతరం సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, ఎఐయుటియుసి, టియుసిసి, హెచ్ఎంఎస్, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసిలు ఒక ప్రకటన విడుదల చేశాయి. కేంద్రం వివిధ రూపాల్లో సాగిస్తున్న దాడులను, నిరంకుశ విధానాలను ఆ ప్రకటనలో వివరించారు.

♦ లాభాలనార్జించే ఉద్దేశ్యంతో అత్యంత ప్రమాదకరమైన, ముప్పులతో కూడిన అణు విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి ప్రైవేటు, విదేశీ పెట్టుబడిదారులను ఎస్‌హెచ్ఎఎన్‌టిఐ (సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) చట్టం అనుమతిస్తున్నది. ఒకవేళ ప్రమాదాలు, విపత్తులు సంభవించిన పక్షంలో పరికరాలను సరఫరా చేసిన విదేశీ, జాతీయ సరఫరాదారుల బాధ్యతను ఈ చట్టం తొలగిస్తోంది. మనదేశ అణు భద్రత, సార్వభౌమాధికారంపై కచ్చితంగా ఇది దాడి అని ఆ సమావేశం పేర్కొంది.

♦ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానే వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టం, 2025 తీసుకువచ్చారు. ప్రజలు తీవ్రమైన నిరుద్యోగ సమస్యతో బాధపడుతున్న సమయంలో హక్కుల ప్రాతిపదికన గల గ్రామీణ ఉపాధి హామీ స్థానంలో ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చారు. పైగా కేంద్ర ప్రభుత్వం తన విచక్షణాధికారంతో ఈ పథకం అమలుకయ్యే ఆర్థిక భారాన్ని రాష్ట్రాల పైకి బదలాయించింది. పంట దిగుబడి సమయంలో ఈ చట్టం అమలును నిషేధించారు. దీనివల్ల భూస్వాములకు చవకగానే కూలీలు దొరికేందుకు వెసులుబాటు కల్పించారు.

♦ బీమా రంగంలోకి వంద శాతమూ ఎఫ్‌డిఐని అనుమతించారు. ఆచరణలో విదేశీ పెట్టుబడిదారులు దేశీయ బీమా కంపెనీలను స్వాధీనం చేసుకోవడానికి హక్కు కల్పించారు.

♦ పార్లమెంట్ ఉభయ సభల్లో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్, 2025ను ప్రవేశపెట్టింది. కానీ ఈ సమావేశంలో దాన్ని ఆమోదించలేకపోయారు.

♦ విత్తన ముసాయిదా బిల్లును, విద్యుత్ (సవరణ) ముసాయిదా బిల్లు, 2025ను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఒకవేళ ఈ బిల్లులను ప్రవేశపెట్టి, ఆమోదిస్తే, వ్యవసాయం, దేశీయ, చిన్న, మధ్యతరహా విద్యుత్ వినియోగదారులపై అలాగే మన ప్రభుత్వ విద్యుత్ రంగంపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతుంది.

♦ ఉత్తర భారతంలో ప్రస్తుతమున్న పర్యావరణ సంక్షోభాన్ని, అలాగే ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో భరించరాని రీతిలో నెలకొన్న కాలుష్యాన్ని, దాదాపు 90శాతం మేరా ఆరావళి పర్వతాలను విధ్వంసం చేయడానికి అనుమతిస్తూ ఇటీవల వచ్చిన సుప్రీం ఉత్తర్వులను కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నాయి. థార్ ఎడారి విస్తరించకుండా ఉత్తర భారతానికి ఈ ఆరావళి పర్వతాలు రక్షణ గోడగా నిలిచాయి.

♦ ఈ నిరంకుశమైన దాడులకు వ్యతిరేకంగా పోరాడే ప్రజలకు, ఉద్యమాలకు సిటియు సంఘీభావాన్ని ప్రకటించింది.

♦ సార్వత్రిక సమ్మెకు బేషరతుగా మద్దతునిచ్చినందుకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)కు సిటియు అభినందించింది.

ఇదే రోజు పూర్తి స్థాయిలో రంగాలవారీగా జాతీయ స్థాయిలో సమ్మె నిర్వహించనున్నట్లు విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సిసిఓఇఇ) కూడా ప్రకటించింది. ఎస్‌హెచ్ఎఎన్‌టిఐ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 23న దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని ఎన్‌సిసిఓఇఇ, జెపిసిటియు, ఎస్‌కెఎం సంయుక్త సమావేశం నిర్ణయించింది. అలాగే జనవరి, ఫిబ్రవరి మాసాల్లో విద్యుత్ ఉద్యోగులు, వినిమయదారుల సంయుక్త సమావేశాలు, సదస్సులు నిర్వహించనున్నారు.

విత్తన బిల్లు 2025, విద్యుత్ (సవరణ) బిల్లు, 2025, విబి-జి ఆర్ఎఎం జి చట్టం, 2025లకు వ్యతిరేకంగా, ఇతర డిమాండ్లకు మద్దతుగా గ్రామాలు, బ్లాక్‌ల స్థాయిలో జనవరి 16న ప్రతిఘటనా దినోత్సవం నిర్వహించాలని ఎస్‌కెఎం నిర్ణయించింది. ఈ కార్యాచరణలో సిటియులు కూడా పూర్తి స్థాయిలో పాల్గొంటాయి.

లేబర్ కోడ్‌లను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ కోడ్‌ల పట్ల సానుకూల ఏకాభిప్రాయాన్ని నిర్మించేందుకు తన అధీనంలోని అన్ని వ్యవస్థాగత యంత్రాంగాలను, మీడియా, ప్రభుత్వ రంగ సంస్థల యాజమాన్యాలను వినియోగించుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కానీ, ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న ఈ చర్యకు వ్యతిరేకంగా పోరు బాట పట్టాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేసేలా చూడాలని కార్మిక లోకం కృత నిశ్చయంతో వుంది.

విబిజి ఆర్ఎఎంజిపై 26న ప్రత్యేక గ్రామసభలు

- కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు
- గ్రామసభల్లో తీవ్రంగా వ్యతిరేకించాలని వ్యకాస పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్‌జిఎ) స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత భారత్ జాతీయ గ్రామీణ ఉపాధి, జీవనోపాధుల పథకం (విబిజి ఆర్ఎఎంజి)పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్ కుమార్ సింగ్, కేంద్ర పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ సంయుక్త లేఖ రాశాయి. ఈ నెల 26న ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి విబిజి ఆర్ఎఎంజికి మద్దతు కూడగట్టాలని అందులో పేర్కొంది. బిజెపి, ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షాల మద్దతుదారులను గ్రామసభలకు తరలించి విబిజి పథకానికి ప్రజామద్దతు ఉందని ప్రచారం చేసుకునే పన్నాగంలోనే కేంద్రం ఈ ఎత్తుగడ వేసినట్లు కనిపిస్తోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) విమర్శించింది. ఈ మేరకు ఎఐఎడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎ విజయరాఘవన్, బి వెంకట్ ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టబద్ధంగా లభిస్తున్న ఉపాధి ఉసురు తీసి..దానిని ఒక పథకం కింద మార్చేసిన విబిజి చట్టాన్ని ఇదే గ్రామసభల్లో తీవ్రంగా వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు.

చట్టబద్ధ హక్కుపై దాడి

ఎంజిఎన్ఆర్ఇజిఎ కింద గ్రామీణ పేదలకు ఉపాధి చట్టబద్ధమైన హక్కుగా లభిస్తోందని వారు పేర్కొన్నారు. పని అడిగిన వారికి ఉపాధి కల్పించా ల్సిన బాధ్యత ప్రభుత్వానిది. చట్టబద్ధమైన ఉపాధి హక్కును కాలరాసేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎంజిఎన్ఆర్ఇజిఎ రద్దు చేసి, దాని స్థానంలో విబిజి ఆర్ఎఎంజి చట్టాన్ని తీసుకొచ్చింద న్నారు. ఇది కేవలం పేరు మార్పు మాత్రమే కాదని, పని తప్పనిసరిగా కల్పించాల్సిన 'డిమాండ్ ఆధారిత' సూత్రాన్ని తుడిచివేయడమేనన్నారు. ఉపాధి అనేది ఇప్పుడు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా మార్చేశారని విమర్శిం చారు. కొత్త చట్టంతో ఉపాధి కల్పన బాధ్యతను, ఆర్థిక భారాన్ని కేంద్రం కుట్రపూరి తంగా రాష్ట్ర ప్రభుత్వాలపైకి నెట్టివేస్తోందని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా బయోమెట్రిక్ హాజరు, ఆధార్ ఆధారిత చెల్లింపుల (ఎబిపిఎస్) పేరుతో లక్షలాది మంది పేద కార్మికుల జాబ్ కార్డులను అన్యాయంగా రద్దు చేశారని, ఇప్పుడు ఏకంగా చట్టాన్నే రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్ల కేంద్రం ఆదేశానుసారం ఈ నెల 26న నిర్వహించే ప్రత్యేక గ్రామసభల్లో వ్యకాస కార్యకర్తలు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విబిజి ఆర్ఎఎంజిని తీవ్రంగా వ్యతిరేకించాల ని పిలుపుని చ్చారు. గ్రామ సర్పంచులు, పంచాయతీ అధ్యక్షులను కలిసి కొత్త చట్టాన్ని వ్యతిరేకించాలన్నారు. పాత ఎంజిఎన్ఆర్ ఇజిఎను యథాతథంగా కొనసాగించాలని కోరుతూ వినతిప త్రాలు ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఈ మేరకు తీర్మానాలు చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ భారత ప్రజల జీవనాధారమైన రాజ్యాంగబద్ధమైన ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు రైతులు, యువత, విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఛత్తీస్‌గఢ్ మాజీ సిఎం భూపేశ్ తనయుడు

చైతన్య బాగల్‌కు రూ.250 కోట్ల ముడుపులు

- ఛార్జిషీట్‌లో ఎసిబి వెల్లడి

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గడ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బాగల్ కుమారుడు చైతన్య బాగల్‌కు మద్యం సిండికేట్ల నుంచి రూ. 250 కోట్ల మేర ముడుపులు అందాయని ఆ రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం (ఎసిబి) పేర్కొంది. ఈ ఏమరకు సంబంధిత కోర్టులో 8వ అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. అందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. భూపేశ్ బాగల్ ముఖ్యమంత్రిగా ఉన్న 2019-22 మధ్య ఈ కుంభకోణం జరిగిందన్నారు. మద్యం అక్రమ అమ్మకాల కారణంగా రాష్ట్ర ఖజానాకు రూ.3,074 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు.

పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలపై బ్రిటన్ ఉక్కుపాదం

- లండన్‌లో పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్ అరెస్టు

పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్‌ను అదుపులోకి తీసుకుంటున్న లండన్ పోలీసులు

లండన్ : ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ పాలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తూ చేపడుతున్న నిరసనలపై బ్రిటన్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. తీవ్రస్థాయిలో అణిచివేత కార్యక్రమాలకు పాల్పడుతోంది. ఇదే క్రమంలో సెంట్రల్ లండన్‌లో పాలస్తీనా అనుకూల నిరసనల్లో పాల్గొన్న ప్రఖ్యాత పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్, మరో ఇద్దరిని బ్రిటీష్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు కేంపైన్ గ్రూపు డిఫెండ్ అవర్ జ్యూరీస్ ఒక ప్రకటన చేసింది. కాగా, నిరసనలు ప్రారంభమైన తర్వాతనే థన్‌బెర్గ్ అక్కడకు వచ్చారని ఆ గ్రూపు తెలిపింది. "పాలస్తీనా యాక్షన్ ప్రిజనర్స్‌కు మద్దతిస్తున్నా, ఊచకోతను ఖండిస్తున్నా" అని రాసివున్న ప్లకార్డును ఆమె ప్రదర్శించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఫుటేజీని ఆ గ్రూపు షేర్ చేసింది. ఉగ్రవాద చట్టం-2000లోని సెక్షన్13కి విరుద్ధంగా నిషేధిత సంస్థ 'పాలస్తీనా యాక్షన్'కు మద్దతుగా ప్లకార్డును ప్రదర్శించినందుకు 22ఏళ్ళ యువతిని అరెస్టు చేసినట్లు లండన్ సిటీ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రూపునకు చెందిన ఆరుగురు ప్రస్తుతం బ్రిటన్ జైళ్ళలో నిరాహార దీక్షలో వున్నారు. వారిలో ఇద్దరిని ఆస్పత్రిలో చేర్చారు. వారికి సంఘీభావంగా తాజాగా ఈ నిరసనలు చేపట్టారు. నిరాహార దీక్షలకు దిగిన వారి లీగల్ ప్రతినిధులతో లేదా వారి కుటుంబాలతో మాట్లాడేందుకు డిప్యూటీ ప్రధాని, న్యాయ శాఖ మంత్రి డేవిడ్ లామీ తిరస్కరించారని డిఫెండ్ అవర్ జ్యూరీస్ తన ప్రకటనలో పేర్కొంది.

టెక్సాస్‌లో విమాన ప్రమాదం

- ఐదుగురు మృతి

టెక్సాస్ : మెక్సికన్ నేవీకి చెందిన విమానం సోమవారం టెక్సాస్ గాల్వెస్టన్‌లో సముద్రతీరంలో కూలిపోయింది.. ఈ ఘటనలో రెండేళ్ల చిన్నారితో సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. విమానంలో ఎనిమిది మంది ప్రయాణికులు ఉండగా , వారిలో నలుగురు నేవీ అధికారులున్నారని మెక్సికన్ నేవీ ప్రకటించింది. మిచా, మౌ ఫౌడషన్ అనే సంస్థ మెక్సికోలో చిన్నారులకు సేవలందిస్తుంది. ఈ సంస్థ చిన్న పిల్లలకు ఉచితంగా ఔషధాలను అందించి, వైద్య సేవలందిస్తుంది. దీని ఆధ్వర్యంలో ఓ చిన్నారికి చికిత్స అందించే నిమిత్తం కింగ్ ఎయిర్ - 1209 విమానం మెక్సికోలోని మెరిడా నుండి గాల్వెస్టన్‌లో ని ష్రైనర్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు బయలుదేరింది. ఈ విమానం గాల్వెస్టన్ ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి చేరుకునే లోపే సముద్రంలో కూలిపోయింది. అయితే ఈ ఘటనకు కారణం తెలుసుకోవడానికి దర్యాప్తు జరుగుతోందని ఫెడరల్ విమానయాన సంస్థ తెలిపింది. గాల్వెస్టన్ కౌంటీ శెరీఫ్ కార్యాలయం, దీవులు రక్షణ సిబ్బంది (డైవ్ టీమ్), డ్రోన్ యూనిట్ , పెట్రోల్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాయని నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు అధికారులు తెలిపారు.

31లోగా వెళ్లిపోతే 3 వేల డాలర్లు

- వలసదారులకు అమెరికా ఆఫర్

వాషింగ్టన్ : ఎలాంటి పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తూ తిరిగి స్వచ్ఛందంగా స్వదేశానికి వెళ్లిపోయేందుకు సంసిద్ధత వ్యక్తం చేసే అక్రమ వలసదారులకు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ భారీ ఆఫర్ ప్రకటించింది. ఈ నెల 31వ తేదీ లోగా సిబిపి వన్ యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్న వారికి మూడు వేల డాలర్ల ప్రోత్సాహకాన్ని అందజేస్తామని, స్వదేశానికి చేరుకునేందుకు ఉచిత విమాన టిక్కెట్ ఇస్తామని ప్రకటించింది.

అంతేకాక అనుమతించిన సమయం కంటే ఎక్కువ రోజులు అమెరికాలో నివసించినందుకు విధించిన జరిమానాలు, ఫైన్లను రద్దు చేస్తామని కూడా తెలిపింది. స్వచ్ఛందంగా దేశం విడిచి వెళుతున్న అక్రమ వలసదారులకు ఇప్పటి వరకూ వెయ్యి డాలర్ల నగదు ప్రోత్సాహకం మాత్రమే ఇచ్చారు. తాజా ప్రకటనలో అది మూడు రెట్లు పెరిగింది. ఎలాంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా దేశంలో నివసిస్తున్న వారు ఎలాంటి బలవంతం లేకుండా స్వచ్ఛందంగా స్వదేశానికి వెళ్లాలని భావిస్తే ఆ ప్రక్రియ వేగవంతంగా, ఉచితంగా, తేలికగా జరుగుతుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. అక్రమ వలసదారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమ సమాచారాన్ని అందజేస్తే సరిపోతుందని, వారికి నగదు ప్రోత్సాహకాన్ని, విమాన టిక్కెట్‌ను అందజేస్తామని చెప్పింది. ఈ ఆఫర్ హాలిడే సీజన్‌కే పరిమితమని తెలియజేసింది. స్వచ్ఛందంగా దేశాన్ని వదలి వెళ్లేందుకు ఇష్టపడక అక్రమంగా తిష్టవేసుకొని కూర్చునే వారిని అరెస్ట్ చేస్తామని, బలవంతంగా స్వదేశానికి తిప్పి పంపుతామని, తిరిగి అమెరికాలో ప్రవేశించకుండా శాశ్వతంగా నిషేధిస్తామని హెచ్చరించింది.

రుణాల రికవరీ ట్రిబ్యునల్ - III

6వ అంతస్తు, అదనపు కార్యాలయ భవనం, శాస్త్రి భవనం, హడోస్ రోడ్, నంగంబాకం, చెన్నై - 600 006

TRC No. 1094/2023 | **ఇ-వేలం విక్రయం** | Dated: 17.12.2025

OA No. 35/2018లో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా SAM బ్రాంచ్‌కు మెస్సర్స్ సిద్ధికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ & 3 ఇతరుల నుండి 30.09.2025 నాటికి చెల్లించవలసిన మొత్తం రూ. 18,78,08,153.46 (రూపాయలు పద్దెనిమిది కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల ఎనిమిది వేల నూట యాభై మూడు మరియు నలభై ఆరు పైసలు)ను రాబట్టుకొనుటకు వెబ్‌సైట్ https://www.bankeauctions.comద్వారా క్రింద పేర్కొనబడిన ఆస్తి ఆన్‌లైన్ ఇ-వేలం ద్వారా విక్రయించబడును.

ఆస్తి వివరణ

1) సర్వే నం. 443, విస్తీర్ణం హెక్టార్లు 6.34.0 (6 హెక్టార్లు మరియు 34 ఆర్‌లు), 2) సర్వే నం. 444, విస్తీర్ణం హెక్టార్లు 1.57.0 (1 హెక్టార్లు మరియు 57 ఆర్‌లు), 3) సర్వే నం. 445 విస్తీర్ణం హెక్టార్లు 18.54.0 (18 హెక్టార్లు మరియు 54 ఆర్‌లు), 4) సర్వే నం. 446 విస్తీర్ణం హెక్టార్లు 20.99.5 (20 హెక్టార్లు మరియు 99 ఆర్‌లు మరియు 5 సెంట్లు). **మొత్తం విస్తీర్ణం హెక్టార్లు 47.44.5 (47 హెక్టార్లు 44 ఆర్‌లు మరియు 5 సెంట్లు** కలిగి ఉన్న మెట్ట భూమి యొక్క మొత్తం ప్రాంతము. **నం. 136, వెట్టవాలం గ్రామం, తిరువన్నమలై తాలుకా, తిరువన్నమలై జిల్లా, 'పాలయపట్టు సరగమ'గా ప్రాచుర్యం పొందినది, ముళ్ల పొదలు చెట్లు మరియు రాళ్లు రప్పలతో సహా** ఉన్నది మరియు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా వెట్టవలం, రిజిస్ట్రేషన్ జిల్లా తిరువన్నమలైలో ఉన్నది.

కనీస ధర ₹ 20,00,00,000/- (ఇరవై కోట్ల రూపాయలు మాత్రమే).

బిడ్ ఇంక్రిమెంట్: కనీసం రూ. 10,00,000/- లేదా రూ. 10,00,000 యొక్క గుణకాలు.

ఇ-వేలం తేదీ & సమయం: **30.01.2026** ఉ॥ 11.00 గం॥లు మరియు మ॥ 12.00 గం॥లు మధ్య | విక్రయం ముగిసే వరకు ప్రతి ఒక్కరికి 3 నిమిషాల వ్యవధి పొడిగింపుతో

ధరావతు డిపాజిట్ : కనీస ధరలో 10%.

ఇఎండి చెల్లింపు & ఇఎండితో బిడ్ ఫారం సమర్పణకు చివరి తేదీ: 28.01.2026న లేదా ఆ లోపు "రికవరీ ఆఫీసర్, డిఆర్‌టి-3, చెన్నై' పేరిట ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, కేథడ్రల్ బ్రాంచ్, చెన్నై-2, ఐఎఫ్ఎస్‌సి కోడ్: IOBA0000109తో ఉన్న ఎ/సి నం. 163302000000250కు జమ అయ్యే విధంగా FT/NEFT/RTGS ద్వారా.

ఆస్తి తనిఖీ: 19.01.2026 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 3.00 గం॥ల వరకు

ఎట్టి పరిస్థితులలోనూ భౌతిక రూపంలో ఉన్న బిడ్లను ట్రిబ్యునల్ ద్వారా ఆమోదించడం జరుగదు మరియు ఎటువంటి విచారణలు అనుమతించబడవు.

పై వేలం గురించి ఇతర వివరాలు, ఇ-వేలం బిడ్ ఫారమ్ డిక్లరేషన్ మరియు పూర్తి నిబంధనలు మరియు షరతులు వెబ్‌సైట్ https://www.bankeauctions.comలో లభిస్తాయి.

సర్వీస్ ప్రొవైడర్ సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ ఎం. ప్రకభాకరనర్, మొబైల్: 7418281709.

ఏవైనా ఇతర వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్ఎఎం బ్రాంచ్, నం.32, మోంటీత్ రోడ్, ఎగ్మోర్, చెన్నై- 600008 (సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ ఆర్. రాజన్, డిప్యూటీ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఇండియా, (సెల్ నం. 90944 52976), ఇ-మెయిల్ clo2samb.che@sbi.co.in.

సం/- (ఇ.శశికుమార్)
రికవరీ ఆఫీసర్.

ఎక్స్‌కు 91 నోటీసులు ఇచ్చాం

- ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం మార్చిలో సహయోగ్ పోర్టల్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' కార్పొరేషన్‌కు 91 కంటెంట్ తొలగింపు నోటీసులు జారీ చేసింది. 1,100 యూఆర్ఎల్స్‌కు (వెబ్ చిరునామాలు. ఇవి ఇంటర్నెట్‌లో వెబ్ పేజీ లేదా ఫైల్ ఎక్కడ ఉందో తెలుపుతాయి) హెచ్చరికలు చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయన్న కారణంతో 566 యూఆర్ఎల్స్‌కు, రాజకీయ నేతలు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకుంటున్నాయన్న ఆరోపణలతో 124 యూఆర్ఎల్స్‌కు హెచ్చరికలు జారీ అయ్యాయి. 2024 మార్చి 20 నుంచి ఈ ఏడాది నవంబర్ 7వ తేదీ వరకూ జారీ చేసిన నోటీసుల వివరాలను కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టు ముందు ఉంచింది. కంటెంట్ తొలగింపునకు సంబంధించి గత సంవత్సరం సోషల్ మీడియా వేదిక ఎక్స్‌కు 58 నోటీసులు ఇచ్చారు. మొత్తంమీద ఇరవై నెలల కాలంలో ఇచ్చిన 91 నోటీసులలో 14 మాత్రమే క్రిమినల్ కార్యకలాపాలకు సంబంధించినవి. గత సంవత్సరం మే 14న జారీ చేసిన ఒకే ఒక నోటీసు అత్యధికంగా 115 యూఆర్ఎల్స్‌ను లక్ష్యంగా ఎంచుకుంది. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ఉద్దేశంతో తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేసేందుకు వీడియో వక్రీకరణ జరిగిందని అందులో ఆరోపించారు.

ట్రంప్ బెదిరింపులు

- వెనిజులా అధ్యక్షుడు రాజీనామా చేయాలంటూ వ్యాఖ్యలు



మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్

వాషింగ్టన్ : వెనిజులా అధ్యక్షుడు మదురోను ట్రంప్ బెదిరించారు. మార్ ఎ లాగోలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. వెనిజులాపై ఒత్తిడి పెంచుతామని, మదురో రాజీనామా చేయడం తెలివైన పని అంటూ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఆయన చేయాలనుకున్న పని కచ్చితంగా చేస్తారని, కఠినంగా అమెరికాతో ఆడాలనుకుంటే అదే చివరి ఆట అవుతుందంటూ తీవ్రంగా స్పందించారు. యుఎస్ రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో సమక్షంలో ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కరేబియన్ తీరంలో అమెరికా చర్యలను విమర్శించిన కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోను కూడా ట్రంప్ బెదిరించారు. 'కొలంబియాలో మాదకద్రవ్యాల కర్మాగారాలున్నాయి. అక్కడ కొకైన్ తయారుచేస్తున్నారు. ఆయన అమెరికాకు శత్రువు. ఆయన జాగ్రత్తగా ఉండాలి' అని ట్రంప్ హెచ్చరించారు. అయితే వెనిజులా చమురు నౌకల ఆక్రమణను అమెరికా కొనసాగిస్తుంది. పైగా స్వాధీనం చేసుకున్న నౌకలను ఏం చేస్తారంటూ విలేకరులు ప్రశ్నించగా, అమ్ముతాం లేదా ఉపయోగించుకుంటాం అని ట్రంప్ సమాధానమిచ్చారు. ట్రంప్ ప్రకటనను వెనిజులా ఖండించింది. వెనిజులాను అమెరికా లక్ష్యంగా చేసుకోవడా నికి అసలు కారణం చమురు నిక్షేపాలే అని ఈ వ్యాఖ్యలతో స్పష్టమైందని వెనిజులా తెలిపింది. ఈ నెల 10వ తేదీ నుండి ఇప్పటి వరకూ 3 చమురు నౌకలను అమెరికా అక్రమంగా స్వాధీనం చేసుకుందని తద్వారా వెనిజులాను ఆర్థికంగా దెబ్బతీయాలనే కుట్ర చేస్తుందని తెలిపింది.

యుద్ధ ఓడలను ఆవిష్కరించిన ట్రంప్

ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో ఫ్లోరిడాలో డొనాల్డ్ ట్రంప్ అత్యాధునికమైన యుద్ధ నౌకలను ప్రారంభించారు. వీటికి 'ట్రంప్-క్లాస్' యుద్ధ నౌకలు అని నామకర ణం చేశారు.

ఇవి 'అత్యంత వేగవంతమైనవి, అతిపెద్దవి, ప్రపంచంలో ఉన్న యుద్ధ నౌకల కంటే 100 రెట్లు ఎక్కువ శక్తిశాలీ' అని ట్రంప్ ప్రకటించారు. ఈ నౌకలు యుఎస్ సముద్ర శక్తిని పెంచుతాయని తెలిపారు. యుఎస్ నేవీ సెక్రటరీ జాన్ ఫెలన్ ఈ యుద్ధ నౌకల్లో అతిపెద్ద తుపాకులు కలిగి ఉంటాయని, సముద్ర ప్రయోగాలకు ఉపయోగపడుతుందని అన్నారు. అంతేకా కుండా అనేక యుద్ధ సామగ్రిని రవాణా చేయగలవని, హైపర్ సోనిక్ క్షిపణులు, రైల్‌గన్‌లు, అధిక శక్తి లేజర్ గన్‌లుంటాయ ని ప్రకటించారు.

ఆసియా వామపక్ష పార్టీల ఖండన

ఆసియా దేశాల్లోని వామపక్ష, కమ్యూనిస్టు పార్టీలు వెనిజులా ప్రజలకు సంఘీభావం ప్రకటించాయి. ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. అమెరికా చేస్తున్న బెదిరింపులను ఖండించాయి. కరేబియన్‌లో భారీగా సైన్యాన్ని మోహరించడం పట్ల ఆందోళనను వ్యక్తం చేశాయి . అమెరికా దౌర్జన్యం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశాయి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పినా.. ఇది వాస్తవానికి వెనిజులాపై యుద్ధానికి సిద్ధమయ్యే చర్యగా వామపక్ష పార్టీలు అభివర్ణించాయి. మదురో రాజీనామా చేయాలని ట్రంప్ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించాయి. వెనిజులాలో ప్రభుత్వ మార్పు చేయడమే అమెరికా లక్ష్యమని ఆరోపించాయి.

ఈ ప్రకటనపై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్-లెనినిస్ట్) లిబరేషన్, సోషలిస్ట్ పార్టీ ఆఫ్ మలేషియా, పార్టీ ఆఫ్ ది లేబరింగ్ మాసెస్ ఆఫ్ ఫిలిప్పీన్స్ (పీఎల్ఎం), ఇండోనేషియాకు చెందిన పార్టై పెంబెబాసన్ రాక్యాత్ వంటి పార్టీలు సంతకాలు చేశాయి.

సమరశీల పోరాటాలు సర్కారు అమానుష దాడులు

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1970 వరకు సంభవించిన ఆర్థిక, రాజకీయ పరిణామాలు భారత కార్మికోద్యమంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ సంక్షోభ భారాలను కార్మిక వర్గంపై మోపడానికి భారత ప్రభుత్వం ప్రయత్నాలు సాగించింది. వేతన స్థంభనతో పాటుగా 'ఎస్మా, మీసా' వంటి రాక్షస చట్టాలతో కార్మిక వర్గంపై దాడి ప్రారంభించింది. దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించి కార్మికులకు రాజ్యాంగ పరంగా లభించిన ప్రాథమిక హక్కులను సైతం హరించివేసింది. దీంతో దేశవ్యాప్తంగా కార్మికవర్గం భారీ సమ్మెలతో పాటు తీవ్ర పోరాటాలకు పూనుకోవాల్సి వచ్చింది.

కార్మికవర్గ పోరాటాల వెల్లువను ఎదుర్కొనటానికి ప్రభుత్వం తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో కార్మిక వర్గ పోరాటాలు సమరశీలతను సంతరించుకోవడంతో, ఈ పోరాట వెల్లువను అడ్డుకోవడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులపై విరుచుకుపడింది. ఈ కాలంలోనే అనేక పరిశ్రమలలో బోనస్, వేతనాల పెంపుదల కోరుతూ కార్మికులు కదం తొక్కారు. అంతేగాక, కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగానూ అనేక ఇతర సమస్యల పరిష్కారానికిగాను అసంఖ్యాకంగా పోరాటాలు వెల్లువెత్తాయి. వస్త్ర పరిశ్రమ నడిచే ప్రధాన కేంద్రాలలో జరిగిన పోరాటాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. బొంబాయిలోని 20 లక్షల మంది టెక్స్‌టైల్ కార్మికులు ఈ డిమాండ్ల సాధనకు అక్టోబరు 11 నుంచి 5 రోజుల పాటు సమ్మె చేసి కార్మికుల సంఘటిత శక్తిని మహోజ్వలంగా ప్రదర్శించారు. ఇతర ప్రధాన టెక్స్‌టైల్ పరిశ్రమ కేంద్రాలైన నాగపూర్, షోలాపూర్, అకోలా, కొల్హాపూర్, కోయంబత్తూరు, కాన్పూరు మొదలైన కేంద్రాలలో సమ్మెలు జరిగాయి. తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న కేరళ కొబ్బరిపీచు పరిశ్రమను రక్షించాలని, కనీస వేతనాల నివేదికను ప్రకటించాలని కోరుతూ లక్షలాది కార్మికులు ఐక్య పోరాటాలు నిర్వహించారు. ఈ కాలంలో జరిగిన ముఖ్య పోరాటాలలో తమిళనాడులోని సింప్సన్ గ్రూప్ పరిశ్రమలలో 18,000 మంది కార్మికులు చేసిన నిరవధిక సమ్మె గమనార్హమైనది. ఈ పోరాటాలను పరిశీలించినట్లయితే కార్మికులు బోనస్ డిమాండ్ మీద దృష్టి సారించారని స్పష్టమవుతుంది.

రైల్వే ఉద్యోగుల సమరశీల పోరాటం

ఆర్థిక సంక్షోభం తీవ్రమై దేశమంతటా పోరాటాలు కొనసాగుతున్న పరిస్థితులలో వివిధ రైల్వే ఉద్యోగుల, కేంద్ర ప్రభుత్వోద్యోగుల యూనియన్లు 1974 మే 8 నుంచి నిరవధిక సమ్మెకు దిగాయి. 'మీసా' చట్టం కింద 50 వేల మంది రైల్వే ఉద్యోగులను, ప్రభుత్వోద్యోగులను అరెస్టు చేశారు. చాలామంది రైల్వే ఉద్యోగులకు సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. 3 వేల మంది కార్మికులను నిరంకుశంగా సర్వీసు నుంచి తొలగించారు. అయినప్పటికీ 20 లక్షల మంది రైల్వే ఉద్యోగులు సాహసంతో, దృఢ దీక్షతో చేసిన పోరాటం భారత కార్మికోద్యమంలో ఒక నూతన చరిత్రను సృష్టించింది. స్వాతంత్ర్యానంతర భారతంలో ఆనాటి వరకు సాగిన కార్మికవర్గ కార్యాచరణలో ఇది నిజంగా అతి పెద్ద పోరాటం.



1974 రైల్వే ఉద్యోగుల సమ్మె

ఎమర్జెన్సీ విధింపు-కార్మికోద్యమంపై భయంకర దాడులు

కార్మికవర్గం ఒకవైపు వేతన స్తంభనకు, ప్రజాతంత్ర హక్కుల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమం సాగిస్తోంది. ఇందిరాగాంధీ ప్రభుత్వం మరోవైపు 1975 జూన్ 26న అంతర్గత అత్యవసర పరిస్థితిని ప్రకటించి ప్రముఖ ప్రతిపక్ష, ట్రేడ్ యూనియన్ నాయకులందరినీ నిర్బంధించి ప్రతీకారానికి పూనుకుంది. పారిశ్రామికవేత్తలు మాత్రం దీనికి స్వాగతం పలికారు.

కార్మికులకు సంఘ నిర్మాణ హక్కు, సమిష్టి సంప్రదింపుల హక్కు వుండాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ నిబంధన (ఐ.ఎల్.ఓ కన్వెన్షన్) నొక్కి చెప్పింది. కానీ ఎమర్జెన్సీ పరిస్థితిలో ట్రేడ్ యూనియన్ల ప్రాథమిక హక్కులను రద్దు చేయడమేగాక న్యాయస్థానాల ద్వారా పరిష్కారాన్ని కూడా నిరోధించారు. ప్రభుత్వం జారీ చేసిన నిరంకుశమైన ఆదేశాల పట్ల కార్మికులలో తీవ్ర నిరసన పెల్లుబికింది. ఇది ఉత్పత్తి మీద తీవ్ర ప్రభావం చూపింది.

దిగజారిన పారిశ్రామికోత్పత్తి

ఆ విధంగా ఎమర్జెన్సీ విధించిన తరువాత 3 నెలల్లోనే భారీగా 15.60 లక్షల పనిదినాలు నష్టమైనాయని స్పష్టమవుతోంది. అంటే కార్మికులు ఎమర్జెన్సీకి తలవంచలేదు. పైపెచ్చు వారు అనేక రంగాలలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో కూడా ఉద్యోగులు ఎదురు దాడులకు భయపడి మౌనంగా కూర్చోకుండా ప్రతిఘటించడం కీలకంగా కనిపిస్తుంది.

లఘు, భారీ పరిశ్రమలలో ఉత్పత్తి తగ్గుముఖం పట్టింది. నిత్యావసర సరకుల ఉత్పత్తి బాగా తగ్గింది. వినిమయ వస్తువులను తయారు చేసే పరిశ్రమలతో పాటు అనేక ఇతర పరిశ్రమలలో కూడా ఉత్పత్తి పడిపోయింది. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గి, కొన్ని పారిశ్రామిక కేంద్రాల్లో కార్మికుల ప్రతిఘటన పెరుగుతున్న ఈ సమయంలో ప్రభుత్వం ఎమర్జెన్సీని అవకాశంగా తీసుకుని పారిశ్రామిక సంబంధాల నియంత్రణకు, ఉత్పత్తిని తిరిగి పెంచేందుకు ప్రయత్నాలు చేసింది. ఎమర్జెన్సీలో ప్రాథమిక హక్కులన్నింటినీ అణగదొక్కిన ప్రభుత్వం 'యాజమాన్యంలో భాగస్వామ్యం' వంటి మోసపూరిత పథకాల ద్వారా కార్మికుల్లో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చడానికి చేసిన ప్రయత్నాలు తుస్సుమన్నాయి.

తిరగబడ్డ కెరటాలు-ఇందిర ప్రభుత్వ ఓటమి

దారుణమైన అణచివేతతో పాటు, ప్రాథమిక హక్కులను అణచివేసినప్పటికీ, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజల పోరాటం ఊపందుకుంది. కాంగ్రెస్‌లో రగుల్కొన్న విభేదాలు, సర్వత్రా ప్రజలలో నెలకొన్న అసంతృప్తి, ఎగసిపడుతున్న ప్రజాగ్రహం నేపథ్యంలో 1977 మార్చిలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఇందిర ఓటమిపాలైంది. అన్ని తరగతుల ప్రజలు, రాజకీయవేత్తలు, మేధావులు, పత్రికా ప్రపంచం, ట్రేడ్ యూనియన్‌లకు వ్యతిరేకంగా ఆమె సాగించిన దమనకాండ, అణచివేత విధానాలు ఆమెను అప్రతిష్టాకరమైన ఓటమిపాలు చేశాయి.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

లేబర్‌కోడ్‌లు

అసత్య ప్రచారాలు ...వాస్తవాలు

ప్రచారం	వాస్తవం
లేబర్ కోడ్‌లతో శ్రామిక శక్తిలో కొత్త శకం ప్రారంభం	లేబర్ కోడ్‌లు కార్మికులను బానిసలుగా మారుస్తాయి. పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులు, రక్షణ ఉండవు.
స్వయం నిర్బర భారత దేశం ఆవిష్కారం	యూనియన్లను పెట్టుకోవడం, సమ్మె చేయడం కూడా అసాధ్యంగా మార్చారు.

వేతనాల కోడ్

వేతనాల కోడ్ అమలు జరిగితే ఈ నాలుగు చట్టాలూ రద్దవుతాయి.

1) వేతనాల చెల్లింపు చట్టం - 1936
2) కనీస వేతనాల చట్టం 1948
3) బోనస్ చెల్లింపు చట్టం 1965
4) సమాన పనికి సమాన వేతన చట్టం 1961

కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలరద్దు.
మోడీ ప్రభుత్వ దుర్మార్గపు చర్యలపై పోరాటమే హద్దు.
దుర్మార్గపు లేబర్ కోడ్లు వద్దే వద్దు

ఉద్ధృతంగా రైల్వే కార్మిక పోరాటాలు

రైల్వే కార్మిక పోరాటాలు తొలినాళ్లలో రాష్ట్రంలో ఉద్ధృతంగా సాగాయి. అప్పట్లో రైల్వేలు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉండేవి. 1936-37 ప్రాంతాల్లో ఆనాటి రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి పోలేపెద్ద నరసింహమూర్తి రైల్వే కార్మికోద్యమ నిర్మాణ బాధ్యతలను చూశారు. రైల్వే లైను వెంబడి తిరుగుతూ, కార్మికులతో సంబంధాలు పెట్టుకుంటూ, వారిని ఉద్యమ కార్యకర్తలుగా ఆయన తీర్చిదిద్దారు. విజయవాడ బ్రాంచ్ రైల్వే కార్మిక సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కూడా నరసింహమూర్తి పనిచేశారు. 1926 నాటి ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం రైల్వే కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, యజమానులు దీనిని ఒప్పుకునేవారు కారు. యూనియన్లలో కీలకంగా ఉంటే ఉద్యోగాల నుండి తొలగించేవారు. అయినా, రైల్వే కార్మికులు సంఘటితంగానే వ్యవహరించేవారు. 1937లో రైల్వే కార్మిక నాయకుడు పి.వి నరసింహం అప్పటి మద్రాసు రాష్ట్ర శాసనసభకు కార్మిక నియోజకవర్గం నుండి ఎన్నికకావడం ఈ ప్రాంతంలో రైల్వే కార్మికుల ఉద్యమానికి ఉన్న ప్రాధాన్యతను తెలియచేస్తోంది. 1938లో నవశక్తి పత్రిక ప్రచురించిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో అప్పటికే 20వేల మంది రైల్వే కార్మికులు పనిచేస్తున్నారు. రాజమండ్రి, విజయవాడ,దొనకొండ, గుంతకల్లులో రైల్వే డివిజన్‌లు ఉన్నాయి.



1929 నాటికే విజయవాడలో రైల్వే పనివారల యూనియన్ ఏర్పాటైంది. యూనియన్‌లో కార్మికులు పెద్ద సంఖ్యలో చేరినప్పటికీ, 1932లో నిర్వహించిన సమ్మె విఫలమైంది. దీంతో యూనియన్ కొంచెం బలహీన పడింది. అయినప్పటికీ, 1936 నుండి మళ్లీ అభివృద్ధి చెందింది. 1938లో రాజమండ్రి, బిట్రగుంటల్లో బ్రాంచ్‌లను కూడా ఏర్పాటు చేసింది. మరోవైపు యూనియన్‌లో చేరేవారిపైన నిర్బంధాలు కూడా పెరిగాయి. గుంతకల్లులాంటి చోట్ల పోలీసులు కార్మికులను బాహాటంగానే బెదిరించారు. అయినా, కమ్యూనిస్టుల చొరవతో ఉద్యమ విస్తృతి పెరిగింది. విజయవాడలో 1938,39 సంవత్సరాల్లో వరుసగా కార్యక్రమాలు జరిగాయి. 1939 మార్చి 29 వ తేదిన కార్మిక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఇచ్చిన డిమాండ్లను రైల్వే బోర్డు తిరస్కరించింది. అదే ఏడాది ఆగస్టు 21న అధిక జీతాలు, ప్రావిడెంట్ ఫండ్‌లను డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. రాజమండ్రిలో రైల్వే కార్మికులు 1938 నాటికి ఇక్కడ 800 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో ఎక్కువ మంది రోజువారీ కూలీలే! సమస్యల పరిష్కారం కోసం వీరు యాజమాన్యానికి అనేక అర్జీలు అందచేశారు. మరోవైపు నెల్లూరు జిల్లా బిట్రగుంటలో రైల్వే కార్మికులపై వేధింపులు తీవ్ర స్థాయిలో ఉండేవి. సిబ్బందికి అత్యవసరమైన పనులకు కూడా సెలవులు ఇవ్వడం నిరాకరించారు. ఒకరికి పెళ్లికి కూడా సెలవు ఇవ్వడానికి నిరాకరించినట్లు రికార్డైంది. ఈ నేపథ్యంలో 1939 ఆగస్టు 21వ తేదిన కార్మికులు పెద్ద ప్రదర్శనను, బహిరంగ సభను నిర్వహించారు. మరో వారం రోజుల్లోనే 28వ తేదిన ముంబాయిలో ట్రేడ్ యూనియన్ నాయకుల అరెస్ట్‌కు నిరసనగా మరో భారీ బహిరంగ సభను జరిపారు.

గుంతకల్లు రైల్వేలోనూ అమానుష పరిస్థితులు కొనసాగాయి. రోజుకి 12 నండి 16 గంటలు పనిచేయించేవారు. ఈ నేపథ్యంలో అక్కడ రైల్వే పనివారల సంఘం కోసం కృషి ప్రారంభమైంది. 100 మంది సభ్యులతో మొట్టమొదట సంఘం ఏర్పడింది. సంఘంలో చేరిన వారికి పోలీసుల నుండి బెదిరింపులు ఎదురయ్యాయి. అయినా, కార్మికులు వెనక్కి తగ్గలేదు. ఇక్కడి నుండి సంఘ నాయకులు పాకాల, ధర్మవరం వంటి ప్రాంతాలకు కూడా వెళ్లి కార్మికుల్లో ప్రచారం సాగించారు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మహిళలకు మంచి!

పనిభారం పెంచి
నైట్‌డ్యూటీలు వేసి
భద్రత తుంచి...
మంచి చేసిందట మహిళలకు!
మభ్యపెట్టే మాటలెంత కాలం
కార్పొరేట్ కమలమా?

సమానత్వం

సమానత్వం అంటే
ఏమిటో తెలుసా?
పెనం మీద నుండి
పొయ్యిలోకి తోయడం!
అర్థం కాలేదా...?
నైట్‌డ్యూటీలంటే డబుల్ ధమాకా!
పగలు ఇంటిపని, వంట పని...
రాత్రి యంత్రాలతో పోటీ పని
మనువాదానికి నకళ్లేగా ..లేబర్‌కోడ్‌లు
కార్పొరేట్ కమలమా!

ఊరూ.. వాడా ప్రచార హోరు

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

సిఐటియు మహాసభ జయప్రదం కోరుతూ విశాఖలో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి - విశాఖ విలేకరుల యంత్రాంగం

సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రచారం జోరందుకుంది. బహుముఖ కార్యక్రమాలతో మహాసభ విశిష్టతను, సిఐటియు గొప్పతనాన్ని కార్మిక వర్గం ప్రజల్లోకి తీసుకెళ్తోంది. అన్ని తరగతుల నుంచీ ఈ ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్‌లో ప్రచార కార్యక్రమం చేపట్టారు. తొలుత సిఐటియు కార్యాలయం నుంచి మహిళలు ర్యాలీగా జగదాంబ జంక్షన్‌కు చేరుకొని అక్కడి నుంచి క్లాక్ టవర్, లేపాక్షి జంక్షన్ మీదుగా ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి మాట్లాడారు. మహాసభను మహిళా లోకం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్న సిఐటియుకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం బస్‌స్టాప్ వద్ద విశాఖ కార్మికోద్యమం, జాతీయోద్యమ ఘట్టాలతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ.. సిఐటియు ఆవిర్భావం నుంచీ విశాఖలో తలపెట్టిన కార్మికోద్యమాల చరిత్రను తెలియజేసే విధంగా రూపుదిద్దుకున్న ఈ ఫొటో ఎగ్జిబిషన్ ప్రజలను ఆకట్టుకుంటోందన్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సిఐటియు నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. దుకాణాలు, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండల కేంద్రం, ఎస్ఇజడ్‌లో ప్రచార జాతా నిర్వహించారు.

28 నుంచి సాహిత్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - విశాఖ

సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా సాహిత్య కార్యక్రమాలను ఈ నెల 28 నుంచి జనవరి రెండు వరకు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ హాల్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సాహిత్య కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి వెనుక శ్రమజీవుల కష్టం, త్యాగం దాగి ఉన్నాయని, అయినా వారి జీవితాలు తీరని నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే శ్రమజీవుల జీవన అనుభవాలను, వారి ఆలోచనలను, ఆశయాలను సాహిత్య రూపంలో ప్రజల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఏడు రోజుల పాటు సాహిత్య కార్యక్రమాలు రూపొందించామని తెలిపారు. సాహితీ స్రవంతి నాయకులు చీకటి దివాకర్ మాట్లాడుతూ.. ఈ సాహిత్య వేదిక ఒక సాధారణ కార్యక్రమం కాదని, శ్రమజీవి జీవన వాస్తవాన్ని ప్రజలకు తెలియజేసే ఆలోచనా వేదిక అని తెలిపారు.

ఈ నెల 28న ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు వంద మంది కవులు, గాయకులతో శ్రమ కవనం కార్యక్రమం జరుగుతుందన్నారు. మొత్తం ఏడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో సుమారు 400 మంది కవులు, రచయితలు పాల్గొంటారని చెప్పారు. రచయిత, సామాజిక రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, వల్లూరి శివప్రసాద్, ఆచార్య ధనరాజ్, గంటేడ గౌరునాయుడు, డివి.సూర్యారావు, అట్టాడ అప్పలనాయుడు, కత్తి పద్మ, జాలాది విజయ, నల్లి ధర్మారావు వంటి ముఖ్యులు హాజరుకానున్నారని తెలిపారు.

హలో కార్మికా.. చలో విశాఖ

సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం కోసం బహుముఖ కార్యక్రమాలు

ఏలూరు జిల్లా మండల కేంద్రమైన నిడమర్రులో సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించి నినదిస్తున్న నేతలు, కార్మికులు

జెండా ఆవిష్కరణలు

ప్రజాశక్తి - యంత్రాంగం

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ ఏలూరు జిల్లా నిడమర్రు మండలంలోని నిడమర్రు, చానమిల్లి, క్రొవిడి గ్రామాల్లో సిఐటియు జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. స్త్రీ శక్తి పథకంపై నష్టపోతున్న ఆటోకార్మికుల సమస్యలపై మహాసభలో చర్చిస్తామని సిఐటియు జిల్లా నాయకులు కామన మునిస్వామి అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరులో మాస్ క్యాంపియన్ నిర్వహించారు. సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం భాగ్యరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. మహాసభను జయప్రదం చేయాలంటూ కోరారు.

అభ్యుదయ గీతాలకు నృత్యం చేస్తున్న పిఎన్ఎం కళాకారులు

పద పదమంటూ.. కర్నూలులో

- **ఆకట్టుకున్న కళారూపాలు**

ప్రజాశక్తి-కర్నూలు

కర్నూలు చెన్నమ్మ సర్కిల్లో శ్రామిక ఉత్సవ్ కళారూపాల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రజానాట్యమండలి సుందరయ్య విజ్ఞాన కేంద్రం, సిఐటియు సంయుక్తంగా కళారూపాలను, నాటికలను ప్రదర్శించారు. శ్రామికులు, కార్మికులు, వారి కుటుంబాలలోని పిల్లల ద్వారా ఈ శ్రామిక ఉత్సవ్‌లో పాల్గొన్నారు. న్యూ సిటీ పరిధిలో మాస్ ఫండ్ క్యాంపెయిన్ చేసిన రూ.50 వేలు జిల్లా కమిటీకి చెక్కు రూపంలో అందించారు.సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ,. ఎండి అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు దివాకర్, నగర కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించిన కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం రద్దుచేసి కేవలం నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. గిగ్ వర్కర్స్‌కు కార్మిక కోడ్స్ ఉపయోగపడతాయని చెబుతున్న ప్రభుత్వం ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో ఎక్కడ స్పష్టంగా చెప్పలేదన్నారు.

తిరుపతిలో పోస్టర్ ఆవిష్కరణ

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68